

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 108

మంగళవారం 9-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




పతాకధారిగా సింధు

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో భారత బృందానికి నాయకత్వం - 16లో



డిస్కౌంట్ల షి'కారు'

భారీగా ధరల తగ్గింపు... ఆకర్షించే ఎక్స్ఛేంజ్ స్కీమ్‌లు - 17లో



నీట్ లీకేజీ నిజమే గానీ...

'నీట్-యూజీ, 2024 పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నది. లీకేజీ వాస్తవమేనని తేలింది' అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది..

- వివరాలు 6లో



మోదీజీ మణిపూర్‌కు రండి

రావణకాష్టంగా మారిన మణిపూర్‌ను ప్రధాని మోదీ ఒక్కసారి సందర్శించి వారి కష్టాలను అర్థంచేసుకోవాలని రాహుల్ గాంధీ కోరారు.

- వివరాలు 6లో



ఆ సెలవులపై మోడల్‌పాలసీ తెండి

ఉద్యోగినులకు రుతుస్రావ సెలవులపై మోడల్‌పాలసీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది.

- వివరాలు 6లో



సంకీర్ణమా, సంక్షోభమా?

ఫ్రాన్స్ ముందస్తు ఎన్నికల్లో సోమవారం వెలువడ్డ ఫలితాల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాలేదు.

- వివరాలు 6లో

కొత్త వైద్య కాలేజీలకు నో

అనుమతి నిరాకరించిన జాతీయ వైద్య మండలి

8 కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇవ్వకుండా ఝలక్

- మౌలిక సదుపాయాలు లేవని, అనేక లోపాలున్నాయని స్పష్టీకరణ
- వైద్య కళాశాలల్లో వసతులపై గతంలోనే ఎన్‌ఎంసీ అసంతృప్తి
- అప్పీల్‌కు వెళ్తామన్న వైద్య విద్యా సంచాలకురాలు వాణి



సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ) ఝలక్ ఇచ్చింది. మొత్తం 8 మెడికల్ కాలేజీలకు అనుమతి లేఖ (లెటర్ ఆఫ్ పర్మిషన్ - ఎల్‌వోపీ) ఇవ్వడానికి నిరాకరించింది. ఈ మేరకు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు మెయిల్ పంపించింది. మౌలిక సదుపాయాలు లేకపోగా, అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించడంతో అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది. సౌకర్యాలు సరిగాలేని కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా గద్వాల, నారాయణపేట, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో వైద్య కళాశాలల కోసం గతేడాది ప్రభుత్వం దరఖాస్తు చేసింది. ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం తనిఖీలకు వచ్చిన ఎన్‌ఎంసీ బృందం బోధనా సిబ్బంది లేకపోవడం (జీరో ఫ్యాకల్టీ)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్ల, ఇన్‌పేషెంట్లు విషయమై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని బోధనాస్పత్రుల్లో ఓపీ బాగానే ఉన్నప్పటికీ, ఐపీ మాత్రం ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు లేదు. ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం 50 సీట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలంటే.. 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. అలా ఒక్కో కాలేజీకి మొత్తం 59 మంది అధ్యాపక సిబ్బంది ఉండాలి. కానీ రాష్ట్ర కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ మినహా మిగతా సిబ్బంది లేరు. అలాగే నిబంధనల ప్రకారం సీనియర్ రెసిడెంట్ వైద్యులు కూడా ఉండాలి. కానీ వాళ్లు లేకుండానే కాలేజీల ఏర్పాటు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. కాగా ఎన్‌ఎంసీ లేవనెత్తిన లోపాలను రాష్ట్ర ప్రభుత్వం 60 రోజుల్లోగా

మిగతా 2వ పేజీలో ▶

గతంలోనే ఎన్‌ఎంసీ గరం

ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనూ అనేకచోట్ల ఇటువంటి పరిస్థితి ఉంటోందని ఎన్‌ఎంసీ గతంలో కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని చాలా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 50 శాతం వరకు అధ్యాపకుల కొరత ఉందని ఎన్‌ఎంసీ గతంలోనే తేల్చడం గమనార్హం. 150 ఎంబీబీఎస్ సీట్లున్న మెడికల్ కాలేజీ అనుబంధ ఆసుపత్రికి రోజుకు 1,200 మంది ఔట్‌పేషెంట్లు ఉండాలి. కానీ ఒక చాలా కాలేజీల్లో సగం మేరకు కూడా ఔట్ పేషెంట్లు రావడంలేదు. ఇది వైద్య శిక్షణకు ఏమాత్రం సరిపోదని నిపుణులు అంటున్నారు. ఇక మెడికల్ కాలేజీ ఆసుపత్రికి 600 పడకలు అవసరం కాగా, చాలాచోట్ల 500-550తోనే నడిపిస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో బెడ్ ఆక్యుపెన్సీ కేవలం 10 శాతం వరకే ఉంటోంది. వైద్య విద్యకు ఇది ఏమాత్రం సరిపోదని చెబుతున్నారు. లెక్చర్ హాళ్లు, పరీక్షా కేంద్రాలు అవసరమైన సంఖ్యలో లేవు. మెడికల్ కాలేజీల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా 450 మందికి సరిపోయేలా హాస్టల్ వసతి ఉండాల్సి ఉండగా, 150 మంది బాలికలు, 190 మంది బాలురకు సంబంధించిన హాస్టల్ వసతి మాత్రమే ఉంది. కొన్ని కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల శిక్షణ కోసం అవసరమైన అల్ట్రాసౌండ్ యంత్రాలు కూడా లేకపోవడం గమనార్హం.



హైదరాబాద్‌లోని పంజగుట్టలో వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మల్లు రవి, మధుయాష్కీ, దీపాదాస్ మున్షీ, షబ్బీర్ అలీ, కేవీపీ, వంశీచంద్, అనిల్, విజయారెడ్డి తదితరులు 2లో

కాంగ్రెస్ నేతలకు వైఎస్ జయంతి కానుక 2లో



ఇడుపులపాయలో దివంగత సీఎం డా. వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విజయమ్మ, భారతి తదితరులు 14లో

న్యూస్‌రీల్

'వాటర్ మిలన్.. బ్లూబెర్రీ'లతో జాగ్రత్త



డ్రగ్స్ ముఠాలు అమాయకులైన యుక్త వయస్సులోని విద్యార్థుల బలహీనతలు ఆసరాగా చేసుకుని వారికి మత్తుపదార్థాలు అలవాటు చేసే దారుణ కృత్యాలకు పాల్పడుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 18లో

స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలివ్వలేవు



పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత నిర్ణయంపై స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయలేవని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఫిర్యాదులపై నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు కల్పించిందన్నారు.

- వివరాలు 2లో

పీఎంఏవై మార్గదర్శకాల మేరకే ఇందిరమ్మ ఇళ్లు



పేదల ఇళ్ల పథకంలో కేంద్రప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను తు.చ.తప్పకుండా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 5లో

సీఎం రేవంత్‌తో ఎమ్మెల్సీ చల్లా భేటీ



గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరగా.. పాలమూరుకు చెందిన మరో ఇద్దరు ముఖ్య నేతలు అదే బాటలో నడుస్తున్నట్టు తెలుస్తోంది. సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు.

- వివరాలు 2లో



కనీసం మధ్యమధ్యలోనైనా ఏపీకి వెళ్లొస్తుంటే బావుంటుందేమో సార్!

సోమవారం రష్యా రాజధాని మాస్కోలో ప్రవాస భారతీయులతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ



మాస్కోలో ప్రధాని మోదీ

- నేడు పుతిన్‌తో ప్రధాని మోదీ విస్తృతస్థాయి చర్చలు
- 22వ ఇండో-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సుకు సిద్ధమైన అగ్రనేతలు

6లో

4 కేటగిరీలుగా ప్రాజెక్టులు!

- ప్రాథమ్యాలకనుగుణంగా సాగునీటి ప్రాజెక్టుల వర్గీకరణ
- కేటగిరీ-ఏలోని 6 ప్రాజెక్టులు ఇదే ఏడాది పూర్తి..
- బీ విభాగంలో వచ్చే మూడేళ్లలో పూర్తికానున్న 12 ప్రాజెక్టులు
- 'సీ'లో 2026-27 తర్వాత పూర్తయ్యేవి

3లో

అన్ రిజర్వ్‌డ్ సీట్లు 10 వేలు

ఈ ఇంజనీరింగ్ సీట్లలో ఏపీ విద్యార్థులకూ చాన్స్



- ఈ ఒక్క ఏడాదికే అవకాశం
- తెలంగాణ విద్యార్థులకు మిగతా 85% కన్వీనర్ సీట్లు

3లో

స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాల నాటికి స్పష్టమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రతిపాదనలు అందించిన 24 గంటల్లోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ఈ అంశంపై వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులతో కలిసి ముఖ్యమంత్రి గురువారం చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. స్కిల్

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు పాలమూరుకు సీఎం రేవంత్ రాక

- వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. అక్కడ మొక్కలు నాటిన అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులతో భేటీ కానున్నారు. ఆ తర్వాత మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించడంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితర అంశాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి దామోదర రాజనరసింహతో పాటు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్షించనున్నారు. సమావేశం అనంతరం భూత్పూర్ రోడ్‌లోని ఏఎస్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరనున్నారు.

ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బెయిల్‌కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన మరో పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణను వాయిదా వేసింది. కుంభకోణంలో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన మూడో అనుబంధ చార్జిషీటు పరిగణనపై ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సోమవారం విచారించారు. ఇదే సందర్భంలో కవిత దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌ను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ కేసులో సీబీఐ నిర్ణీత సమయంలోగా దర్యాప్తు పూర్తి చేయలేకపోయిందని, ఈ నేపథ్యంలో బెయిలు మంజూరు చేయాలని కవిత న్యాయవాదులు కోరారు. కవిత పిటిషన్‌పై గురువారంలోపు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించిన న్యాయమూర్తి విచారణ శుక్రవారానికి వాయిదా వేశారు. అదేరోజు సీబీఐ అనుబంధ చార్జిషీటుపైనా న్యాయమూర్తి విచారించనున్నారు.

మంత్రి పదవి ఆశిస్తున్నా... సీఎంకు చెప్పిన

- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సాక్షి, హైదరాబాద్: తాను మంత్రి పదవి ఆశిస్తున్నానని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేశానని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కేబినెట్‌లో గొల్ల కురుమలకు అవకాశం కల్పించాలనే విషయాన్ని సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మిగతా మంత్రులకు కూడా చెప్పినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గొల్ల కుర్మలకు ప్రతినిధిగా మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరినట్లు ఐలయ్య చెప్పారు. 50 లక్షల పైచిలుకు జనాభా వున్న గొల్లకుర్మలకు ప్రభుత్వంలో పదవులు ఇవ్వాలని కోరారు. ఆంధ్రలో ముగ్గురికి మంత్రి వర్గంలో చాన్స్ ఇచ్చారని, ఇక్కడ కూడా మంత్రివర్గంలో చోటుతోపాటు ఎమ్మెల్సీ, ఒక సలహాదారు పదవి, ఐదు కార్పొరేషన్లు, పీసీసీ చీఫ్ పోస్ట్‌తో పాటు పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని అన్నారు. సీఎంపై నమ్మకం ఉందని, తనకు మంత్రి పదవి వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరు వచ్చినా పార్టీలో చేర్చుకుంటామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

రేపట్నుంచి ఆన్‌లైన్ స్కిల్ ఎడ్యుకేషన్ మేళా

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి వారం రోజుల పాటు ఆన్‌లైన్ స్కిల్ ఎడ్యుకేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ విదేశాల్లో మెరుగైన ఉద్యోగాల్లో అవకాశం కల్పించే 50కి పైగా ఐటీ, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఈ ఆన్‌లైన్ స్కిల్ ఎడ్యుకేషన్ మేళా ద్వారా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చైన్, వంటి 50కి పైగా కోర్సులను ఈ మేళా ద్వారా ఆఫర్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కోర్సులను ఎవరు ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో నేర్చుకునే విధంగా రూపొందించామని, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్హత గల వారికి వారి అర్హత ఆధారంగా స్కిల్ ఎడ్యుకేషన్ మేళాలో కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు వివరించారు. మేళాలో పాల్గొన్న అభ్యర్థులకు 80 % ఫీజు రాయితీ ఉంటుందని, ఇక్కడ ఒక కోర్సులో చేరిన అభ్యర్థికి ఇంకొక కోర్సు ఉచితంగా నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. www.nationalskillacademy.in ద్వారా అప్లై చేసుకోవాల్సి ఉంటుందని, ఇతర వివరాలకు 9505800050, 9505800047 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమానికి మారుపేరు వైఎస్

అన్ని పార్టీలు, నేతలు ఆయన చేసిన సంక్షేమాన్నే అమలు చేస్తున్నారు

వై.ఎస్. రాజశేఖరరెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గాంధీ భవన్‌లో ఘనంగా వైఎస్ 75వ జయంతి వేడుకలు

రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్న వై.ఎస్. కల నెరవేర్చాలని కార్యకర్తలకు పిలుపు



ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేవీపీ రామచంద్రరావు, దీపాదాస్‌మున్షీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, షబ్బీర్ అలీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో సంక్షేమం అంటే గుర్తుకు వచ్చే పేరు వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు వై.ఎస్. చేసిన సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని గాంధీ భవన్‌లో సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమంపై వై.ఎస్. చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఉపయోగపడుతోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలకు స్ఫూర్తి రాజశేఖరరెడ్డేనని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైల్, గోదావరి, కృష్ణా జలాల వినియోగం, హైదరాబాద్‌లో పెట్టుబడులకు కూడా ఆయనే స్ఫూర్తి అని రేవంత్ కొనియాడారు. వై.ఎస్. స్ఫూర్తి ని తమ ప్రభుత్వం, పార్టీ కొనసాగిస్తుందన్నారు. నాడు ఆయన చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు చేసిన పాదయాత్రే రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు స్ఫూర్తినిచ్చిందన్నారు. 2009లో రెండోసారి సీఎం అయ్యాక రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని వై.ఎస్. చెప్పారని.. కానీ రాహుల్ ప్రధాని కాకుండానే ఆయన దూరమయ్యారని విచారం వ్యక్తం చేశారు. వై.ఎస్. స్ఫూర్తి తో దేశంలో కాంగ్రెస్ కార్యకర్తలంతా కొట్లాడి రాహుల్‌ను ప్రధాని చేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ఆయన అభిమానులంతా కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు.

వైఎస్ స్థానం సుస్థిరం: డిప్యూటీ సీఎం భట్టి


అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది మంది ప్రజల హృదయాల్లో వై.ఎస్. స్థానం సుస్థిరంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన జలయజ్ఞం ఫలితంగానే నేడు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రజానీకానికి మేలు జరుగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి ప్రతిష్టాత్మక పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలను వై.ఎస్. ఆదుకున్నారని చెప్పారు. తెలంగాణ వడివడిగా అభివృద్ధివైపు అడుగులు వేయడానికి వై.ఎస్. వేసిన పునాదులే కారణమన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నేడు హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపారని కొనియాడారు. అనంతరం గాంధీభవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజాభవన్‌లో వైఎస్సార్ ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన సీఎం

లక్డీకాపూల్/పంజగుట్ట/బంజారాహిల్స్: మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వై.ఎస్. భౌతికంగా ప్రజల మధ్య లేకున్నా ఆయన స్ఫూర్తి బతికే ఉంటుందన్నారు. వై.ఎస్. 75వ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన జీవిత విశేషాలను తెలియజేస్తూ సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వై.ఎస్. ఫొటోలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం పంజగుట్ట కూడలిలోని వై.ఎస్. విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. మరోవైపు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1/10లోని సిటీ సెంటర్ వద్ద ఉన్న వై.ఎస్. విగ్రహానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్, వై.ఎస్. ఆప్తమిత్రుడు కేవీపీ, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘన నివాళులు అర్పించారు.

తెలంగాణలో బాబు రాజకీయం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- బీజేపీ చేతిలో ఆయన పావు
- ఏపీ తరహాలో ఇక్కడా చేయాలనుకుంటున్నారు
- కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు జాగ్రత్తగా ఉండాలి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని ముందుపెట్టి బీజేపీ రాజకీయం ప్రారంభించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆడిన విధంగానే ఇక్కడ బీజేపీతో కలిసి నాలుగు స్తంభాలాట ఆడాలనేది చంద్రబాబు వ్యూహమని, ఎవరు ఎన్ని ఎత్తులు వేసినా తెలంగాణలో కాంగ్రెస్ కార్యకర్తల శక్తిని నిర్వీర్యం చేయలేరని పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు బి.లింగం యాదవ్, గజ్జి భాస్కర్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు హైదరాబాద్ ఎన్నోసార్లు వచ్చి వెళ్లారని, అయినా ఎవరికీ తెలిసేది కాదని, ఇప్పుడు విభజన సమస్యల పేరుతో మళ్లీ హైదరాబాద్‌లో బాబు ప్రవేశించారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి బీజేపీ వేస్తున్న ఎత్తుగడలో చంద్రబాబు పావుగా వ్యవహరిస్తున్నారని, బీజేపీ డైరెక్షన్‌లోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని విమర్శించారు. అందుకే చంద్రబాబు వ్యాఖ్యలను కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా సమర్థించారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీకి పునాది వేసింది కాంగ్రెస్ పార్టీ అని, హైటెక్‌సిటీకి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలోనే పునాదులు పడ్డాయని, ఇప్పుడు చంద్రబాబు డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధినే బాబు, కేసీఆర్ కొనసాగించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఇప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తాను నామినేటెడ్ పదవులు ఆశించే వాడిని కాదని స్పష్టం చేశారు. రాజుయుద్ధం చేసి గెలిచినట్టు సంగారెడ్డి రాజ్యానికి మళ్లీ ప్రజలు గెలిపించి తనను రాజును చేస్తారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

ఏపీ సీఎం టీడీపీ ప్రయోజనాల కోసమే వచ్చినట్టుంది

- మాజీ ఎంపీ విజయశాంతి



సాక్షి, హైదరాబాద్: ఉభయ తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కు వచ్చినట్లు అందరూ భావించారని, కానీ ఆయనకు తెలుగు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలకంటే టీడీపీ ప్రయోజనాలే ముఖ్యమని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ విజయశాంతి అభిప్రాయపడ్డారు. ఆయనకు రహస్య ఎజెండాలు ఉన్నాయేమోననే అనుమానం కలుగుతోందని సోమవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 'తెలంగాణలో మళ్లీ తెలుగుదేశం పార్టీ విస్తరిస్తుందని చంద్రబాబు చేసిన ప్రకటనే ఇందుకు ఉదాహరణ. తెలంగాణలో తెలుగుదేశం బలపడుతుందని అనడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణలో తెలుగుదేశం ఎప్పటికీ బలపడదు. తన కూటమి భాగస్వామి అయిన బీజేపీతో కలిసి తెలంగాణలో బలపడాలని కుట్రలు చేయడానికి ప్రయత్నిస్తే టీడీపీతో పాటు బీజేపీ కూడా ఇక్కడ గల్లంతయ్యే అవకాశాలు తప్పకుండా ఏర్పడతాయి. తెలంగాణవాదులు, ఉద్యమకారులు పోరాట ప్రస్థానానికి కదలడం నిశ్చయమైన భవిష్యత్ వాస్తవం'అని విజయశాంతి స్పష్టం చేశారు.

స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలివ్వలేవు

- 'అనర్హత'పిటిషన్లపై హైకోర్టులో ఏజీ వాదనలు
- తదుపరి విచారణ ఈ నెల 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత నిర్ణయంపై స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయలేవని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫిర్యాదులపై నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు కల్పించిందన్నారు. రిట్ పిటిషన్లు దాఖలు చేయడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది తొందరపాటు చర్య అని పేర్కొన్నారు. అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 11కు వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావును అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన కడియం, తెల్లం ఆ తర్వాత తమ శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. అందుకే వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరారు. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వట్లేదని.. ఈ-మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకొనేలా స్పీకర్‌ను ఆదేశించాలని వివేకానంద విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం తన పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని.. ఆయన్ను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. దీనిపై ఏజీ వాదిస్తూ పిటిషన్లు సమర్పించిన వెంటనే స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోవట్లేదని పిటిషనర్లు పేర్కొనడం సరికాదన్నారు. ఫిర్యాదు చేసిన 10 రోజుల్లోనే త్వరగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారని చెప్పారు. ఈ సందర్భంగా తన వద్ద పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంటూ కోర్టులు స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వలేవంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను వివరించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు.

స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు ప్రముఖుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి అవకాశాలే లక్ష్యం

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందించేలా నైపుణ్య విశ్వవిద్యాలయం కృషి చేయాల్సిన అవసరముందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ఇందుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఐఎస్‌బీ తరహాలో ఒక బోర్డు ఏర్పాటు అంశం ఈ సందర్భంగా చర్చకొచ్చింది. స్కిల్ యూనివర్సిటీలో ఉండాల్సిన కోర్సులు, బోధన ప్రణాళికపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికపరమైన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరికులమ్, కోర్సులకు సంబంధించి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాలని తెలిపారు. నిర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున, ప్రతీ ఐదు రోజులకోసారి సమావేశం కావాలని సీఎం వారికి దిశానిర్దేశం చేశారు.

ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమా..?

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది? ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టగలదా అనే అంశాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులతో కన్సల్టెన్సీ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. యూనివర్సిటీ వ్యవహారాలకు పరిశ్రమలశాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ సతీష్‌రెడ్డి, భారత్ బయోటెక్ హరిప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడున్న సిబ్బందితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, శ్రీధర్ బాబు తదితరులు గ్రూపు ఫొటో దిగారు.

కొత్త వైద్య కాలేజీలకు నో

▶ మొదటి పేజీ తరువాయి

సవరించుకోవాలి. లేనిపక్షంలో అనుమతులివ్వదు. కాగా ఈ విషయంపై డీఎంఈ డాక్టర్ వాణి 'సాక్షి'కి వివరణ ఇచ్చారు. లెటర్ల కోసం ఎదురుచూస్తున్నామని, అవి అందిన తర్వాత అప్పీలుకు వెళ్తామని తెలిపారు.

బోధనా సిబ్బంది లేరు.. వసతుల్లేవు

రాష్ట్రంలో 29 ప్రైవేటు వైద్య కళాశాలలు కలిపి మొత్తం 56 మెడికల్ కాలేజీలున్నాయి. వీటిల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రైవేట్ కాలేజీల్లో 3,790 సీట్లు ఉండగా ఎక్కువ కాలేజీల్లో 150 చొప్పున మాత్రమే ఉన్నాయి. వీటిల్లో మౌలిక వసతులు, అధ్యాపకులు, రోగుల వివరాలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. అనేకచోట్ల పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు తరగతులు లేక ఖాళీగా ఉంటున్నారు. ఔట్ పేషెంట్లు రాకపోవడంతో పీజీ విద్యార్థులు ప్రాక్టికల్ శిక్షణ పొందలేకపోతున్నారు. కొందరు విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యను తూతూ మంత్రంగా పూర్తి చేస్తున్నారు. కొందరు పీజీ మెడికల్ కోసం కోచింగ్‌లకు వెళ్తున్నారు. ఏదో పరీక్ష పాసైతే చాలన్న అభిప్రాయం అటు విద్యార్థులు, ఇటు కాలేజీల యాజమాన్యాల్లోనూ నెలకొందనే విమర్శలు విన్పిస్తున్నాయి. వాస్తవానికి వసతులు లేవని విద్యార్థులు కూడా బయటకు చెప్పలేని స్థితిలో ఉన్నారు. చెప్పినా, నిరసన వ్యక్తం చేసినా ప్రాక్టికల్ పరీక్షల్లో తక్కువ మార్కులు వేస్తారన్న భయం వారిలో ఉంటోంది.

కాంగ్రెస్ వేధింపులకు వడ్డీతో సహా చెల్లిస్తాం: కేటీఆర్

- పీర్జాదిగూడలో ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం
- పోలీసు నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని అడ్డుకోలేవు



సాక్షి, హైదరాబాద్: ప్రజలు, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్న వేధింపులకు మళ్లీ వడ్డీతో సహా చెల్లిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. కక్ష సాధింపుతో మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో ప్రజలు కట్టుకుంటున్న ఇళ్లను కూలగొట్టిన వ్యవహారంపై విచారణ జరపాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు రాందాస్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ అమర్‌సింగ్ కుటుంబం ఈ ప్లాట్లను విక్రయించగా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని గుర్తు చేశారు. దీనిని పట్టా భూమిగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వగా, మున్సిపల్ అధికారులు కూడా అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో అనేక మంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణం చేస్తుండగా, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏం ఆశించి సోమవారం ఈ ఇళ్లను కూల్చివేయించారో విచారణ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎంకు సోదరుడిగా చెప్పుకుంటూ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న చేస్తున్న అరాచకాలపై ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోవాలని రేవంత్‌కు కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్ల యజమానులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

కాంగ్రెస్ నేతలకు వైఎస్ జయంతి కానుక

34 మందిని కార్పొరేషన్ చైర్మన్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ..మరొకరు వైస్‌చైర్మన్‌గా

ఒకట్రెండు పదవుల్లో మార్పులు.. తొలుత ప్రకటించిన జాబితాలో రెండు పేర్లు ఔట్

సాక్షి, హైదరాబాద్ : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కార్పొరేషన్ చైర్మన్‌ల ఉత్తర్వులు ఎట్టకేలకు విడుదలయ్యాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కానుకగా 34 మంది కాంగ్రెస్ నేతలను రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా అధికారికంగా నియమించారు. మరొకరిని వైస్‌చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేరిట మార్చి 15వ తేదీతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా చైర్మన్లు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందు మొత్తం 37 మంది కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పదవులు లభించాయి. వీరిలో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జగదీశ్వరరావు తనకు నామినేటెడ్ పదవి వద్దనడంతో ఆయన పేరు అధికారిక జాబితాలో లేదని తెలుస్తోంది. ఆయన్ను ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) చైర్మన్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించగా, తాజా జాబితాలో ఆ పోస్టును ఖమ్మం జిల్లాకు చెందిన మువ్వా విజయ్‌బాబుకు కేటాయించారు. ఆయనకు గతంలో కేటాయించిన విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ పదవిని ఎవరికీ కేటాయించలేదు. ఇక కరీంనగర్ జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారద పేరు కూడా అధికార జాబితాలో లేదు. ఆమెను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో కమిషన్ల నియామకానికి గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని, అందుకే ఆమె పేరు పెండింగ్‌లో పెట్టారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇక, గతంలో ప్రకటించిన జాబితాలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కార్పొరేషన్‌ను మార్చారు. ఆయనకు గతంలో డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రకటించినా. ఆ పదవిని యాదవ సామాజికవర్గానికి చెందిన నేతలకు కట్టబెట్టాలన్న ఆలోచనతో జ్ఞానేశ్వర్‌ను ముదిరాజ్ కార్పొరేషన్‌కు మార్చారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్‌గా గతంలో కోట్నాక్ నాగును నియమించగా, ఆయన స్థానంలో కోట్నాక్ తిరుపతిని ప్రకటించారు. ఇక, సామాజికవర్గాల వారీగా పరిశీలిస్తే రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలకు 12, కమ్మలకు 3, వెలమలకు 1, ముస్లింలకు మూడు, ఆర్యవైశ్య, బ్రాహ్మణులకు ఒక్కోటి చొప్పున పదవులు లభించాయి. బీసీల్లో గౌడ్‌లకు 4, ముదిరాజ్‌లకు 2, మున్నూరుకాపులకు రెండు, వడ్డెర, పద్మశాలి, లింగాయత్‌లకు ఒక్కో పదవి లభించింది. ఎస్సీలకు 1, ఎస్టీలకు 3 కార్పొరేషన్లు ప్రకటించారు. కాగా, కార్పొరేషన్ చైర్మన్‌లను నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన రోజే పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే చాలా కాలం వేచి ఉన్నామని, ఇక ఉత్తర్వులు వచ్చిన తర్వాత ఇంకా వేచి ఉండడం ఎందుకంటూ హడావుడిగా వెళ్లి తమ తమ కార్యాలయాల్లోని సీట్లలో ఆసీనులు కావడం గమనార్హం.

చైర్మన్ పేరు	కార్పొరేషన్
ఎస్.అన్వేశ్‌రెడ్డి	రాష్ట్ర విత్తనాభివృద్ధి
కాసుల బాలరాజు	ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్
జంగా రాఘవరెడ్డి	కోఆపరేటివ్ ఆయిల్ సీడ్ గ్రోయర్స్ ఫెడరేషన్
మానాల మోహన్‌రెడ్డి	కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్
రాయల నాగేశ్వరరావు	వేర్ హౌసింగ్
జ్ఞానేశ్వర్ ముదిరాజ్	ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్
మెట్టు సాయికుమార్	ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీస్
ఎండీ.రియాజ్	గ్రంథాలయ పరిషత్
పొదెం వీరయ్య	ఫారెస్ట్ డెవలప్‌మెంట్
కల్వ సుజాత	ఆర్యవైశ్య
ఆర్. గురునాథ్‌రెడ్డి	పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్
ఎన్. గిరిధర్‌రెడ్డి	సెట్విన్
జనక్ ప్రసాద్	కనీస వేతనాల సలహాబోర్డు
ఎం.విజయబాబు	ఇరిగేషన్ డెవలప్‌మెంట్
నాయుడు సత్యనారాయణ	చేనేత అభివృద్ధి
ఈరవత్ అనిల్	ఖనిజాభివృద్ధి
నిర్మలా జగ్గారెడ్డి	పారిశ్రామిక మౌలిక వసతులు
ఐత ప్రకాశ్‌రెడ్డి	వాణిజ్య ప్రోత్సాహక
మన్నె సతీశ్‌కుమార్	టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్
చల్లా నర్సింహారెడ్డి	పట్టణ ఆర్థిక వసతుల అభివృద్ధి
కె.నరేందర్‌రెడ్డి	శాతవాహన నగరాభివృద్ధి సంస్థ (సుడా)
ఇ.వెంకట్రామిరెడ్డి	కాకతీయ నగరాభివృద్ధి సంస్థ (కుడా)
మల్‌రెడ్డి రాంరెడ్డి	రహదారుల అభివృద్ధి కార్పొరేషన్
పటేల్ రమేశ్‌రెడ్డి	పర్యాటక అభివృద్ధి
ఎం.ఫహీమ్	తెలంగాణ ఫుడ్స్
బండ్రు శోభారాణి	మహిళా సహకార అభివృద్ధి
ముత్తినేని వీరయ్య వర్మ	వికలాంగుల సహకార అభివృద్ధి
కె.శివసేనారెడ్డి	స్పోర్ట్స్ అథారిటీ
అలేఖ్య పుంజాల	సంగీత నాటక అకాడమీ
ఎస్.ప్రీతమ్	ఎస్సీ సహకార ఆర్థికాభివృద్ధి
నూతి శ్రీకాంత్	బీసీ సహకార ఆర్థికాభివృద్ధి
బెల్లయ్య నాయక్	ఎస్టీ సహకార ఆర్థికాభివృద్ధి
కోట్నాక తిరుపతి	గిరిజన సహకార
జెరిపెటి జైపాల్	ఎంబీసీ అభివృద్ధి
ఎంఏ.జబ్బార్	మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్

సీఎం రేవంత్‌తో ఎమ్మెల్సీ చల్లా భేటీ

- అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై వినతిపత్రం అందజేత
- ఊహాగానాల వెల్లువ.. 14 లోపు కాంగ్రెస్‌లో చేరే అవకాశం
- ఆయనతో పాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా..



సీఎం రేవంత్‌కి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి.చిత్రంలో మల్లు రవి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇటీవలే బీఆర్ఎస్‌కు చెందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరగా.. మరో ఇద్దరు ముఖ్య నేతలు సైతం ఆయన బాట లో నడుస్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించడంతోపాటు వినతిపత్రం అందజేసినట్టు చల్లా ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే ప్రస్తుత పరిణామాల క్రమంలో ముఖ్యమంత్రితో చల్లా భేటీ హాట్ టాపిక్‌గా మారింది. చల్లాతోపాటు ఆయన అనుచరుడు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్టు ప్రచారం జోరుగా సాగుతోంది.

చేరడం ఖాయమే..

ఎమ్మెల్సీ చల్లాతోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైనప్పటికీ.. చేరికకు కొంత సమయం పట్టవచ్చని చల్లా ముఖ్య అనుచరులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనుండగా, అదే రోజు చేరిక ఉంటుందని భావించారు. అయితే మరో రెండు, మూడు రోజుల్లో చల్లా మరోసారి ముఖ్యమంత్రితో భేటీ కానున్నట్టు సమాచారం. ఆ తర్వాత ఈ నెల 14 వరకు మంచి రోజులు ఉండడంతో ఆ రోజు లేదా ఆ తేదీ లోపు ఎప్పుడైనా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ 14 వరకు కాంగ్రెస్‌లో చేరకపోతే ఆషాఢం తర్వాత ఆ పార్టీలోకి వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి పాలమూరులో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 12 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇటీవల గద్వాల ఎమ్మెల్యే కారు దిగి హస్తం గూటికి చేరారు. ఇదే క్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే చేయి అందుకున్న పక్షంలో కాంగ్రెస్‌కు సంపూర్ణ బలం చేకూరనుంది.

క్లుప్తంగా...

మతపరమైన ఊరేగింపులకు 'రూపవతి' ఏనుగుకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహిస్తున్న పలు మతపరమైన ఊరేగింపులు, కార్యక్రమాల నిర్వహణ కోసం కర్ణాటక దావణగెరెలోని శ్రీజగద్గురు పంచాచార్యా మందిర ట్రస్ట్ నుంచి 'రూపవతి'అనే ప్రైవేట్ ఏనుగును తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ఏనుగును ఈనెల 9 నుంచి 29 వరకు పలు కార్యక్రమాల నిమిత్తం తీసుకొచ్చేందుకు అంగీకారం తెలిపింది. 9న నగరానికి చేరుకున్నాక 13న ఈ ఏనుగు బీబీకా ఆలం ఊరేగింపు రిహార్సల్‌లో పాల్గొంటుంది. 17న లేదా 18న చంద్రుడు కనబడటాన్ని బట్టి బీబీకా ఆలం ఊరేగింపులో పాల్గొంటుంది. 22న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద బోనాల జాతర ఊరేగింపులో పాల్గొననుంది. మళ్లీ 28న కార్వాన్ సబ్జిమండిలోని నల్లపోచమ్మ, మహంకాళి దేవాలయం బోనాల జాతర ఊరేగింపులో పాల్గొంటుంది. 29న హరీబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయంలో బోనాల జాతర ఊరేగింపులో పాల్గొన్నాక అదే రోజు కర్ణాటకకు తరలించనున్నారు. మిగతా రోజుల్లోనూ నగరంలో దాని సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో పీసీసీఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఈమేరకు వన్యప్రాణి అనుమతుల నిమిత్తం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా సదస్సులు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17 నుంచి 25 వరకు మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో బీజేపీ ఓట్లు-సీట్లు పెరిగిన నేపథ్యంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు సంబంధించిన సంస్థలు మైనార్టీల మీద విస్తృతంగా దాడులు చేస్తున్నాయని ఆరోపించాయి. సోమవారం హైదరాబాద్‌లో వామపక్షాల సమావేశం జరిగింది. 'రాష్ట్రంలో మత సామరస్యం కాపాడుకోవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని వాడుకునే ప్రయత్నాలను వ్యతిరేకించాలి. ఇందుకు తెలంగాణ ప్రజానీకాన్ని చైతన్యపరిచేందుకు వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ చేయాలి'అని నిర్ణయించారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ ఇ.టీ.నరసింహ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రమ, రామచందర్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ గోవర్ధన్ ఎం.శ్రీనివాస్, ఆకుల పాపయ్య, ఎంసీపీఐ వనం సుధాకర్, ఎస్‌యూసీఐ (యు) రవితేజ, ఆర్ఎస్‌పీ నుంచి జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

4 కేటగిరీలుగా ప్రాజెక్టులు!

- ప్రాథమ్యాలకనుగుణంగా సాగునీటి ప్రాజెక్టుల వర్గీకరణ
- కేటగిరీ-ఏ లోని 6 ప్రాజెక్టులు ఇదే ఏడాది పూర్తి
- బీ విభాగంలో వచ్చే మూడేళ్లలో పూర్తికానున్న 12 ప్రాజెక్టులు
- సీ విభాగంలో 2026-27 తర్వాత పూర్తయ్యే ప్రాజెక్టులు
- ఈ ఏడాది అన్ని కేటగిరీల ప్రాజెక్టులపై రూ.19,287 కోట్ల ఖర్చు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రాథమ్యాలకు అనుగుణంగా సాగునీటి ప్రాజెక్టులను ఏ, బీ, సీ, డీ అనే 4 కేటగిరీలుగా విభజించింది. 2024-25లో 100 శాతం నిర్మాణం పూర్తికానున్న 6 ప్రాజెక్టులను కేటగిరీల-ఏలో చేర్చింది. ఏటా 6 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు చొప్పున వచ్చే ఐదేళ్లలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కొత్త ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇప్పటికే 75 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న నీల్వాయి, పింప్రి, పాలెంవాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజీ-2, సదర్మట్ ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.241 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఇందులోని సదర్మట్ ప్రాజెక్టును నెలాఖరులోగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించే అవకాశముంది. దీని ద్వారా 18,016 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నాలుగు కేటగిరీల ప్రాజెక్టులపై 2024-25లో రూ. 19,287 కోట్లను ఖర్చు చేయాల్సి ఉండగా ఇదే ఏడాది మొత్తం 6.65 లక్షల కొత్త ఆయకట్టు, స్థిరీకృత ఆయకట్టుకు సాగునీరు లభించనుంది.

2026-27 తర్వాతే కేటగిరీ-సీ ప్రాజెక్టులు

కేటగిరీ-సీ కింద చేర్చిన ప్రాజెక్టుల కింద ఆయకట్టు 2026-27 తర్వాత అందుబాటులోకి రానుంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా 3.6 లక్షల ఎకరాలు, సీతారామ ప్రాజెక్టు ద్వారా 3.28 లక్షల ఎకరాలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 2024-25లో రూ. 6,300 కోట్ల విలువైన పనులు పూర్తి చేస్తేనే 2026-27 నాటికి కొంతవరకు ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని నీటిపారుదల శాఖ ప్రతిపాదించింది.

ప్రాధాన్యం లేని ప్రాజెక్టుగా కాళేశ్వరం

కేటగిరీ-డీలో ప్రాధాన్యతలేని ప్రాజెక్టులను ప్రభుత్వం చేర్చింది. చెక్‌డ్యామ్‌ల వంటి నిర్మాణాలు సైతం అదే కేటగిరీలో ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు సైతం ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో లేదు. అయితే ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీలు-9, 20, 20ఏ, 22 కింద కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉండటంతో ఆ పనులనే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పాలమూరు ప్రాజెక్టులపై ఉత్తమ్ సమీక్ష..

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి ఆ జిల్లాకు సంబంధించిన సాగు నీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం జలసౌధలో ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సన్నాహక సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నారాయణ్‌పేట-కొడంగల్ తదితర ప్రాజెక్టులపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు.

మూడేళ్లలో బీ-కేటగిరీ ప్రాజెక్టులు పూర్తి..

కేటగిరీ-బీ కింద మరో 12 ప్రాజెక్టులను ప్రభుత్వం చేర్చగా వాటి పూర్తికి మూడేళ్లు పట్టనుంది. 2024-25లో పాక్షికంగా కొంత ఆయకట్టుకు సాగునీరు అందించనుండగా మిగిలిన ఆయకట్టుకు 2025-26, 2026-27లలో అందించనుంది. దీంతో కేటగిరీ-బీ ప్రాజెక్టుల పనులను ప్రభుత్వం మూడు విభాగాలుగా ప్రభుత్వం విభజించింది. ఒక్కో ఏడాది ఒక్కో విభాగం పనుల చొప్పున మూడేళ్లలో మొత్తం ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. వరుసగా 2024-25, 2025-26, 2026-27లలో నిధులు ఖర్చు చేసి పనులు చేస్తేనే అనుకున్న రీతిలో ఇవి పూర్తికానున్నాయి. ఈ 12 ప్రాజెక్టులకు సంబంధించి 2024-25లో రూ. 7,650 కోట్లను ఖర్చు పెడితే 5.85 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభించనుంది. కేటగిరీ-బీలోని రాజీవ్ కెనాల్ (ఎన్కూరు లింక్ కాల్వ)ను ఆగస్టు 15న సీఎం రేవంత్ ప్రారంభించే అవకాశముంది. దీని ద్వారా 1.2 లక్షల ఎకరాలకు ఆయకట్టు లభించనుంది. వచ్చే మూడేళ్లలో కేటగిరీ-బీ కింద చేర్చిన ప్రాజెక్టులైన చిన్న కాళేశ్వరం ద్వారా 45 వేల ఎకరాలు, మోడికుంటవాగు ద్వారా 14 వేల ఎకరాలు, చనాకా-కొరాటా ద్వారా 51 వేల ఎకరాలు, శ్రీపాద ఎల్లంపల్లి కింద 1.64 లక్షల ఎకరాలు, దేవాదుల కింద 5.57 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా 46 వేల ఎకరాలు, కల్వకుర్తి లిఫ్టును పూర్తిచేసి కొత్తగా 1.78 లక్షల ఎకరాలు(మొత్తం 4.51 లక్షల ఎకరాలకు ఆయకట్ట పెరుగుతుంది), డిండి ఎత్తిపోతల ద్వారా 3.6 లక్షల ఎకరాలు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 4.12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నీటిపారుదల శాఖ సిఫారసు చేసింది.

అన్ రిజర్వ్‌డ్ సీట్లు 10 వేలు

- ఈ ఇంజనీరింగ్ సీట్లలో ఏపీ విద్యార్థులకూ చాన్స్
- ఈ ఒక్క ఏడాదికే అవకాశం
- తెలంగాణ విద్యార్థులకు మిగతా 85% కన్వీనర్ సీట్లు



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో దాదాపు 10,500 కన్వీనర్ కోటా సీట్లు అన్ రిజర్వ్‌డ్‌గా ఉండే అవకాశం ఉంది. ఈ సీట్లకు తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులూ పోటీ పడతారు. ఈ అవకాశం కేవలం ఈ విద్యా సంవత్సరం (2024-25)కు మాత్రమే ఉంటుంది. కాగా మిగిలిన 85 శాతం సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే కేటాయిస్తారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 నుంచి పదేళ్లపాటు ఏపీ విద్యార్థులకు కూడా తెలంగాణ ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు ఇవ్వాలని రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఉంది. ఈ లెక్క 2024 జూన్‌తో ఈ గడువు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో ఏపీ విద్యార్థులకు సీట్లు ఇవ్వాలా?వద్దా? అనే సంశయం ఏర్పడింది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో తాజా కౌన్సెలింగ్‌లో అన్ రిజర్వ్‌డ్ సీట్లను కేటాయించారు.

ఎంత మందికి ఎన్ని సీట్లు?

ఇప్పటివరకు అందిన లెక్కల ప్రకారం రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో 98,296 సీట్లున్నాయి. వీటిల్లో 70,307 సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ఇందులో 15 శాతం అన్ రిజర్వ్‌డ్ సీట్లుగా పరిగణిస్తారు. అంటే దాదాపు 10,500 సీట్లు ఉంటాయి. ఈఏపీసెట్‌లో ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ, మహాత్మాగాంధీ, జేఎన్ఏఎఫ్ఏయూ యూనివర్సిటీలకు తెలంగాణ స్థానికత ఉంటుంది. ఏపీలోని ఆంధ్ర, శ్రీవెంకటేశ్వర వంటి వర్సిటీలను స్థానికేతర వర్సిటీలుగా పరిగణిస్తారు. ఈ విశ్వవిద్యాలయాల పరిధిలోకి వచ్చే విద్యార్థులు కూడా టీజీఈఏపీ సెట్ రాసేందుకు మొన్నటివరకు అవకాశం ఉంది. ఈ ఏడాది 49,063 మంది ఏపీ విద్యార్థులు సెట్‌కు దరఖాస్తు చేశారు. వీరిలో 44,889 మంది పరీక్ష రాశారు. 34,621 మంది అర్హత సాధించారు. వీళ్ళంతా అన్ రిజర్వ్‌డ్ కోటా కిందకు వస్తారు. వీరు 15 శాతం సీట్లకు తెలంగాణ విద్యార్థులతో పోటీ పడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా సుమారు 4 వేల మంది ఏపీ విద్యార్థులు ఈ విభాగంలో సీట్లు పొందుతున్నారు.

మొదటి కౌన్సెలింగ్‌లోనే మరికొన్ని సీట్లు!

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. సోమవారం నుంచి విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇస్తున్నారు. వాస్తవానికి ఈ సంవత్సరం మరికొన్ని సీట్లు అందుబాటులోకి రావాల్సి ఉంది. కొన్ని కాలేజీలు సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గించుకునేందుకు ఏఐసీటీఈకి దరఖాస్తు చేసుకున్నాయి. అక్కడ్నుంచి అనుమతి కూడా లభించింది. దీంతో ఈ సీట్లను కౌన్సెలింగ్ నుంచి మినహాయించారు. ఇలాంటి సీట్లు 10 వేల వరకూ ఉంటాయని చెబుతున్నారు. వీటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్ గ్రూప్‌తో పాటు, సీఎస్ఈ అనుబంధ ఏఐఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లో సీట్లు పెంచాలని కాలేజీలు కోరాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాల్సి ఉంది. దీంతో పాటు మరికొన్ని కాలేజీలు అదనపు సెక్షన్లు, సీట్లు కోరుతున్నాయి. ఇవి 10 వేల వరకూ సీట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. దీనిపై సోమవారం ఉన్నతాధికారులు కీలక సమావేశం నిర్వహించారు. ఒకటి రెండురోజుల్లో కొత్త సీట్లకు అనుమతి లభించే వీలుంది. దీంతో కంప్యూటర్ బ్రాంచీల్లో మరో 20 వేల సీట్లు చేరే వీలుంది. ఇందులో కూడా అన్ రిజర్వ్‌డ్ సీట్లు ఉంటాయి. మొదటి కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు ఇచ్చే గడువు ఈ నెల 15తో ముగుస్తుంది. కాబట్టి ఆలోగానే సీట్లపై స్పష్టత ఇవ్వనున్నట్టు సాంకేతిక విద్యా విభాగం తెలిపింది.

పాఠశాలల నిర్వహణ గాలికి

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వ స్కూళ్లలో సమస్యల పరిష్కారానికి సీఎంకు లేఖ..



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రాథమిక విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పాఠశాలల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మధ్యాహ్న భోజన సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తాను సీఎం దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లానన్నారు. అయితే తాను లేఖలో పేర్కొన్న అంశాలపై విద్యా శాఖ ఇచ్చిన వివరణ అసంపూర్తిగా ఉందని, అసలు సమస్యలే లేవు అన్నట్లు విద్యాశాఖ వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యలను పరిష్కరించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే తాను సమస్యలను ప్రస్తావించానని, సీఎం చొరవ తీసుకుని వెంటనే సమస్యలను పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. వంట సిబ్బందికి చెల్లించే రూ.3 వేల గౌరవ వేతనం.. ఈ ఏడాది జనవరి నుంచి ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. తొమ్మిది, పది తరగతులకు సంబంధించి మధ్యాహ్న భోజన బిల్లులు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు చెల్లింపులు జరగాల్సి ఉందన్నారు. పిల్లలకు ఇచ్చే కోడిగుడ్ల బిల్లులు కూడా నాలుగు నెలలుగా పెండింగులో ఉన్నాయన్నారు. పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు.

మహ్మద్ హుస్సేన్ ఆచూకీ చెప్పండి

పదిహేనేళ్లుగా జనజీవన స్రవంతిలో ఉంటున్న సింగరేణి ఉద్యమ నాయకుడు, రచయిత మహ్మద్ హుస్సేన్ అలియాస్ రమాకాంత్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయని హరీశ్‌రావు మరో ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే డీజీపీ ఈ వ్యవహారంపై స్పందించి హుస్సేన్ ఆచూకీపై ప్రకటన చేయాలన్నారు.

సచివాలయంలో ఏపీ అధికారుల పెత్తనం సహించం

బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్

సాక్షి, హైదరాబాద్: ఏపీకి చెందిన కొందరు అధికారులను తెలంగాణ సచివాలయంలో నియమించి ఇక్కడి ఉద్యోగులపై పెత్తనం చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకుడు, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ హెచ్చరించారు. ఏపీలో పనిచేస్తున్న చాలా మంది తెలంగాణ ఉద్యోగులను కేసీఆర్ హయాంలో ఇక్కడికి రప్పించామని, మరి కొంతమంది ఇంకా అక్కడే ఉన్నారన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల డిమాండ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని దేవీప్రసాద్ హెచ్చరించారు. పార్టీ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, పల్లె రవికుమార్, రాంబాబు నాయక్‌తో కలిసి దేవీప్రసాద్ సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల్లో నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు.



జీవితం చాలా సరళమైనది. కానీ మనమే దానిని సంక్లిష్టంగా మార్చుకుంటాం.
– కన్‌ఫ్యూషియస్

సాక్షి
మంగళవారం, 9 జూలై 2024

ఫ్రాన్స్ గమ్యం ఎటు?

అన్ని అంచనాలనూ తలకిందులు చేస్తూ ఆదివారం రెండో రౌండ్ ఎన్నికల్లో వోటర్లు ఇచ్చిన తీర్పు పర్యవసానంగా ఫ్రాన్స్‌లో సందిగ్ధత నెలకొంది. తొలి రౌండులో స్పష్టంగా మితవాదం వైపు మొగ్గినట్టు కనిపించిన వోటర్లు హఠాత్తుగా దారి మార్చి ఇతర పక్షాలను తలకెత్తుకున్న వైనం బహుశా దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనిది. 577 మంది సభ్యులుండే దిగువసభ 'అసెంబ్లీ నేషనల్'లో ప్రభుత్వం ఏర్పాటుచేసే పక్షానికి కనీసం 289 స్థానాలు రావాలి. కానీ తాజా ఫలితాల తర్వాత వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ 182 (తొలి రౌండ్‌లో రెండో స్థానం) సీట్లతో అగ్రభాగాన ఉండగా అధ్యక్షుడు ఇమ్మానియెల్ మేక్రాన్‌కు చెందిన ఎన్‌సెంబుల్‌కు 168 (తొలి రౌండ్‌లో మూడోస్థానం) వచ్చాయి. తొలి రౌండ్‌లో 32 శాతం వోట్లు సాధించుకుని అధికార పీఠానికి చేరువగా వెళ్లినట్టు కనబడిన తీవ్ర మితవాద పక్షం నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) రెండో రౌండ్‌లో సీట్లపరంగా 143తో మూడో స్థానానికి పరిమితమైంది. ఆర్ఎన్ పార్టీ తొలి రౌండ్‌లో అగ్రభాగాన ఉండటంతో ఇతర పక్షాల వోటర్లు అప్రమత్తమయ్యారు. మితవాద పక్షానికి పాలనాపగ్గాలు దక్కనీయరాదన్న కృతనిశ్చయంతో అటు మధ్యేవాద పక్షానికీ, ఇటు వామపక్షానికీ వోటేశారు. తొలి దశలో 65 శాతం, రెండో దశలో 63 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1981 తర్వాత ఈ స్థాయి వోటింగ్ ఎప్పుడూ లేదు. ఆర్ఎన్ గెలుపు ఖాయమని తేలినచోట్ల వామపక్ష కూటమి, మధ్యేవాద కూటమి అభ్యర్థులు స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలగి ముఖాముఖి పోటీకి మార్గం సుగమం చేశారు. కనీసం 200 స్థానాల్లో బహుముఖ పోటీ బెడద తప్పింది. దీని ప్రభావం ఎంతగా ఉందంటే... ఫ్రాన్స్ పశ్చిమ ప్రాంతం లా సార్థ్‌లోని అయిదు స్థానాల్లో ఆర్ఎన్ తొలి రౌండ్‌లో నాలుగు స్థానాల్లో ముందంజలో ఉంది. తీరా ముఖాముఖి పోటీలో ఆ పార్టీకి ఒక్కటీ దక్కలేదు.

రాజకీయ అస్థిరత ఫ్రాన్స్‌కు కొత్తగాదు. 1946–'58 మధ్య పన్నెండేళ్లలో ఆ దేశం 22 ప్రభుత్వాలను చూసింది. అయితే అది రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ప్రచ్ఛన్న యుద్ధ దశ మొదలైన తొలినాళ్ల కాలం. భవిష్యత్తులో మరెప్పుడూ దేశం సంకీర్ణాల జోలికి పోకుండా నాటి ఫ్రాన్స్ అధ్యక్షుడు చార్లెస్ డీగాల్ నూతన రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇప్పటికీ అదే అమల్లోవుంది. ఎన్నికల్లో భిన్నపక్షాలు కూటమిగా పోటీ చేయటం, నెగ్గితే కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయటం ఫ్రాన్స్‌లో సాధారణమే. కానీ కూటమిలో అధిక స్థానాలొచ్చిన పార్టీయే తన విధానాలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని నడుపుతుంది. ఇప్పుడు ఏర్పడిన పరిస్థితి భిన్నమైనది. ఒక పార్టీగా అత్యధిక స్థానాలు గెల్చుకున్నది ఆర్ఎన్ ఒక్కటే. చిత్రమేమంటే అటు ఆర్ఎన్‌లోనూ, ఇటు న్యూ పాపులర్ ఫ్రంట్‌లోనూ మేక్రాన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయలేని స్థితిలో పాలనలో పాలుపంచుకోవటం వృథా అని ఇరుపక్షాల నేతలూ భావిస్తున్నారు. ఫ్రాన్స్ ప్రజల్లో మేక్రాన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయన పార్టీతో కలిస్తే ఆ చీడ తమకూ అంటుతుందన్న భయాందోళనలు ఇరుపక్షాల్లోనూ ఉన్నాయి. అందుకే విస్తృత మధ్యేవాద కూటమిని ఏర్పాటు చేయాలన్న మేక్రాన్ ప్రయత్నం ఫలించకపోవచ్చన్నది విశ్లేషకుల మాట.

ఈనెల 26న ప్యారిస్ ప్రధాన వేదికగా ప్రపంచ క్రీడా సంరంభం ఒలింపిక్స్ ఘట్టం ప్రారంభం కాబోతోంది. 16 నగరాల్లో ఆగస్టు 11 వరకూ వివిధ ఈవెంట్లు జరగబోతున్నాయి. ఈ దశలో దేశంలో రాజకీయ అస్థిరత అలుముకుంటే ఎలాగన్న ఆందోళన అన్ని పక్షాల్లోనూ ఉంది. తమ కూటమికి అత్యధిక స్థానాలొచ్చాయి గనుక ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే వామపక్ష అన్‌బౌడ్ నేత జీన్ లక్ మెలింకోన్ కోరుతున్నారు. మితవాద ఆర్ఎన్ పార్టీని రానీయకూడదన్న పట్టుదలతో సోషలిస్టులు, వివిధ వామపక్షాలూ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి తప్ప వాటి మధ్య లుకలుకలు తక్కువేమీ కాదు. అన్‌బౌడ్ పార్టీ భావసారూప్య పక్షాలన్నిటినీ ఒక గొడుగు కిందకు తెచ్చిందన్న మాటేగానీ ఆ పార్టీకి తలొగ్గి ఇతర పక్షాలు పనిచేస్తాయా అన్నది సందేహమే. సుస్థిర ప్రభుత్వాన్ని అందించలేకపోతే మళ్లీ ఎన్నికలకు వెళ్లకతప్పదు. అదే జరిగితే వామపక్ష కూటమికి ఇప్పుడు దక్కిన ఆదరణ ఆవిరయ్యే ప్రమాదం, ఆర్ఎన్ మరింత పుంజుకునే అవకాశం ఉంటాయి. మెలింకోన్ తీరుపై సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది. ఆయన దుందుడుకు విధానాలు ఇంటా బయటా సమస్యాత్మకం కావొచ్చని, ముఖ్యంగా యూరప్ యూనియన్ (ఈయూ)తో పేచీలు తేవచ్చునని భయాందోళనలున్నాయి. ఈయూలో జర్మనీ తర్వాత రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ ఫ్రాన్స్‌దే. నాజీల దురాక్రమణతో సంక్షోభాన్నెదుర్కొన్న ఫ్రాన్స్‌లో మితవాదపక్షానికి ఆది నుంచీ ఆదరణ లేదు. కానీ ఆర్ఎన్ అధినేత మెరిన్ లీ పెన్ తెలివిగా జాత్యహంకారం, యూదు వ్యతిరేకత వంటి అంశాల్లో పార్టీ విధానాలను సవరించుకున్నారు. విద్వేష ప్రసంగాలతో తరచు జైలుపాలైన తన తండ్రి మెరీ లీపెన్‌ను పార్టీ నుంచి సాగనంపారు. గాజాలో ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధాన్ని కూడా వెనకేసుకొచ్చారు. ఫ్రాన్స్ రాజ్యాంగంలోని 12వ అధికరణం కింద కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు నిర్దిష్ట వ్యవధంటూ లేదు. అలాగని దీర్ఘకాలం ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కొనసాగనిస్తే అది మేక్రాన్‌కు రాజకీయంగా తీవ్ర నష్టం తీసుకొస్తుంది. మొత్తానికి మూడు పక్షాల్లోనూ ఎవరూ మరొకరితో కలవడానికి ఇష్టపడని వర్తమాన పరిస్థితుల్లో మేక్రాన్ ఏం చేస్తారన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది. ఏ ప్రభుత్వం ఏర్పడినా అవిశ్వాస తీర్మాన గండం తప్పదు. మెడపై మితవాద బెడద వేలాడుతున్న తరుణంలో చివరకు ఫ్రాన్స్ గమ్యం ఏమిటన్నది మిలియన్ యూరోల ప్రశ్న!

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం; తిథి: శు.చవితి(పూర్తి 24 గంటలు)
నక్షత్రం: ఆశ్లేష ఉ.7.51 వరకు, తదుపరి మఖ; **వర్జ్యం:** రా.8.50 నుండి 10.34 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 9.02 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.42 వరకు; **అమృత ఘడియలు:** లేవు

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

పరమ యోగి

రాలిపడిన పూవుల గాయాల
రహస్యాలను శోధించే
తోటమాలివి నీవు...

దుర్గంధంతో జ్వలించే
కీకారణ్యాన్ని జయించి
చావు తావులను పసిగట్టే
సత్యాన్వేషివి నీవు...

పార్థివ దేహ గర్భగుడిలో సంచరించి
మృత్యువు మూలతత్వాన్ని
అపర నారాయణులకు
ప్రవచించే పరమ యోగి నీవు...

కరకు కత్తులు చేసిన రక్త సంతకాలతో
నిర్జీవ గాత్రం నిండా ఘనీభవించిన గాయాలను,
కామ తృష్ణ పరమ హింసలో
ఛిద్రమైన శుక్ల ఖండాలను,
ఆచూకీ తెలియని
ఉక్కు పాదాలకింద నలిగిన
అనాథ కళేబరాలను
వేయి చూపులతో దర్శించి
మరణమూల్యాంకనం చేస్తావు

కుష్ఠురోగిని ఇష్ట దైవంగా కొలిచిన మహాతల్లి లా
కుళ్లిన శవాలను ప్రాణమిత్రుల వలె
పరామర్శిస్తావు...

శవాల మీద విసిరిన చిల్లరను
మూటగట్టుకోవడం
చాలా సులభం!
కానీ మూటగట్టిన శవాల్లోకి
నిర్భయంగా తొంగి చూడటమే కష్టం!

వస్తువులతో కాపురం చేసే ప్రబుద్ధులు
బతికి ఉన్న మనుషులను శవాలుగా చూస్తుంటే,
శవాలను కూడా మనుషులుగా ప్రేమించే
కరుణా జలపాతం నీవు

మూర్తీభవించిన సాహసం నీవు
స్ఫూర్తీభవించిన దివ్య సేవానిరతి నీవు.

కన్నీటి ఎడారుల సాక్షిగా
మార్చురీ మైదానంలో నిర్విరామంగా
మహా యజ్ఞం నిర్వహించిన
మేరే ప్యారే సలీం భాయ్!
పవిత్రమైన నీ చేతులను
నాకిప్పుడు ముద్దాడాలనిపిస్తోంది!

– కోయి కోటేశ్వరరావు | 9440480274

(గాంధీ ఆస్పత్రి మార్చురీలో 42 ఏళ్ల సర్వీసులో 60 వేల శవపరీక్షలకు టెక్నీషియన్‌గా డాక్టర్లకు సహకరించిన సలీం కోసం...)

కొరత సృష్టించిన అగ్నిపథ్!

విశ్లేషణ



జి.జి. ద్వివేది

అయిదేళ్ల కాల పరిమితి తర్వాత కూడా సైన్యంలో కొనసాగడానికి అర్హత సాధించాలనే ప్రయత్నంలో అగ్నివీర్‌ల మధ్య అనారోగ్యకరమైన పోటీ, వారిపై స్పష్టమైన ఒత్తిడి ఉండటం కనిపిస్తోంది. అంతేకాదు, అగ్నిపథ్ పథకం... సైన్యంలో తీవ్రమైన కొరతకు కూడా దారి తీసింది. సైన్యంలోంచి ఏటా పదవీ విరమణ చేసేవారి సంఖ్యలో సగాని కంటే కాస్త మాత్రమే ఎక్కువగా అగ్నివీర్‌లను తీసుకున్నారు. వీరిలో 25 శాతం మందిని మాత్రమే నిలుపుకొంటారు కనుక ఈ లోటు మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ పథకం తీవ్రమైన లోపాలతో ఉన్నందున, చిన్న చిన్న మార్పులు విలువైన ప్రయోజనాన్ని అందించలేవనే భావన కూడా సర్వత్రా వ్యక్తం అవుతోంది.

లోపాలను సరిదిద్దడానికి 'ఫలితానంతర' చర్యలపై ఆధారపడే వ్యవస్థీకృత మార్పు ఏదైనా సరే అంతర్గతంగా లోపభూయిష్ఠంగా ఉంటుంది. అగ్నిపథ్ పథకం అలాంటి ఉదాహరణగా నిలుస్తుంది. రెండేళ్ల క్రితం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆఫీసర్ ర్యాంకుకు కిందిస్థాయిలో ఉన్న సైనికుల నియామక ప్రక్రియను మార్చడానికి అంటూ దీన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. పెరిగిపోతున్న రిటైర్డ్ సైనికుల పెన్షన్ బిల్లును తగ్గించడానికి కూడా దీన్ని తీసుకొచ్చారు. సాయుధ దళాలలోని ఇతర ర్యాంకులు యువతతో నిండి వుండేలా ఇది దోహదపడుతుంది. అయితే ఈ పథకం సాయుధ దళాలలో చేరడానికి ఆసక్తి ఉన్న యువత నుండి ప్రతిఘటనను ఎదుర్కొంది. దీనిపై సమగ్ర సమీక్ష చేయాలంటూ రాజకీయవర్గాలు బలంగా డిమాండ్ చేస్తున్నాయి.

అగ్నిపథ్ ఆలోచన 'టూర్ ఆఫ్ డ్యూటీ' (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే భావన నుండి తీసుకోవటం జరిగింది. ఇది సైనిక సేవ కోసం ఎంపిక చేసేవారి కొరతను అధిగమించడానికి పాశ్చాత్య దేశ సైన్యాల్లో విస్తృతంగా ఆచరణలో ఉంది. అప్పటి డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ మన సాయుధ దళాలలో ఈ 'టూర్ ఆఫ్ డ్యూటీ'ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. సైనికులను చిన్న సంఖ్యలలో రిక్రూట్ చేయడం ద్వారా ఈ ప్రతిపాదనను పరీక్షించడం అసలు ఉద్దేశం. అయితే, ఈ పథకం ఏకపక్షంగా ముందుకు సాగినట్లు తెలుస్తోంది. మాజీ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఎమ్ఎమ్ నరవణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలో నివేదించిన అంశాలు దీన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ పథకాన్ని సైనిక విభాగాలకు 'పిడుగుపాటు'గా ఆయన ఈ పుస్తకంలో అభివర్ణించారు.

ప్రస్తుతం ఈ పథకం కింద 17.5 నుండి 21 సంవత్సరాల వయస్సు ఉండి 12వ తరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులకు 'అగ్నివీర్'లుగా ఆరు నెలల శిక్షణ ఇచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాల కాలానికి నియమించారు. వారిలో 25 శాతం మంది మాత్రమే పింఛను, పదవీ విరమణ అనంతర ప్రయోజనాలతో మరో 15 సంవత్సరాల కాలం కొనసాగేందుకు అర్హులు అవుతారు. దీనికోసం వారిని తిరిగి నమోదు చేసుకుంటారు. ఇక సైన్యం నుంచి విడుదలైన మిగతా 75 శాతం మందికి పరిహారంగా 'సేవా నిధి' కింద రూ.10 లక్షల ప్యాకేజీ ఇస్తారు.

ప్రస్తుతం మొత్తం రక్షణ శాఖ పెన్షనర్ల సంఖ్య దాదాపు 24.62 లక్షలు. వీరిలో సాయుధ దళాల సీనియర్లు దాదాపు 19 లక్షలు కాగా, పౌర విభాగ సిబ్బంది 5.62 లక్షల మంది ఉన్నారు. 2022 గణాంకాల ప్రకారం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు రక్షణ బడ్జెట్ రూ. 5,25,166 కోట్లు. ఇందులో పింఛను ఖర్చు రూ.2,07,132 కోట్లు. రక్షణ సిబ్బంది వాటా రూ. 1,19,696 కోట్లు కాగా, పౌర విభాగం వాటా రూ. 87,436 కోట్లు. ఈ రెండో మొత్తం పెన్షనరీ బడ్జెట్‌లో 40 శాతం వాటాను కలిగి ఉంది.



సైనిక ఎంపిక పరీక్షల్లో అభ్యర్థులు

కుటుంబ సంప్రదాయాలకు అనుగుణంగా సాయుధ దళాలలో గౌరవప్రదమైన వృత్తిని కోరుకునే వ్యక్తులు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఆర్‌పీఎఫ్) అగ్ర ఎంపికగా ఉండటం వలన ఈ పథకంపై ప్రతికూల ప్రభావం స్పష్టంగా ఉంది. నేను ఈ ధోరణిని నా సొంత రాష్ట్రమైన పంజాబ్‌లో చూశాను. సైన్యం నుంచి విడుదలైన అగ్నివీరులలో తాము విస్మరించబడ్డామనే అపకీర్తిని మోస్తున్నట్లు, గర్వించదగిన అనుభవజ్ఞులుగా తమను చూడరనే సాధారణ భావన కూడా వారిలో ఉన్నట్లు నేను గ్రహించాను.

ఇటీవల, అగ్నివీరులు కార్యాచరణ ప్రాంతాల్లో మోహరించినప్పుడు వారు అత్యున్నత త్యాగం చేసిన రెండు సందర్భాలు ఉన్నాయి. అయితే పూర్తి పెన్షన్‌కు అర్హులైన సాధారణ సైనికులకు భిన్నంగా వారి బంధువులు ఏకమొత్తంలో మాత్రమే పరిహారం పొందేందుకు అర్హులు. ఈ వివక్ష తీవ్రమైన క్రమరాహిత్యంగా నిలుస్తోంది. ఈ రోజు సైనిక విభాగాల్లో రెగ్యులర్ సైనికులు, అగ్నివీరులు అనే రెండు వర్గాలు ఉన్నాయి. అయిదేళ్ల తర్వాత కూడా సైన్యంలో కొనసాగడానికి అర్హత సాధించాలనే వారి ప్రయత్నంలో అగ్నివీర్‌ల మధ్య అనారోగ్యకరమైన పోటీ, స్పష్టమైన ఒత్తిడి కనిపిస్తోంది. నిజానికి ఇది స్నేహబంధం, సైనికుల మధ్య పరస్పర సహకారం, యూనిట్ కల్చర్, రెజిమెంట్ పునాది వంటివాటికి హానికరమైనది. మెరుగైన ఆయుధాలతో సన్నద్ధమైన ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మన సాయుధ దళాల అత్యాధునిక సామర్థ్యానికి ఇది చేటు కలిగిస్తుంది. వియత్నాం, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికన్లు; గాజాలో ఇజ్రాయెలీలు; రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో రెండు వైపుల సైనికులు – 'టూర్ ఆఫ్ డ్యూటీ'ని నిష్ప్రయోజనమైనదిగా గుర్తించారు. మన విషయానికి వస్తే, నేటికీ కొనసాగుతున్న ద్వైపాక్షిక ప్రతిష్టంభన సమయంలో లద్దాఖ్‌లో చైనా సైన్యం కూడా పేలవంగా పని చేసింది.

అగ్నిపథ్ పథకం సైనిక బలగంలో తీవ్రమైన కొరతకు కూడా దారితీసింది. సైన్యంలోంచి ఏటా పదవీ విరమణ చేసే వారి సంఖ్య 70,000 అయితే, కేవలం 42,000 మంది అగ్నివీర్‌లను మాత్రమే తీసుకున్నారు. వీరిలో 25 శాతం మందిని మాత్రమే నిలుపుకోవడంతో ఈ లోటు మరింత పెరగనుంది. 39 గూర్ఖా బెటాలియన్‌లలోని 60 శాతం సైనికులు 'నేపాల్ స్థానిక గూర్ఖా'ల నుండి వచ్చినందున గూర్ఖాల నియామకం గరిష్ఠంగా దెబ్బతింది. నేపాల్ ప్రభుత్వం అగ్నిపథ్‌ను తిరస్కరించడం వల్ల తీవ్రమైన చిక్కులు ఎదురవుతున్నాయి. అదే సమయంలో గూర్ఖాలను రిక్రూట్ చేయడానికి చైనీస్ సైన్యం చేసిన ప్రకటనలను తోసిపుచ్చలేము. భారతీయ యువత విదేశీ సైన్యంలో చేరడం ఆందోళన కలిగించే ధోరణి. రష్యా సైన్యంలో చేరేందుకు ఆకర్షితులవుతున్న కొంతమంది వ్యక్తుల గురించి వెలువడిన ఇటీవలి నివేదికలు దీనికి ఉదాహరణ.

అగ్నిపథ్ పథకాన్ని పునస్సమీక్షిస్తున్నారనే నివేదికలు వస్తున్నాయి. వాటిని బట్టి అగ్నివీరులను నిలబెట్టుకోవడంతో పాటుగా, సేవా సంవత్సరాల పొడిగింపు శాతం కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ పథకం తీవ్రమైన లోపాలతో ఉన్నందున, చిన్న చిన్న మార్పులు విలువైన ప్రయోజనాన్ని అందించవు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ మరింత శాస్త్రీయంగా, కఠినంగా ఉండేలా మునుపటి వ్యవస్థను చక్కగా తీర్చిదిద్దడం ముఖ్యం. ఫిట్‌నెస్ శారీరక, మానసిక ఆరోగ్యం రెండింటినీ కలిగి ఉంటుంది కాబట్టి వయఃపరిమితిని 32 నుండి 26కి తగ్గించడంతో ఫలితం ఉండదు. సైనికుడిని సర్వతోముఖంగా తయారు చేయడానికి ఆరు నుంచి ఏడు సంవత్సరాలు పడుతుంది; వ్యక్తిగత దారుఢ్యం 20ల చివరలో, 30ల ప్రారంభంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. అయితే వివాదాస్పద సరిహద్దులను 42 ఏళ్లు పైబడిన మధ్యస్థ వయస్సుతో కాపు కాస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఫిట్‌నెస్ ఎప్పుడూ ప్రశ్నార్థకం కాకపోవడం గమనార్హం.

సాయుధ దళాలు, రక్షణ విభాగంలోని పౌర సంస్థల సంఖ్యను సరైన పరిమాణంలోకి తీసుకురావడం ద్వారా పెన్షన్ బిల్లును గణనీయంగా తగ్గించవచ్చు. ఉదాహరణకు, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) 10,000 మంది కాంట్రాక్టు కార్మికులను, సుమారు 50 పరిశోధన శాలలతో పాటు దాదాపు 30,000 మంది సిబ్బందిని కలిగి ఉంది. డీఆర్‌డీఓని పునర్నిర్మించడం, కుదించటం కోసం విజయ్ రాఘవన్ కమిటీ ఇటీవలి సిఫార్సులు సరైన దిశలో ఒక అడుగు. దాదాపు 80,000 మంది కార్మికులు పనిచేస్తున్న 41 ఆర్డినెన్స్ కర్మాగారాలకు ఇదే విధమైన కసరత్తు అవసరం.

ఒక వ్యవస్థ స్థితిస్థాపకత... తప్పును సరి చేయగల దాని సామర్థ్యంలో ఉంటుంది. సైనిక విభాగం పెద్దలు అన్ని ఇతర పరిగణనలను పక్కన పెట్టి భారీ సంస్థాగత ప్రయోజనార్థం అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త రిటైర్డ్ మేజర్ జనరల్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

యువ కిరణాలు



మౌంట్ అబూ పరిశోధనశాలలో ఫిజికల్ రిసెర్చ్ లేబరేటరీ (గుజరాత్) యువ శాస్త్రవేత్తలు సౌరవ్యవస్థ వెలుపల ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న గ్రహాలను గురించి మొట్టమొదటి ఆవిష్కరణలను చేశారు. ఆకట్టుకునే విధంగా దేశీయంగా అభివృద్ధి చేసిన టెలిస్కోప్‌లు, వారే స్వయంగా రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన శాస్త్ర పరికరాలను ఇందుకు ఉపయోగించారు. ఇది దేశం గర్వించదగిన విశేషం.

– సంధ్యా రమేశ్, జర్నలిస్ట్

వేరే దారి లేక..!



థానేలోని లేబర్ కోర్టు ఆవరణలో పార్క్ చేసి ఉన్న నా కారు వెనుక వైపు కూర్చొని, పచ్చి మిరపకాయతో చపాతీ తింటున్న మనిషిని చూసి నా మనసు చివుక్కుమంది. దాని గురించి నేను అతనిని అడిగినప్పుడు... మండుతున్న ధరల కారణంగా కూరగాయలు కొనలేకపోతున్నామని చెప్పాడు!

– సందీప్ మనుధానే, విద్యావేత్త

నిర్మాణాత్మక సమస్యలు



బ్రిటన్‌లో లేబర్ పార్టీ విజయాన్ని ఉత్సవం జరుపుకొంటున్నవారిని చూస్తే జాలేస్తోంది. బ్రిటన్ సమస్యలు నిర్మాణాత్మకమైనవనీ, పన్ను రేట్లను సవరించడం – టోరీల కంటే తామెంత శ్రామిక వర్గమో చెప్పడం వల్ల అవి పరిష్కారం కావనీ అర్థం చేసుకోవడానికి కొన్ని నెలలు చాలు!

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

చర్చలకు సిద్ధం



భౌగోళిక రాజకీయాల కన్నా ఆర్థికాంశాలకు ఇరానియన్ ఓటర్లు ప్రాధాన్యమిచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే, పెజెష్కియాన్ విజయాన్ని అలాగే చూడాల్సి ఉంటుంది. అంటే, అమెరికాతో తిరిగి చర్చలు జరపాలని తెహ్రాన్ కోరుకుంటోంది. దీనివల్ల ఏ విధమైన నష్టం లేని బైడెన్ ఒక చారిత్రక అధ్యక్ష వారసత్వాన్ని విడిచిపెట్టేలా స్పందించాలి.

– ఎం.కె.భద్రకుమార్, మాజీ రాయబారి

సింగరేణిని కాపాడుకోవాలి!

కేంద్ర ప్రభుత్వం కోల్ సెక్టార్ నుంచి ఒక లక్ష 75 వేల కోట్లు సంపాదించుకోవాలని నిర్ణయం తీసుకున్న నాటి నుంచి 500 బొగ్గు బ్లాక్‌లను దశల వారీగా వేలం వేస్తూ వస్తున్నది. కార్పొరేట్‌ల చేతుల్లోకి ఇప్పటికే 140కి పైగా బొగ్గు బ్లాకులు వెళ్లిపోయాయి. గత పార్లమెంట్‌లో 303 సీట్లు ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ అడ్డుకునే పరిస్థితి విపక్షాలకు లేదు. చర్చకు అవకాశమే లేకుండా ఏకపక్ష నిర్ణయాలను కేంద్రం తీసుకొంది. అది ప్రవేశపెట్టిన బిల్లుకు అప్పుడు తెలంగాణ ఎంపీలు అందరూ మద్దతు పలికారు. ఇందులో బొగ్గు బ్లాక్‌ల వేలంతో పాటు కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, షేర్‌ల అమ్మకం కీలకంగా పేర్కొనవచ్చు. సింగరేణి సంస్థ కోల్ ఇండియాకు అనుబంధం కాని కారణంగా బతికి పోయింది!



ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ, అమ్మకం, పెద్ద ఎత్తున సాగుతున్నది. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన బీసీసీఎల్ (భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్)లో 25 శాతం పెట్టుబడి ఉపసహరణకు కేంద్రం గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కోల్ ఇండియా తన 33 శాతం షేర్లను అమ్మేసింది. కేంద్రం నిర్ణయం కారణంగా మరిన్ని షేర్లు ప్రైవేటుపరం కానున్నాయి. ఇదంతా బీసీసీఎల్‌ను అమ్మేసే కుట్రలో భాగమే అనక తప్పదు!

మోదీ మూడో సారి ప్రధాని అయ్యాక తాజాగా దేశంలోని 60 బొగ్గు బ్లాక్‌లకు వేలం వేసే ప్రక్రియ మన తెలంగాణలోనే మొదలు పెట్టారు. గత పార్లమెంట్‌లో ఉన్న మెజారిటీ ఇప్పుడు బీజేపీకి లేకున్నా, మోదీ తన విధానం మాత్రం మార్చుకోలేదనేది కొత్తగా నిర్వహించిన వేలం వల్ల స్పష్టమవుతోంది. గతంలో రామగుండానికి పీఎం నరేంద్ర మోదీ వచ్చినపుడు సింగరేణిని ప్రైవేట్ పరం చేసే ప్రసక్తి లేదని చెప్పి వెళ్ళారు. ఇప్పుడు అదే మాట మన బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చెబుతున్నారు. అప్పుడు బొగ్గు బ్లాక్‌ల కేటాయించమని డిమాండ్ చేసినా ఏమీ సమాధానం చెప్పలేదు! 'రైల్వేతో నాకు చాలా అనుబంధం ఉంది. నేను ఛాయ్ అమ్మాను! నేను రైల్వేను ప్రైవేట్ పరం చేస్తానని కొందరు ప్రచారం చేస్తున్నారు, నేను అలా చేస్తానా?' అని చెప్పిన పీఎం తర్వాత చేసిన పని ఏమిటో జగమెరిగిన సత్యం! అంతే కాదు అదే పీఎం మోదీ, 'ప్రభుత్వ రంగం పుట్టిందే చావడానికి' అని చెప్పిన వీడియోలు ఉన్నాయి. మరి ఏ మాట నమ్మాలి?

కేంద్ర, రాష్ట్రాల వాటాలు ఉన్న ఏకైక సంస్థ సింగరేణి. ఇందులో కేంద్రం వాటా 49 శాతం ఉంది. రాష్ట్ర వాటా 51 శాతం ఉంది. గత 20 ఏండ్లకు పైగా లాభాల్లో నడుస్తూ, 2001– 2002 ఆర్థిక సంవత్సరం నుంచి కార్మికులకు, లాభాల్లో వాటా ఇస్తున్నది. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండు సంవత్సరాలు మిగులు సర్వీస్ ఉన్న నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (ఎన్సీడబ్ల్యూఏ) పరిధిలోకి వచ్చే ఉద్యోగులు అనారోగ్యం పాలై దరఖాస్తు చేసుకుంటే ఇన్వాలిడేషన్ చేసి, డిపెండెంట్‌లకు ఉద్యోగాలు ఇస్తున్న సంస్థ కూడా సింగరేణీ కావడం విశేషం! ఈ నేపథ్యంలో కేంద్రం ప్రైవేటీకరణ పాలసీ ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఇలాంటి విధానాల వల్ల కోల్ ఇండియాలో ఒకప్పుడు 8 లక్షల పైచిలుకు ఉన్న కార్మికుల సంఖ్య 3 లక్షలకూ, సింగరేణిలో 1991లో లక్షకు పైగా ఉన్న కార్మికుల సంఖ్య ఇప్పుడు 43 వేలకూ పడిపోయాయి. కోల్ ఇండియా కూడా మంచి లాభాల్లో ఉంది. అయినా పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ బారి నుంచి తప్పించుకోలేని పరిస్థితి ఉంది! కోల్ బ్లాక్‌లను కేటాయించకుండా ఉంటే సింగరేణి నష్టాల్లో పడుతుంది. అప్పుడు దాన్ని కూడా ప్రైవేటీకరణ చేయవచ్చనేది కేంద్రం యోచన కావచ్చు. అందుకే అది బొగ్గు బ్లాక్‌లను కేటాయించడంలేదని చెప్పవచ్చు.

ఈ విషయం మీద మన తెలంగాణకు చెందిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రధాని మోదీతో మాట్లాడుతామన్నారు. మరో వైపు 'మా బ్లాకులు మాకు ఇవ్వండి' అని మన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లిఖిత పూర్వకంగా కోరారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ మేరకు పీఎం మోదీకి లేఖ రాశారు. ఒక వైపు కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. 2015 లోని బొగ్గు బ్లాక్‌ల వేలం చట్టం లోనే, 17 (ఏ) సెక్షన్ ప్రకారం సింగరేణికి బొగ్గు బ్లాక్‌లను వేలంలో పాల్గొనకుండానే కేటాయించవచ్చు! ఆ దిశలో కేంద్రం ముందుకు పోతుందని ఆశిద్దాం! అందరం కలిసి సింగరేణిని కాపాడుకుందాం! ఛలో ఆజ్ నహీ తో కల్ నహీ! తెలంగాణ గోదావరి తీరంలోని బొగ్గు నిక్షేపాల మీద సింగరేణికి హక్కు ఉన్నది!

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్ | 9951865223

కాంగ్రెస్ గేట్లు ఎందుకు ఎత్తింది?

తెలంగాణలో ఇప్పుడు రాజకీయ విశ్లేషణలు అన్నీ పార్టీ ఫిరాయింపుల చుట్టే తిరుగుతున్నాయి. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరుతున్న ప్రజా ప్రతినిధులపై బీఆర్ఎస్ నాయకులు గొంతు చించుకొని తప్పు పడుతున్నారు. అయితే వారంతా ఈ పరిణామాలపై 2014 నుంచి జరిగిన పార్టీ ఫిరాయింపుల గురించి కూడా మాట్లాడి ఉంటే బాగుండేది. అంతే కాదు తెలుగుదేశం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిలను పార్టీలోకి తీసుకొని మంత్రి పదవులు కట్టబెట్టినప్పుడు ఇప్పుడు మాట్లాడేవారు ఎందుకు మాట్లాడలేదో మరి! కారు దిగుతున్న ఎమ్మెల్యేల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో ఎమ్మెల్యేల కోసం కేసీఆర్ గడీ తలుపులు తెరుచుకున్నాయి. ఎమ్మెల్యేలతో మాజీ సీఎం బంతి భోజనాలు చేస్తున్నారు. ఎవరూ పార్టీ మారొద్దని విజ్ఞప్తులు చేస్తున్నారు.

ఇక అసలు విషయానికి వద్దాం. 'గేట్లు ఎత్తేశాం' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన వెనుక ఏం జరిగింది అనేది రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. 'రాష్ట్రంలో నిరంకుశ పాలన పోవాలి, మార్పు కావాలి' అంటూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే రేవంత్ సర్కార్ కొలువుదీరిన కొద్ది రోజుల నుంచే... 'ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుంద'ంటూ ఒకవైపు బీఆర్ఎస్, మరోవైపు బీజేపీ నాయకులు పదేపదే మాట్లాడుతూ వచ్చారు. ఈ రెండు పార్టీలదీ ఒకే వాయిస్ కావడంతో దీని వెనుక ఏదన్నా కుట్రకోణం ఉందా అనే అనుమానాలు చర్చకు దారితీశాయి. ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేరుస్తానని ప్రతిజ్ఞ పూనిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతల్ని భుజానికి ఎత్తుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, అవినీతి రహిత పాలన చేయడం ఎంత ముఖ్యమో... ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. ఇవన్నీ జరగాలంటే ప్రత్యర్థి పార్టీల కుట్రల్ని ఛేదించడం కూడా ముఖ్యమే మరి. కారు, కమలం పార్టీల రాజకీయ కుట్రని ఛేదించేందుకే 'కౌంటర్ పాలిటిక్స్'కు రేవంత్ రెడ్డి పదును పెట్టారనుకోవాలి. అందుకే గేట్లు ఎత్తే ఫార్ములాను అనుసరిస్తున్నారని చెప్పక తప్పదు. కానీ, ఇది జనం హర్షిస్తారా?

– కోదూరు శ్రీనివాస రావు, సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రి సీతక్కను జాజుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ...కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్, అసెంబ్లీ తీర్మానం తర్వాత జీవో 26 తీసుకొచ్చిందని తెలిపారు. ఈ జీవోను అమలు చేయడానికి రూ.150 కోట్లు కూడా కేటాయించిందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడానికి తక్షణమే కులగణన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.

పాతబస్తీలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి

మాజీమంత్రి మహమూద్ అలీ



సాక్షి, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాతబస్తీలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, మతకలహాలు పెరిగాయని మాజీమంత్రి మహమూద్ అలీ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో శాంతిభద్రతలను పటిష్టంగా కాపాడారని, మత ఘర్షణలు జరగకుండా పాలించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూలును అదానీ సంస్థకు అప్పజెప్పడం మైనారిటీలను అవమానపరచడమేనని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అదానీని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ వద్దంటే రేవంత్‌రెడ్డి రమ్మనడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీలకు హోంమంత్రి పదవి ఇస్తే...కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలను మరిచిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీకి బీ టీంగా పనిచేస్తుందని, బీజేపీతో ఉన్న చంద్రబాబుకు కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ఘన స్వాగతం పలకడమేమిటని నిలదీశారు. రాహుల్ ఢిల్లీలో బీజేపీతో కొట్లాడుతుంటే రేవంత్ ఇక్కడ బీజేపీతో స్నేహం చేస్తున్నారని అన్నారు. మైనారిటీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా రేవంత్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్‌ఐటీలో కౌన్సెలింగ్ ప్రారంభం



భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కించుకున్న విద్యార్థులకు సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభించారు. సెలక్షన్ లిస్ట్‌లో మొదటి పేరు ఉన్న సంగారెడ్డి జిల్లా ఆంధోల్ మండలం కొడికల్ గ్రామానికి చెందిన అన్నసాగర్ వితలేశ్వర్ సర్టిఫికెట్లను స్పెషల్ ఆఫీసర్ సృజన పరిశీలించి ధ్రువీకరణ పత్రం అందించారు. ఒకటి నుంచి 500 వరకు వరుస క్రమంలో ఉన్న విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఇందులో 42 మంది గైర్హాజరయ్యారు. మరో రెండు రోజులపాటు కౌన్సెలింగ్ కొనసాగనుంది. స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఆగస్టు మొదటివారంలో క్యాంపస్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు. మొదటివారంలో నూతన విద్యార్థులకు వారంరోజులు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ఆగస్టు రెండవ వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ మహేశ్, జాయింట్ కన్వీనర్లు డాక్టర్ పావని, రంజిత్‌కుమార్, డాక్టర్ దత్తు పాల్గొన్నారు.

కేంద్ర నిబంధనలకు ఓకే.. పీఎంఏవై మార్గదర్శకాల మేరకే

ఇందిరమ్మ ఇళ్లు

ఢిల్లీకి స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- 'డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల'గతి ఇందిరమ్మ ఇళ్లకు పట్టొద్దని అప్రమత్తం
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా నిధులు పొందే ప్రయత్నం
- 'ఇందిరమ్మ' వివరాలన్నీ కేంద్రం యాప్‌లో అప్‌లోడ్ చేయటానికి సమ్మతం
- మిగతా రాష్ట్రాలు ఏం చేస్తున్నాయో పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారులు



సాక్షి, హైదరాబాద్: పేదల ఇళ్ల పథకంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను తు.చ.తప్పకుండా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి కేంద్రం ఖరారు చేసిన విధివిధానాలను అనుసరిస్తూనే, స్థానికంగా ఇందిరమ్మ పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అడ్డంకులు లేకుండా సాఫీగా అమలు జరగాలంటే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వ నిధులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద కేంద్రం నుంచి భారీగా నిధులు అందే పరిస్థితి ఉన్నందున, వాటిని ఆసరా చేసుకుని స్థానికంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొనసాగించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. దీంతో కేంద్రం మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరిస్తానని హామీ ఇవ్వటం ద్వారా వీలైనన్ని ఎక్కువ నిధులు కేంద్రం నుంచి పొందాలని నిర్ణయించింది. కేంద్ర నిబంధనలను అనుసరించే విషయంలో, మిగతా రాష్ట్రాలు ఎలా వ్యవహరిస్తున్నాయో తెలుసుకునేందుకు అధ్యయనం కూడా ప్రారంభించింది.

అంతా కేంద్రం కనుసన్నల్లోనే..

పేదల ఇళ్ల పథకానికి సంబంధించి కేంద్రం ఓ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని రాష్ట్రప్రభుత్వం ఈ యాప్‌లో ఉంచాల్సి ఉంటుంది. ఐదేళ్లలో ప్రతిపాదించిన ఇళ్ల సంఖ్య, తొలి సంవత్సరం చేపట్టబోయే సంఖ్య, నియోజకవర్గాల వారీగా వాటి మొత్తం, యూనిట్ కాస్ట్, లబ్ధిదారుల వివరాలు, గ్రామాల పేర్లు.. ఇలా మొత్తం వివరాలు అందులో పొందుపరచాలి. పక్కా ఇల్లు లేని వారు మాత్రమే ఈ పథకానికి ఎంపిక చేయాల్సి ఉంటుంది. కచ్చా ఇంటి కప్పు మాత్రమే ఉండాలి, లబ్ధిదారులు విధిగా అదే గ్రామానికి చెంది ఉండాలి, బీపీఎల్ కుటుంబం తప్పనిసరి. తెలుపురంగు రేషన్‌కార్డు వినియోగిస్తూ ఉండాలి.. లాంటి నిబంధనలను కేంద్రం తప్పనిసరి చేసింది. రాష్ట్రం పంపే వివరాలు వీటితో సరిపోలాలి. వాటిని కేంద్రం తనిఖీ చేసే వీలూ ఉంటుంది. అందులో తేడా ఉన్నట్టు తేలితే కేంద్రం నిబంధనలను అనుసరించటంలేదని తేలుతుంది. ఇది కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రభావం చూపుతుంది.

ఆ దుస్థితి దాపురించకుండా..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండు పడకగదుల ఇళ్ల పథకం విఫలం కావటానికి కారణాలను ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలించింది. పేదల ఇళ్ల పథకంలో ముందుగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నది కేంద్రం నిబంధన. కానీ, నాటి ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక లేకుండానే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. రెండు పడకగదుల ఇళ్ల పథకానికి ఈరోజు వరకు కూడా పూర్తిస్థాయిలో లబ్ధిదారుల జాబితాలు రూపొందలేదు. దీన్ని తీవ్రంగా తప్పుపట్టిన కేంద్రం ఆ పథకానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం నిధులు ఇచ్చేందుకు నిరాకరించింది. దాదాపు రూ.1,200 కోట్ల మొత్తాన్ని ఆ ప్రభుత్వం కోల్పోవాల్సి వచ్చింది. ఆ దుస్థితి ఇప్పుడు ఇందిరమ్మ పథకానికి పట్టవద్దని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం, అంతే సంఖ్యలో కేంద్ర ప్రభుత్వ యూనిట్లను మంజూరు చేయించుకోవాలని భావిస్తోంది.

ఇతర రాష్ట్రాల్లో ముమ్మరంగా అధ్యయనం..

పది రోజుల క్రితం ఎస్‌ఈలు చైతన్యప్రసాద్, వెంకటదాస్‌రెడ్డి ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో పర్యటించి అక్కడి ఇళ్ల పథకాన్ని అధ్యయనం చేశారు. అదే సమయంలో మరో ఇద్దరు ఎస్‌ఈలు భాస్కర్‌రెడ్డి, బలరామ్‌తో కూడిన బృందం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి పరిశీలించింది. తాజాగా చైతన్య ప్రసాద్ బృందం బెంగళూరులో, వెంకటదాస్‌రెడ్డి బృందం చెన్నైలో, భాస్కరరెడ్డి బృందం ముంబైలో పర్యటిస్తోంది. రాగానే నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఆ మేరకు ఇందిరమ్మ పథకంలో స్పష్టమైన విధివిధానాలను రూపొందించనున్నారు.

కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామాకేర్ సెంటర్

- ప్రమాద క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించడమే లక్ష్యం
- భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి కోమటిరెడ్డి



ట్రామాకేర్ సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కేతేపల్లి: జాతీయరహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురైన సమయంలో క్షతగాత్రులకు తక్షణవైద్యం అందించే లక్ష్యంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద అత్యాధునిక వసతులతో కూడిన ట్రామాకేర్ సెంటర్‌ను ఏడీపీ ప్రారంభించనుంది. ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించేలా ఈ సెంటర్ పనిచేస్తుంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కొర్లపహాడ్ టోల్‌ప్లాజాను కీలక జంక్షన్‌గా గుర్తించిన ఏడీపీ ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలనుకుంటోంది.

ఇవీ ప్రయోజనాలు : హైదరాబాద్ – విజయవాడ 65 నంబర్ జాతీయ రహదారిపై రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతోపాటు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను మొదటి గంటలో అందించే వైద్యాన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో క్షతగాత్రులను తక్షణ వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడేందుకు వీలుంటుంది. ప్రమాద బాధితులను సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించేందుకు జాప్యం జరుగుతుండటంతో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రామాకేర్ సెంటర్ అందుబాటులోకి వస్తే.. ఇక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం బాధితుల ఆరోగ్య పరిస్థితిని బట్టి పెద్ద ఆస్పత్రులకు తరలిస్తారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించటంతోపాటు ప్రమాదం జరిగిన సమయానికి, వైద్య చికిత్సకు మధ్యగల సమయాన్ని గణనీయంగా తగ్గించటమే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రాథమిక ఉద్దేశం. ఈ సెంటర్‌లో వైద్య చికిత్స అందించేందుకు నిష్ణాతులైన వైద్య సిబ్బందితోపాటు అధునాతన వైద్య పరికరాలు కూడా అందుబాటులో ఉంటాయి.

మరణాల రేటు తగ్గింపు: రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ట్రామాకేర్ సెంటర్ టోల్‌ప్లాజా సమీపంలో ఉండటం వల్ల క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లోనే వైద్యం అందించే వీలుంది. దీంతో మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించొచ్చు.

ఏడీపీ అంటే..: ఏడీపీ(ఆటోమెటిక్ డేటాబేస్ ప్రాసెస్) అనేది సాఫ్ట్‌వేర్ కంపెనీ. టెక్నాలజీ సొల్యూషన్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొవైడర్‌గా పేరుంది. బిజినెస్ మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా ఈ సంస్థ నిర్వహిస్తోంది. 140 దేశాల్లో వివిధ రకాలుగా సేవలు అందిస్తోంది. భారత్‌లో 11వేల అసోసియేట్‌లతో హైదరాబాద్, పుణే, చెన్నై నగరాలలో విస్తరించి తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

ఏడీపీ యాజమాన్యానికి మంత్రి ధన్యవాదాలు

కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏడీపీ ఆధ్వర్యంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ట్రామాకేర్ భవన నిర్మాణానికి సోమవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్యం అందించాలనే సంకల్పంతో ట్రామాకేర్ కేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఏడీపీ యాజమాన్యానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు నేత హుస్సేన్ అరెస్ట్

- మావోయిస్టు సాహిత్యం, కరపత్రాలు స్వాధీనం : మంచిర్యాల డీసీపీ
- అక్రమంగా అరెస్టు చేశారంటున్న పౌర హక్కుల సంఘం, విరసం నేతలు



హుస్సేన్

రామకృష్ణాపూర్/జమ్మికుంట: మావోయిస్టు నేత, సికాస ఆవిర్భావంలో కీలకంగా వ్యవహరించిన మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్ (74)ను అరెస్టు చేసినట్టు మంచిర్యాల డీసీపీ భాస్కర్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహ్మద్ హుస్సేన్ మావోయిస్టు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, సికాస పునర్నిర్మాణానికి మావోయిస్టు సానుభూతిపరులను కలుస్తున్నాడనే సమాచారంతో నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో సోమవారం కొందరు సికాస పునర్నిర్మాణం కోసం మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియాల్లో తిరుగుతున్నట్టు సమాచారం అందడంతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో తనిఖీలు చేపట్టారన్నారు. ఆర్కే–1 మెయిన్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి నల్లటి బ్యాగు భుజానికి వేసుకొని అనుమానాస్పదంగా కనిపించాడని, పారిపోయేందుకు యత్నించడంతో వెంబడించి పట్టుకున్నారని చెప్పారు. అతని వద్ద ఉన్న బ్యాగు తనిఖీ చేయగా మావోయిస్టు పార్టీ డాక్యుమెంట్లు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఉన్నట్టు గుర్తించారని, వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తాను మావోయిస్టును అని, తన పేరు మహ్మద్ హుస్సేన్ అని చెప్పాడన్నారు. అనంతరం హుస్సేన్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు డీసీపీ భాస్కర్ వివరించారు.

సికాస ఏర్పాటులో కీలకపాత్ర..

మహ్మద్ హుస్సేన్ 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా మంచిర్యాల జిల్లా కేకే–2 గనిలో పనిచేశాడు. మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై సింగరేణి ఉద్యోగానికి రాజీనామాసి మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) వ్యవస్థాపక సభ్యుడిగా, సికాస సీఓగా కూడా పనిచేశాడు. సింగరేణిలో జరిగిన అనేక ఉద్యమాలలో హుస్సేన్ కీలకపాత్ర పోషించాడు. కవిగా, రచయితగా కూడా హుస్సేన్‌కు పేరుంది. ఇతనిపై దాదాపు 28 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. జార్ఖండ్‌లో 2009లో అరెస్టు అయ్యి ఐదేళ్లపాటు జైలు జీవితం గడిపాడు. పదేళ్ల నుంచి జమ్మికుంటలో ఉంటున్నాడని, రెండు రోజుల క్రితం పోలీసులే తీసుకెళ్లారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. హుస్సేన్‌ను అక్రమంగా అరెస్టు చేశారని పౌరహక్కుల సంఘం, విరసం రాష్ట్ర నేతలు మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, నార వినోద్, పుల్ల సుచరిత, బొడ్డుపల్లి రవి, బాలసాని రాజయ్య తదితరులు ఆరోపించారు.

అంతర్గత సమస్యతోనే ప్రమాదం !

బీటీపీఎస్‌ను సందర్శించిన ప్రత్యేక కమిటీ



దగ్ధమైన బీటీపీఎస్ జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని బీటీపీఎస్ (భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్)లో గతనెల 29న జరిగిన ప్రమాదానికి అంతర్గత సమస్యే కారణమని ప్రత్యేక కమిటీ గుర్తించినట్లు తెలిసింది. బీటీపీఎస్ సందర్శనకు మూడు రోజుల క్రితం కేటీపీఎస్ సీఈ పీవీ రావు, డీఈ, విద్యుత్ సౌధ నుంచి ఒక ఎస్‌ఈ, భూపాలపల్లి నుంచి ఒక ఎస్‌ఈ.. మొత్తం నలుగురు అధికారులతో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. కాగా, కమిటీ సభ్యులు సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 వరకు బీటీపీఎస్‌లో క్షుణ్ణంగా పరిశీలించారు. అంతర్గత సమస్య వల్లే ప్రమాదం ఏర్పడిందని, అదే సమయంలో పిడుగు పడటంతో జీటీ–1 ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దగ్ధమైందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. కాగా, కమిటీ నివేదికను ఈనెల 10వ తేదీన విద్యుత్ సౌధ ఉన్నతాధికారులకు అందించనున్నారు.

తల్లిని చంపిన కొడుకు..

కొడుకును చంపిన తండ్రి

నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో దారుణ ఘటనలు ● క్షణికావేశంలో తల్లిని.. ఆస్తి గొడవలతో కొడుకుని కడతేర్చి



ఇందిరాబాయి



వినోద్



మారాలు

లోకేశ్వరం/బెల్లంపల్లి: నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో సోమవారం దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. కుటుంబ కలహాలతో ఓ కొడుకు తల్లిని హత్య చేయగా, ఆస్తి పంపకం గొడవల కారణంగా ఓ తండ్రి కొడుకును కడతేర్చాడు. వేర్వేరు చోట్ల జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన లౌడియా ఇందిరాబాయి(64)కి ఆమె కొడుకు రాంబాబుకు మధ్య ఆదివారం రాత్రి కుటుంబ సమస్యలపై గొడవ జరిగింది. సోమవారం ఉదయం కూడా ఇందిరాబాయి కొడుకును దుర్భాషలాడింది. దీంతో క్షణికావేశంలో రాంబాబు కొడవలి తీసుకుని తల్లిపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన ఇందిరాబాయి అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నాడని ఏఎస్సై దిగంబర్ వెల్లడించారు.

భూమిని పంచి ఇమ్మన్నాడని..

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో భూమి పంపకం విషయంలో తలెత్తిన గొడవ నేపథ్యంలో తండ్రి ఓ కొడుకును కడతేర్చాడు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ కథనం ప్రకారం.. ఆకెనపల్లి గ్రామానికి చెందిన దేవ మారాలు, బీరక్క దంపతులకు ఇద్దరు కొడుకులు వినోద్(30), వినీల్. డిగ్రీ చదివిన వినోద్ ఇంటివద్ద ఉంటూ వ్యవసాయం, కూలీ పనులు చేసేవాడు. తమకు ఉన్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని పంచి ఇవ్వాలని వినోద్ కొన్ని రోజులుగా తండ్రితో గొడవ పడుతున్నాడు. పెళ్లి అయ్యాక పంచి ఇస్తానని మారాలు దాటవేస్తూ వస్తున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలకు భూమి పంచి ఇవ్వాలని వినోద్ మళ్లీ గొడవపడ్డాడు. కొడుకుతో ఘర్షణపడలేక ఆస్తి పంపకానికి పెద్ద మనుషులను తీసుకువస్తానని చెప్పి ఇంట్లో నుంచి మారాలు బయటకు వెళ్లాడు. 9 గంటలకు వచ్చి మధ్యాహ్నం పెద్ద మనుషులు వస్తారని వినోద్‌కు చెప్పాడు. అదేమీ పట్టించుకోకుండా మరోసారి తండ్రితో గొడవ పడిన వినోద్ మంచంలో పడుకున్నాడు. ఇదే అదునుగా భావించిన మారాలు పార తీసుకుని వినోద్ తలపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వినోద్‌ను తల్లి స్థానికుల సహాయంతో ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినోద్ మరణించినట్లు తెలిపారు.

కొడుకును చంపిన తండ్రి అరెస్టు

కొడుకును చంపిన తండ్రి దేవ మారాలును సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. హత్య తర్వాత నిందితుడు గ్రామ శివారులో సంచరిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి దాడి చేసిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని బెల్లంపల్లి జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు వెల్లడించారు.

'కాళేశ్వరం' పంప్‌హౌస్ ఇంజనీర్ల విచారణ

- జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ముందు హాజరైన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు
- బరాజ్‌లకు సంబంధించిన అదనపు సమాచారం కోసమే విచారించిన కమిషన్
- కమిషన్‌కు నివేదిక సమర్పించిన నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం (అన్నారం), గోలివాడ (సుందిళ్ల) పంప్‌హౌస్‌ల నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలను జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ప్రశ్నించింది. ఈఎన్‌సీగా రిటైరైన నల్లా వెంకటేశ్వర్లుతోపాటు గజ్వేల్ ఈఎన్‌సీ హరిరామ్, రామగుండం, మహబూబ్‌నగర్ సీఈలు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ సీఈఓ అప్పారావు, నీటి పారుదల శాఖ చీఫ్ ఆడిటింగ్ ఆఫీసర్ పద్మావతి సహా మొత్తం 14 మంది అధికారులు, పంప్‌హౌస్‌ల నిర్మాణ సంస్థకు చెందిన మరో ఇద్దరు ప్రతినిధులను జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారించారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు అప్పగించడం తెలిసిందే. అయితే పంప్‌హౌస్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహించే పరిధి కమిషన్‌కు లేకపోయినా అదనపు సమాచారం లభించవచ్చనే భావనతోనే జస్టిస్ చంద్రఘోష్ వారిని ప్రశ్నించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం ఈఎన్‌సీ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారులను కమిషన్ విచారించగా మంగళవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బుధవారం అసిస్టెంట్ ఇంజనీర్/అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులను విచారించనుంది. పంప్‌హౌజ్‌లతో పాటు బరాజ్‌ల నిర్మాణంలో వీరంతా పాలుపంచుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

కమిషన్‌కు నిపుణుల కమిటీ నివేదిక...

జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ తాజాగా కమిషన్‌కు తమ నివేదికను సమర్పించింది. బరాజ్‌లను సందర్శించి పరిశీలించిన కమిటీ.. వాటి వైఫల్యాలను నివేదికలో విశ్లేషించినట్లు తెలిసింది. బరాజ్‌లకు శాశ్వత మరమ్మతుల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేస్తూ త్వరగా తుది నివేదిక సమర్పించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీని కమిషన్ కోరింది. బరాజ్‌లపై విజిలెన్స్ విచారణకు సంబంధించిన తుది నివేదికను సైతం సత్వరమే అందించాలని విజిలెన్స్ విభాగానికి కమిషన్ లేఖ రాసింది.

అఫిడవిట్ల ఆధారంగా విచారణ...

ఇప్పటివరకు విచారణకు హాజరైన ఇంజనీర్లు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు సమర్పించిన అఫిడవిట్ల పరిశీలనను కమిషన్ పూర్తి చేసింది. అఫిడవిట్లలోని సమాచారం ఆధారంగా తదుపరి విచారించాల్సిన వ్యక్తుల జాబితాను కమిషన్ సిద్ధం చేస్తోంది. బరాజ్‌ల నిర్మాణం విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న ప్రజాప్రతినిధులను సైతం విచారణకు పిలిపించే అవకాశముంది. సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించేందుకు వారికి అవకాశం ఇవ్వనుంది.

భద్రాద్రి జిల్లాలో ఉప్పొంగిన వాగులు

నీట మునిగిన సీతమ్మ నార చీరల ప్రాంతం



దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మణుగూరు పట్టణంతో పాటు అశ్వాపురం, పినపాక, దుమ్ముగూడెం మండలాల్లో వర్ష ప్రభావం కనిపించింది. పలుచోట్ల రహదారులపైకి నీరు చేరగా వాగులు ఉప్పొంగాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోనూ వర్షం కురవగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం సమీపాన సీతమ్మ నార చీరల ప్రాంతం పూర్తిగా నీట మునిగింది. సీతమ్మ విగ్రహం సగం మేర మునిగిపోయింది.

టీచర్ పోస్టులు పెంచి భర్తీ చేయండి

విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడిలో ఆర్.కృష్ణయ్య



మీడియాతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

లక్డీకాపూల్ (హైదరాబాద్): టీచర్ పోస్టుల సంఖ్య విషయంలో అధికారులపై ఆధారపడకుండా నిరుద్యోగ, ఉద్యోగ సంఘాలతో సమావేశమై చర్చలు జరపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి అభ్యర్థులు, విద్యార్థి సంఘాల నాయకులు యత్నించారు. దీంతో విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షుడు, నిరుద్యోగ జాక్ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్వర్యంలో జరిగిన ముట్టడి కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 2,200 మాత్రమే ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలని, పదోన్నతుల ద్వారా భర్తీని 75 శాతం కాకుండా 25 శాతానికి తగ్గించి మిగతా పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం 11 వేల టీచర్ పోస్టుల భర్తీకే ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పీఆర్సీ కమిటీ నివేదిక పేర్కొందని ఆ మేరకు డీఎస్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు. కాగా, డీఎస్సీని వాయిదా వేయాలంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఓయూ జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్ మండిపడ్డారు.

సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో డీఎస్సీ అభ్యర్థుల నిరసన

చార్మినార్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముట్టడి కార్యక్రమం చేపట్టిన డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు దాదాపు 100 మందిని అరెస్టు చేసి పాతబస్తీ పేట్లబుర్జులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ గ్రౌండ్‌కు తరలించారు. అభ్యర్థులను మధ్యాహ్నం గ్రౌండ్‌కు తరలించగా అక్కడే రాత్రి వరకు ఆందోళన నిర్వహించారు.



పాపులర్ ఫ్రంట్ నేత జీన్ లుక్

సంకీర్ణమా... సంక్షోభమా?

ఫ్రాన్స్ ఎన్నికల్లో హంగ్



- రైటిస్ట్ కూటమికి ఎదురుదెబ్బ.. 143 సీట్లతో మూడో స్థానం
- లెఫ్ట్ కూటమికి 193, అధికార కూటమికి 164
- సంకీర్ణం ఏర్పాటుపై ప్రస్తుతానికి అస్పష్టతే
- 10 రోజుల్లోగా స్పష్టత వచ్చే అవకాశం

పారిస్: ఫ్రాన్స్ ముందస్తు ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ పార్టీ సారథ్యంలోని అతివాద కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంటు దిగువ సభ నేషనల్ అసెంబ్లీకి జూన్ 30న జరిగిన తొలి రౌండ్ ఎన్నికల్లో గెలిచిన ఆ కూటమి ఆదివారం కీలకమైన రెండో రౌండ్ పోలింగ్‌లో చేతులెత్తేసింది. 577 స్థానాలకు గాను 143 సీట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. సోమవారం వెలువడ్డ ఫలితాల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు. తొలి రౌండ్ పరాజయం నేపథ్యంలో వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)తో అవగాహనకు రావడం అధికార సెంట్రిస్ట్ కూటమికి కలిసొచ్చింది. మెజారిటీ స్థానాల్లో అవి ఒకే అభ్యర్థిని నిలపడంతో నేషనల్ ర్యాలీ కూటమి జోరుకు కళ్లెం పడింది. ముఖ్యంగా మెరీన్ లీ పెన్ సారథ్యంలోని నేషనల్ ర్యాలీ కూటమి ఫాసిస్టు ఎజెండాకు ప్రత్యామ్నాయంగా సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ తదితరాలతో ముందుకొచ్చిన ఎన్‌పీఎఫ్ అతి పెద్ద కూటమిగా అవతరించింది. దానికి 193 సీట్లు రాగా సెంట్రిస్ట్ కూటమి 164 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. ఎవరికీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 289 సీట్లు రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. దాంతో ఎన్‌పీఎఫ్‌తో కలిసి మాక్రాన్ కూటమి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదా, లేక పరిస్థితి రాజకీయ సంక్షోభం దిశగా వెళ్తుందా అన్నది ఆసక్తిగా మారింది. ప్రధాని పదవి కోసం ఎన్‌పీఎఫ్ పట్టుబడుతుండటం, ఆ కూటమిలోని అతివాద పార్టీలతో అధికారం పంచుకునేందుకు మాక్రాన్ సుముఖంగా లేకపోవడం వంటివి కారణం. దీనికి తోడు ఎన్‌పీఎఫ్‌లోనూ కీచులాటలున్నాయి. ఫ్రాన్సు లో దశాబ్దాలుగా ఏక పార్టీ పాలనే సాగుతూ వస్తోంది. నేషనల్ ర్యాలీకి ఆశించిన ఫలితాలు రాకపోయినా 2022 ఎన్నికల్లో కేవలం 89 సీట్లు సాధించిన కూటమి బలం ఈసారి గణనీయంగా పెరిగింది. ఫలితాలు తమకు ఎదురుదెబ్బ కాదని, తమ విజయం వాయిదా మాత్రమే పడిందని లీ పెన్ అన్నారు.



పాలక సెంట్రిస్ట్ కూటమి చీఫ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

అప్పుడే కీచులాటలు

ఫలితాల నేపథ్యంలో ప్రధాని గేబ్రియెల్ అటల్ సోమవారం రాజీనామా చేశారు. దాన్ని మాక్రాన్ తిరస్కరించారు. ఫ్రాన్స్ ఆతిథ్యమిస్తున్న ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు మూడు వారాలే ఉండటంతో తాత్కాలికంగా పదవిలో కొనసాగాలని కోరారు. అందుకు అటల్ సిద్ధంగా ఉన్నా ఎన్‌పీఎఫ్ మాత్రం అధికారం చేతులు మారాల్సిందేనని పట్టుబడుతోంది. ప్రజాభీష్టాన్ని గౌరవించి తమనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని, ప్రధాని పదవి తమకే చెందాలని వామపక్ష నేత జీన్ లూక్ మెలెన్‌చోన్ డిమాండ్ చేశారు. అదే జరిగితే అధ్యక్షుడు, ప్రధాని వేర్వేరు పార్టీల నుంచి ఉండటం ఫ్రాన్స్‌లో 22 ఏళ్లలో ఇదే తొలిసారి అవుతుంది. పలు అధికారాలను కూడా ప్రధానితో మాక్రాన్ పంచుకోవాల్సి ఉంటుంది. దీన్ని కో హాబిటేషన్‌గా పిలుస్తారు. దేశ చరిత్రలో ఇలాంటి సందర్భాలు ఇప్పటికి మూడుసార్లు వచ్చాయి. పలు మాక్రాన్ సంస్కరణలకు చరమగీతం పాడతామని, అత్యంత వ్యయ ప్రయాసలతో కూడిన ప్రజా వ్యయ పథకాన్ని తెస్తామని, ఇజ్రాయెల్‌పై కఠిన వైఖరి అవలంబిస్తామని ఎన్‌పీఎఫ్ ఇప్పటికే స్పష్టం చేయడంతో సంకీర్ణం ఏర్పాటు, మనుగడపై సందేహాలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఎన్‌పీఎఫ్ భాగస్వాముల్లో అతివాద వామపక్షమైన ఫ్రాన్స్ అన్‌బౌడ్‌తో కలిసి పని చేయబోమని మాక్రాన్ ఇప్పటికే ప్రకటించారు. సోషలిస్టులు, గ్రీన్స్‌తో భాగస్వామ్యానికి మొగ్గుతున్నారు. కానీ కొన్ని పక్షాలను పక్కన పెట్టేందుకు ఎన్‌పీఎఫ్ కూటమి అంగీకరించకపోవచ్చంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా నూతన జాతీయ అసెంబ్లీని జూలై 18న సమావేశపరుస్తానని మాక్రాన్ ప్రకటించారు. నాటో భేటీ కోసం బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. తిరిగొచ్చాక సంకీర్ణ ఏర్పాటుపై ఎన్‌పీఎఫ్‌తో చర్చలుంటాయని భావిస్తున్నారు. హంగ్ ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ పడిపోయింది. యూరో విలువ కూడా 0.2 శాతం పడిపోయింది.

ప్రధానీ పవర్‌ఫుల్లే...

ఫ్రాన్స్‌లో 1958 నుంచి సెమీ ప్రెసిడెన్షియల్ పాలన వ్యవస్థ అమల్లో ఉంది. దీన్ని ఫిఫ్త్ రిపబ్లిక్‌గా పిలుస్తారు. ఇందులో అధ్యక్షునితో పాటు పార్లమెంటుకూ విశేషాధికారాలు ఉంటాయి. 1962 నుంచి అధ్యక్షుడిని ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా నేరుగా ఎన్నుకుంటున్నారు. ఆయనే దేశాధిపతిగా, సాయుధ దళాల కమాండర్‌గా వ్యవహరిస్తారు. విదేశాంగ విధానం, రక్షణ విషయాలపై సర్వాధికారాలు ఆయనవే. ప్రధాని సిఫార్సు మేరకు కేబినెట్‌ను నియమిస్తారు. దేశీయ నిర్ణయాలన్నీ ప్రధాని నేతృత్వంలోని పార్లమెంటు తీసుకుంటుంది. ఆయనను అధ్యక్షుడు తొలగించలేరు. రాజీనామాను అభ్యర్థించవచ్చు. రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘిస్తే మూడింట రెండొంతుల మెజారిటీతో అధ్యక్షున్ని పార్లమెంటు అభిశంసించవచ్చు.




అతివాద నేషనల్ ర్యాలీ కూటమి సారథి మెరీన్ లీ పెన్

ఫలించని ముందస్తు...

నేషనల్ అసెంబ్లీ పదవీకాలం 2027 దాకా ఉంది. కానీ జూన్ 9న యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ చేతుల్లో మాక్రాన్ కూటమి ఘోర పరాజయం చవిచూసింది. దీనికితోడు ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నేరాలు తదితరాలతో మాక్రాన్ నాయకత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. వీటన్నింటి నేపథ్యంలో మాక్రాన్ ముందస్తుకు వెళ్లారు. ఎన్నికల తేదీలు ప్రకటించగానే, సోషలిస్టులు, ఎకాలజిస్టులు, కమ్యూనిస్టులు, ఫ్రాన్స్‌అన్‌బాడ్ వంటివి కలిసి కలిసి ఎన్‌పీఎఫ్‌గా ఏర్పడ్డాయి. నేషనల్ ర్యాలీ కూటమిని ఓడించడమే లక్ష్యంగా చాలాచోట్ల ఎన్‌పీఎఫ్, సెంట్రిస్ట్ అభ్యర్థుల్లో ఎవరో ఒకరు తప్పుకుని ఓట్ల చీలికను నివారించారు. ఫలితంగా నేషనల్ ర్యాలీని నిలువరించినా మాక్రాన్ కూటమికి ఆయన ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు.

దేశవ్యాప్త హింస...

ఎన్నికల్లో ఆధిక్యం నేపథ్యంలో ఎన్‌పీఎఫ్ మద్దతుదారులు వీధుల్లోకొచ్చి సంబరాలు చేసుకున్నారు. పారిస్‌లోని ప్లేస్ డి లా రిపబ్లిక్ వద్ద వేలాదిగా గుమిగూడారు. ఈ క్రమంలో వారికి, నేషనల్ ర్యాలీ అభిమానులకు ఘర్షణ చోటుచేసుకుంది. దాంతో పారిస్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో హింస చెలరేగింది. మాస్కులు ధరించిన నిరసనకారులు పారిస్ వీధుల్లో పరుగులు తీశారు. కొన్నిచోట్ల ఆస్తులను తగలబెట్టారు. రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు.



ఒలింపిక్స్‌పై ప్రభావమెంత?

హంగ్ ఫలితాలతో ఫ్రాన్స్‌లో రాజకీయ అస్థిరత నెలకొనడంతో జూలై 26 నుంచి జరగాల్సిన పారిస్ ఒలింపిక్స్‌పై దాని ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ జోరందుకుంది. అవి పూర్తయేదాకా పదవిలో కొనసాగేందుకు ప్రధాని అటల్ సుముఖంగా ఉన్నా ఆలోపే కొత్త ప్రధాని రావాల్సిందేనని అత్యధిక స్థానాలు సాధించిన లెఫ్ట్ కూటమి పట్టుబడుతోంది. ఒలింపిక్స్ భద్రత వ్యవహారాలు చూసుకునే కీలకమైన అంతర్గత భద్రత శాఖ మంత్రి గెరాల్డ్ డ్రమానియన్ కొనసాగడంపైనా సందిగ్ధతే కొనసాగుతోంది. ఒలింపిక్స్‌ను ఫ్రాన్స్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏడేళ్లుగా భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. తాత్కాలిక స్టేడియాలు, మౌలిక సదుపాయాలు తదితరాలపై ఇప్పటికే 260 కోట్ల డాలర్లకు పైగా వెచ్చించింది. ఏర్పాట్లన్నీ దాదాపుగా పూర్తయినట్టేనని, ఒలింపిక్స్ నిర్వహణకు ఇబ్బందేమీ ఉండబోదని మాక్రాన్ ప్రభుత్వం చెబుతోంది. వాటి పర్యవేక్షణకు ఇబ్బంది ఉండకూడదనే అటల్ రాజీనామాను మాక్రాన్ ఆమోదించలేదని సమాచారం.

ఏం జరగవచ్చు?

సంకీర్ణ ఏర్పాటు సాధ్యపడని పక్షంలో రోజువారీ వ్యవహారాలను నడిపేందుకు ఏ పార్టీలకు చెందని నిపుణులతో కూడిన ప్రభుత్వాన్ని మాక్రాన్ ఏర్పాటు చేసే వీలుంది. అయితే దేనికైనా పార్లమెంటు అనుమతి తప్పనిసరి. అధ్యక్షునిగా మాక్రాన్ పదవీకాలం 2027 దాకా ఉంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఆలోపు తప్పుకోబోనని ఆయన ఇప్పటికే ప్రకటించారు.

మాస్కోలో మోదీ



మోదీ, పుతిన్ ఆత్మీయ ఆలింగనం

- నేడు పుతిన్‌తో మోదీ చర్చలు
- 22వ ఇండో–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సుకు సిద్ధమైన అగ్రనేతలు

మాస్కో/న్యూఢిల్లీ: భారత్, రష్యాల మైత్రీ బంధాన్ని నూతన సమున్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా ప్రధాని మోదీ రెండ్రోజుల రష్యా పర్యటన ఆరంభమైంది. 22వ ఇండో–రష్యా శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు మోదీ సోమవారం రష్యాకు విచ్చేశారు. మంగళవారం ఉదయం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని మోదీ అల్పాహారం అనంతరం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. విస్తృతస్థాయి చర్చలు జరపనున్నారు. తర్వాత దౌత్య, అధికారిక బృందాలతో కలిసి వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఇరుదేశాల మధ్య పటిష్ట మైత్రి, సహకార బంధంపై సమగ్ర, లోతైన చర్చలు జరపనున్నారు. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించిన అంశం చర్చకొచ్చే అవకాశముంది. రష్యా సైన్యంలో సహాయక సిబ్బందిగా భారతీయులను రిక్రూట్ చేసుకుని ఉక్రెయిన్ యుద్ధక్షేత్రాలకు తరలించిన ఉదంతాలు చర్చకొచ్చే అవకాశముంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక మోదీ రష్యాకు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

మోదీకి పుతిన్ విందు...

మాస్కో శివారులోని నోవో–ఒగార్యోవో అధికార నివాసంలో మోదీని పుతిన్ సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా ఇరునేతలూ హత్తుకున్నారు. ఈ సందర్భంగా రాత్రి మోదీకి పుతిన్ ప్రత్యేక విందు ఇచ్చారు. మోదీ పాలనలో భారత్ సాధించిన అభివృద్ధిని పుతిన్ ఈ సందర్భంగా కొనియాడారు. అంతకుముందు మాస్కో విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి రష్యా మొదటి ఉపప్రధాని డెనిస్ మాన్‌ట్సురోవ్ సాదర స్వాగతం పలికారు. అక్కడే మోదీ రష్యా సైనికుల సైనికవందనం స్వీకరించారు. ది కార్ల్‌టన్ హోటల్‌లో మోదీకి పెద్దసంఖ్యలో భారత సంతతి ప్రజలు స్వాగతం పలికారు. హిందీ పాటలకు భారతీయులు, రష్యా కళాకారులు నృత్యంచేస్తూ మోదీని ఆనందంలో ముంచెత్తారు. 'ఇప్పుడే మాస్కో నేలపై అడుగుపెట్టా. మిత్రుడు పుతిన్‌తో భేటీకి ఎదురుచూస్తున్నా. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోబోతున్నా. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల స్థాపనకు ఇరువురం మా వంతు కృషిచేస్తాం'' అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.



మణిపూర్ రాష్ట్రం చురాచంద్‌పూర్‌లోని శిబిరంలో బాలలతో రాహుల్ గాంధీ

మోదీజీ.. మణిపూర్‌కు రండి

- ఇక్కడి వారి కష్టాలను స్వయంగా వినండి
- ప్రధానికి రాహుల్ విజ్ఞప్తి
- బాధితులను ఓదార్చిన విపక్షనేత

ఇంఫాల్: జాతుల మధ్య వైరంతో కొన్ని నెలల క్రితం రావణకాష్ఠంగా రగిలిపోయిన మణిపూర్‌కు ప్రధాని మోదీ ఒక్కసారి సందర్శించి ఇక్కడి వారి కష్టాలను అర్థంచేసుకోవాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ విజ్ఞప్తిచేశారు. సోమవారం మణిపూర్‌లోని జిరిబామ్, చురాచాంద్‌పూర్ జిల్లాల్లో ఘర్షణల్లో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను రాహుల్ పరామర్శించారు. బీజేపీపాలిత రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో పలు శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్న వారిని ఓదార్చారు. వారి బాగోగులను అడిగి తెల్సుకున్నారు. '' సోదరుడిగా ఇక్కడికొచ్చా. మీ బాధలు, కష్టాలు వింటా. ఇక్కడ శాంతి నెలకొనాల్సిన సమయం వచ్చింది. హింస ప్రతి ఒక్కరినీ బాధిస్తోంది. వేల కుటుంబాలు కష్టాలబారిన పడ్డాయి. ఆస్తుల విధ్వంసం కొనసాగింది. అమాయక జనం తమ కుటుంబసభ్యులను కోల్పోయారు. దేశంలో మరెక్కడా ఇంతటి దారుణాలు చోటుచేసుకోలేదు. మణిపూర్‌లో మళ్లీ శాంతియుత వాతావరణం నెలకొనేందుకు, మీకు బాసటగా నిలిచేందుకు, మీ సోదరుడిగా వచ్చా'' అని బాధిత కుటుంబాలతో రాహుల్ అన్నారు. బాధితులను కలిశాక పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' మణిపూర్‌లో ఏం జరుగుతోందో ప్రధాని మోదీకి తెలియాలి. అందుకోసం ఇక్కడికి రండి. ఇక్కడ ఏం జరుగుతోందో తెల్సుకోండి. ప్రజల కష్టాలు వినండి'' అని పరోక్షంగా మోదీకి విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో భేటీ

రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికేను సైతం రాహుల్ కలిశారు. రాష్ట్రంలో పరిస్థితి ఇంకా సద్దుమణకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా

- కీవ్‌లోని పిల్లల ఆస్పత్రిపైనా దాడి
- 31 మంది మృతి.. 154 మందికి గాయాలు

కీవ్: దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. సోమవారం ఉదయం నుంచి పలు నగరాల్లోని మౌలిక వనరులు, విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా వివిధ రకాలైన 40 వరకు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో కనీసం 31 మంది చనిపోగా మరో 154 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కీవ్‌లోని చిన్నారుల ఆస్పత్రి సహా పలు నివాస ప్రాంతాలపై క్షిపణులు పడటంతో భారీగా పేలుళ్లు సంభవించాయి. పలు చోట్ల మంటలు వ్యాపించాయి. రాజధాని కీవ్‌లోని 10 జిల్లాలకు గాను ఏడు జిల్లాల్లో జరిగిన దాడుల్లో 14 మంది చనిపోగా పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. మూడంతస్తుల నివాస భవనం పూర్తిగా ధ్వంసమైంది. మరో నగరం క్రివ్యి రిహ్‌లో 10 మంది ప్రాణాలు కోల్పోగా మరో 47 మంది గాయపడ్డారు. కీవ్‌లోని రెండంతస్తుల చిన్నారుల ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఆపరేషన్ థియేటర్, అంకాలజీ విభాగం దెబ్బతిన్నాయి. ఆస్పత్రిలోని పదంతస్తుల ప్రధాన భవనం కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. ఘటన నేపథ్యంలో ఆస్పత్రిలో వారందరినీ ఖాళీ చేయిస్తున్నారు. ఆస్పత్రిపై దాడిలో ఏడుగురు చిన్నారులు సహా 16 మంది గాయపడినట్లు మేయర్ విటాలి క్రిట్చ్‌కో చెప్పారు. ప్రాణ నష్టం వివరాలు తెలియాల్సి ఉందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా ప్రయోగించిన క్షిపణుల్లో ధ్వని కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించగల హైపర్‌సోనిక్ కింఝాల్ మిస్సైళ్లు కూడా ఉన్నాయని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. మొత్తం 40 క్షిపణుల్లో 30 వరకు కూల్చివేశామని, వీటిలో కింఝాల్ రకానివి 11 ఉన్నాయని పేర్కొంది. ఉక్రెయిన్‌కు మరింత సాయం అందించేందుకు గల అవకాశాల్ని పరిశీలించేందుకు వాషింగ్టన్‌లో నాటో దేశాలు మంగళవారం భేటీ అవుతున్న వేళ రష్యా భారీ దాడులకు పూనుకుందని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, ఆస్పత్రిపై దాడిని జర్మనీ, చెక్ రిపబ్లిక్ తీవ్రంగా ఖండించాయి. అయితే, తాము ఉక్రెయిన్ రక్షణ, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపామని రష్యా ఆర్మీ పేర్కొంది. ఉక్రెయిన్ క్షిపణి రక్షణ వ్యవస్థల వల్లే ఆస్పత్రికి నష్టం వాటిల్లినట్లు తెలిపింది.



రష్యా క్షిపణి దాడిలో ధ్వంసమైన కీవ్‌లోని ఆస్పత్రి భవనం

ఉగ్రదాడిలో అమరులైన ఐదుగురు జవాన్లు

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఘటన

కథువా/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో భద్రతా బలగాలే లక్ష్యంగా మరోసారి ఉగ్రదాడి జరిగింది. ముష్కరులు పొంచి ఉండి జరిపిన దాడిలో ఐదుగురు ఆర్మీ జవాన్లు అమరులు కాగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మారుమూల మచేడి ప్రాంతంలోని బడ్నోటా గ్రామ సమీపంలో మచేడి–కిండ్లి–మల్హర్ రహదారిపై మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఆర్మీ గస్తీ వాహనాలపై ఉగ్రవాదులు మొదటగా గ్రెనేడ్లు విసిరి, ఆపై యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డారు. జవాన్లు తిరిగి కాల్పులు జరపగానే సమీప అటవీ ప్రాంతంలోకి ముష్కరులు జారుకున్నారు. ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఇటీవల పాక్ నుంచి దొంగచాటుగా ప్రవేశించింది వీరేనని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన నేపథ్యంలో అదనపు బలగాలు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. కథువా జిల్లాలో ఇటీవల వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

నీట్ లీకేజీ నిజమే గానీ...

- ప్రభావం తీవ్రంగా ఉంటేనే రీ టెస్ట్: సుప్రీంకోర్టు
- కేంద్రం, ఎన్టీఏకు పలు ప్రశ్నలు
- సీబీఐ నివేదికకు ఆదేశాలు

"నీట్–యూజీ పేపర్ లీకైందన్నది స్పష్టమవుతోంది. దాని విస్తృతి ఎంతనేది అసలు ప్రశ్న. ధాన్యం నుంచి బియ్యం ఏరాల్సిన పరిస్థితి ఏర్పడింది. లీకేజీ ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటే రీ టెస్ట్ తప్పనిసరి. అయితే అది చివరి ఆప్షన్ మాత్రమే"

– సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన నీట్–యూజీ, 2024 లీకేజీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నది. లీకేజీ వాస్తవమేనని తేలింది. దాని ప్రభావం తాలూకు విస్తృతి ఎంతన్నది తేలాలి. ప్రశ్నపత్రం సోషల్ మీడియా ద్వారా అంతటా లీకై పరీక్ష తాలూకు సమగ్రతే పూర్తిగా దెబ్బతిని ఉంటే రీ టెస్ట్ తప్పదు. అలాకాకుండా లీకేజీ కొన్ని ప్రాంతాలకే పరిమితమై, దాని లబ్ధిదారులైన విద్యార్థులతో పాటు దోషులను స్పష్టంగా గుర్తించడం సాధ్యపడే పక్షంలో పరీక్షను తిరిగి నిర్వహించడం సబబు కాబోదు. ఇది 23 లక్షల పై చిలుకు అభ్యర్థులు హాజరైన భారీ స్థాయి పరీక్ష అని గుర్తుంచుకోవాలి'' అని అభిప్రాయపడింది. అందుకే సరైన ఆదేశాలిచ్చేందుకు వీలుగా లీకేజీకి సంబంధించి పలు అంశాలపై తమకు స్పష్టత ఇవ్వాలని కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లను, దర్యాప్తుపై తాజా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. విచారణ గురువారానికి వాయిదా వేసింది. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించింది. టెలిగ్రాం యాప్ ద్వారా ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని బిహార్ పోలీసులు అరెస్టు చేశారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. పేపర్ లీకేజీపై ఎన్టీఏ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తోందని ఆరోపించారు. పేపర్ లీకైందని అంగీకరిస్తున్నారా అని కేంద్రాన్ని సీజేఐ ప్రశ్నించారు. బిహార్‌లో అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులను గుర్తించి వారి ఫలితాలు నిలిపేసినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు.

రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీ

- రాష్ట్రాలు, భాగస్వామ్యపక్షాలతో సంప్రదించండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నెలసరివేళ ఇబ్బందిపడే ఉద్యోగినులకు రుతుస్రావ సెలవులపై మోడల్ పాలసీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈ విషయంలో సంబంధిత వర్గాలు, రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన విధానానికి రూపకల్పన చేయాలని సోమవారం కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. అయితే విధాన నిర్ణేతల పరిధిలోని ఈ అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకోబోవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా విద్యార్థినులు, ఉద్యోగినులకు ప్రతినెలా నెలసరి సెలవులు ఇవ్వాలంటూ లాయర్ శైలేంద్రమణి త్రిపాఠి వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ కోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. ''రుతుస్రావ సెలవుపై కోర్టు నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగినుల ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది. అసౌకర్యంవేళ సెలవు దొరుకుతుందని భావిస్తే ఎక్కువ మంది ఉద్యోగాలు చేసేందుకు మొగ్గుచూపుతారు. అయితే ఉద్యోగినులకు ఇలాంటి సెలవు ఇవ్వడం ఇష్టంలేని సంస్థలు, యాజమాన్యాలు మహిళలకు ఉద్యోగం ఇచ్చేందుకు విముఖత చూపే ప్రమాదం కూడా ఉంది. ఉన్న ఉద్యోగినులను కూడా తగ్గించుకునే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి విపరిణామాలకు మేం అవకాశం ఇవ్వదల్చుకోలేదు. వాస్తవానికి ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. ఇందులో కోర్టు జోక్యం ఉండకూడదు'' అని కోర్టు వ్యాఖ్యానించింది. చైనా, బ్రిటన్, జపాన్, ఇండోనేసియా, స్పెయిన్, జాంబియా, దక్షిణకొరియాలో ఏదో ఒక కేటగిరీ కింద ఇలాంటి సెలవులు ఇస్తున్నాయంటూ లాయర్ చేసిన వాదనలను కోర్టు తోసిపుచ్చింది. ''ఈ సెలవులు ఇవ్వాలని గత ఏడాది మే నెలలోనే పిటిషనర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం నుంచి ఇంతవరకు స్పందన లేదు. విధానపర నిర్ణయమైన ఇలాంటి అంశంలో కోర్టులు జోక్యం చేసుకోలేవు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

విశ్వాస పరీక్ష నెగ్గిన సోరెన్ ప్రభుత్వం

రాంచీ: జార్ఖండ్‌లో జేఎంఎం సారథ్యంలోని హేమంత్ సోరెన్ సంకీర్ణ ప్రభుత్వం సోమవారం శాసనసభ విశ్వాసం పొందింది. మొత్తం 81 మంది ఎమ్మెల్యేలకు గాను 75 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో నామినేటెడ్ సభ్యుడు గ్లెన్ జోసెఫ్ సహా జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీలకు చెందిన 45 మంది విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్..మాజీ సీఎం చంపయి సోరెన్ సహా 11 మందితో మంత్రులుగా ప్రమాణం చేయించారు.

ఎవరిని కాపాడాలనుకుంటున్నారు?

న్యూఢిల్లీ: ఎవరినో రక్షించేందుకు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడమేంటని సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సందేశ్‌ఖాలీ ప్రాంతంలో మహిళలపై నేరాలు, భూ ఆక్రమణలపై సీబీఐ విచారణకు ఆదేశిస్తూ కలకత్తా హైకోర్టు ఏప్రిల్ 10వ తేదీన ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేసిన బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఈ సందర్భంగా తప్పుబట్టింది. హైకోర్టు ఆదేశాలను నిలువరించడం కుదరదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది.



గ్రేటర్ సిటీలో
రియల్ ఎస్టేట్
రంగం కుదేలు
గత రెండేళ్లతో పోల్చితే
తగ్గిపోయిన రిజిస్ట్రేషన్లు,
ఆదాయం

సిటీ రియల్ మార్కెట్ ధమాల్



- ఎన్నికల ముందు నుంచీ స్థిరాస్తి రంగం మందగమనం
- రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా అదే స్తబ్ధత
- కొత్త ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై స్పష్టత లేక గందరగోళం
- భూమి విలువల పెంపు, లే–ఆఫ్‌లు, ఆర్థిక మందగమనం వంటివీ కారణమే

వరుస ఎన్నికలు, ప్రభుత్వ మార్పు, భూమి విలువల సవరణ, కరువు ఛాయలు, ఆర్థిక మందగమనం, బ్యాంకు రుణవడ్డీ రేట్ల భారం.. వెరసి రియల్ ఎస్టేట్ రంగంపై ముప్పేట దాడి జరుగుతోంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్థిరాస్తి క్రయవిక్రయాలు పడిపోయాయి. గత ఏడాది చివర్లో శాసనసభ ఎన్నికలతో మొదలైన ప్రతికూల పరిస్థితి క్రమంగా తారస్థాయికి చేరింది. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చే పాలసీలు, నిర్ణయాలపై ఎలాంటి స్పష్టత లేకపోయే సరికి పరిశ్రమ నిరాశలోకి జారిపోయింది.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానరాని స్పష్టత

సాధారణంగా ఎన్నికలకు ఆరేడు నెలల ముందు నుంచే స్థిరాస్తి మార్కెట్ క్రమంగా తగ్గుతూ ఉంటుంది. నగదు లభ్యత,లావాదేవీలపై పరిమితులు, వడ్డీ రేట్ల ప్రభావం, డిమాండ్–సరఫరా మధ్య వ్యత్యాసం వంటివి స్థిరాస్తి రంగంపై ప్రభావం చూపిస్తాయి. కానీ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా.. ఇప్పటికీ విధానాలు, పాలసీల అమలుపై స్పష్టత కొరవడింది. ఔటర్ వరకూ జీహెచ్ఎంసీ విస్తరణ, మెగా మాస్టర్ ప్లాన్, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ, 111 జీవో రద్దు వంటి పలు కీలక ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటన్నది తేలడం లేదు. దీంతో బిల్డర్లు, కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారని రియల్ ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి.

రిజిస్ట్రేషన్లపై లెక్కలు చూస్తే..

2022 జనవరి–జూన్ మధ్యలో గ్రేటర్‌లో మొత్తం 2,48,817 స్థిరాస్తి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కాగా.. రూ.4,108 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే సమయంలో 2,32,628 డాక్యుమెంట్లే రిజిస్ట్రేషన్ అయి.. ఆదాయం రూ.3,920 కోట్లకు తగ్గింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు 2,18,749కు పడిపోయాయి. అంటే 2022తో పోలిస్తే 30 వేల రిజిస్ట్రేషన్లు తగ్గాయి.

సాధారణంగా గ్రేటర్ పరిధిలో మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం ఎక్కువగా ఉంటుంది. కానీ గత రెండేళ్లుగా ఈ జిల్లాల పరిధిలో రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గుతూ వస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో గత ఏడాది తొలి ఆరు నెలల్లో 30,814

మేడ్చల్, రంగారెడ్డి పరిధిలో తగ్గుదల

డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కాగా.. రూ.758.13 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అదే సమయంలో రిజిస్ట్రేషన్లు 30,111 డాక్యుమెంట్లకు, ఆదాయం రూ.731.15 కోట్లకు తగ్గాయి. అలాగే మేడ్చల్‌లో డాక్యుమెంట్లు 83,742 నుంచి 75,068కు, రంగారెడ్డిలో 1,18,072 నుంచి 1,13,570కు తగ్గాయి.

గ్రేటర్‌లో గృహాలు, ఆఫీసు స్పేస్ వ్యాపారం ఎక్కువ శాతం ఐటీ కంపెనీలు, ఉద్యోగుల మీద ఆధారపడి ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనంతోపాటు ఐటీ రంగంలో లే–ఆఫ్‌లు జరుగుతున్నాయి. కంపెనీలు కూడా విస్తరణ ప్రణాళికలను వాయిదా వేస్తున్నాయి. ఇది ఐటీ కం

లే-ఆఫ్‌లు, ధరల పెరుగుదలా కారణమే..

పెనీలు, ఉద్యోగులపై ప్రభావం చూపడంతో.. గ్రేటర్‌లో స్థిరాస్తి వ్యాపారం మందకొడిగా మారింది. మరోవైపు కరోనా తర్వాత సిమెంట్, స్టీలు వంటి నిర్మాణ సామగ్రి ధరలు రెట్టింపయ్యాయి. దీంతో డెవలపర్లు అపార్ట్‌మెంట్ల ధరలను పెంచేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాటిని కొనలేని స్థితిలో ఉన్నారు.


కొనుగోలు వాయిదా వేసుకుంటున్నారు

సాధారణంగా హైదరాబాద్‌లో మధ్యతరగతి గృహాల మార్కెట్ ఎక్కువగా ఉంటుంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువు దీరడంతో మార్కెట్ ఎలా ఉంటుందో అన్న సందేహాలు ఉన్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇళ్ల కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఆరంభం నుంచి స్థిరాస్తి రంగం బాగుంటుంది.

- ఇంద్రసేనారెడ్డి,
గిరిధారి హోమ్స్ ఎండీ

గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్ గణాంకాలివీ

(ఆదాయం రూ.కోట్లలో)



లక్ష్యం
30.81
లక్షల మొక్కలు
- వివరాలు 9లో

నేచర్ జోష్
చిలుకూరు
ఫారెస్ట్ ట్రెక్ పార్క్
- వివరాలు 13లో





కల్తీ కల్లోలం

నగరంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ నుంచి ఆయిల్స్ దాకా కల్తీ

ఉద్యోగాలు, పని ఒత్తిడితో రెడీమేడ్ దినుసులు కొంటున్న సిటీ జనం

వారి అవసరం ఆసరాగా చెలరేగుతున్న 'కల్తీ' ముఠాలు

చెడిపోయిన పదార్థాలు, ప్రమాదకర రసాయనాలు కలిపి దినుసుల తయారీ

పలుమార్లు భారీగా నకిలీ, కల్తీ సరుకులను పట్టుకున్న పోలీసులు

అలాంటి సరుకులతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యుల హెచ్చరికలు

సాక్షి, హైదరాబాద్

ఇందుగలదు అందులేదన్న సందేహమే లేదన్నట్టుగా.. నిత్యావసర సరుకుల్లో దేనిలో చూసినా కల్తీలు, నకిలీలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా అల్లం-వెల్లుల్లి పేస్ట్, కారంపొడి, మసాలాలు, నూనెలు వంటివి విపరీతంగా కల్తీ అవుతున్నాయి. గ్రేటర్ నగరంలో ఉద్యోగాలు, పని ఒత్తిడితో రెడీమేడ్ సరుకులు కొనేవారి అవసరాన్ని ఆసరాగా తీసుకుని కల్తీ ముఠాలు చెలరేగిపోతున్నాయి. చెడిపోయిన, కుళ్లిపోయిన పదార్థాలను వాడటంతోపాటు వివిధ రకాల రసాయనాలు, ప్రమాదకర పదార్థాలు కలిపి కల్తీ దినుసులను మార్కెట్లోకి వదులుతున్నాయి. టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేస్తున్న ప్రతిసారి భారీ మొత్తంలో ఇలాంటి నకిలీ, కల్తీ సరుకులు పట్టుబడుతూనే ఉన్నాయి. వీటివల్ల ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదకర పదార్థాలతో..

- కల్తీ ముఠాలు.. దినుసుల్లో కలుపుతున్న పదార్థాలు భయపెడుతున్నాయి. జంతువుల కళేబరాల నుంచి తీసిన కొవ్వుతో తయారైన మంచి నూనె.. రంపపు పొడి, బోరిక్ పౌడర్లు కలిపిన మసాలా పొడర్లు.. ప్రమాదకర రసాయనాలు కలిపిన మసాలాల విక్రయం సర్వసాధారణంగా మారింది.
- రాతిపొడి, పెయింట్ స్టెయినర్, మైదా పిండి వంటివి కలిపి నకిలీ గసగసాలు తయారు చేస్తున్నారు.
- అంతేకాదు పలు దినుసులలో సింథటిక్ పెయింట్లు కలుపుతున్నట్టు అధికారుల దాడుల్లో తేలింది. ఆ పెయింట్లలో ఉండే సీసం విషపూరితమని, రక్తంలో హిమోగ్లోబిన్‌ను తగ్గిస్తుందని... బరువు తగ్గడం, మలబద్ధకం, రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆ పేస్ట్.. వరస్ట్..

కల్తీ లేకుండా దొరకాలంటే భూతద్దం పెట్టి వెతకాలేమో అనేలా మారిపోయిన సరుకుల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒకటి. మార్కెట్లో లభించే అత్యధిక అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీదే. నాసిరకం అల్లం, వెల్లుల్లిలను వాడటమేకాదు.. ఉల్లి, దుంపలు, ఇతర పదార్థాలను కూడా కలుపుతున్నారు. ఈ మిశ్రమం డయేరియా, ఉదరకోశ వ్యాధులకు కారణమవుతోంది. అలాగే వీటిలో కలిపే సింథటిక్ పౌడర్, గమ్ పౌడర్లు కూడా ప్రమాదకరం.

- ➤ ఇటీవల ఉప్పర్‌పల్లిలో ఓ గోడౌన్ మీద దాడి చేసిన పోలీసులు.. ఏకంగా 4 టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్‌లో 5 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను, యాదాద్రి జిల్లా బీబీనగర్ పరిధిలోనూ కల్తీ అల్లం పేస్ట్‌ను పోలీసులు పట్టుకున్నారు. పేస్ట్ చిక్కగా ఉండేందుకు వీరు సింథటిక్ పౌడర్, గమ్ పౌడర్ వంటి ప్రమాదకర పదార్థాలను కలిపినట్టు గుర్తించారు.
- ➤ ఈ ఏడాది మే నెలలో కాటేదాన్‌లోని ఓ పరిశ్రమపై సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి.. కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లితోపాటు ప్రమాదకర రసాయనాలు కలిపిన అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను పట్టుకున్నారు.
- ➤ పహాడీ షరీఫ్‌లో చెక్కపొడి, ఎండుటాకులు, కృత్రిమ రంగులను కలిపి కల్తీ గరం మసాలా తయారీ చేస్తూ, ప్రముఖ కంపెనీల లేబుళ్లతో విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేశారు.
- ➤ నకిలీ మసాలా ఉత్పత్తులను విక్రయిస్తున్న ఉత్తరప్రదేశ్ వాసిని నగరంలోని బేగంబజార్‌లో నిర్వహించిన దాడుల్లో పట్టుకున్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

ఆయిల్.. అనారోగ్యం ఫుల్

అత్యధికంగా కల్తీ అవుతున్న సరుకుల్లో వంట నూనెలు కూడా ఒకటి. సన్‌ఫ్లవర్, పామాయిల్ వంటి ఎక్కువగా వాడే నూనెలను.. జంతు కళేబరాల నుంచి తీసిన కొవ్వులతో కల్తీ చేసి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెల వల్ల కంటి జబ్బులు, గుండె జబ్బులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- ➤ నగరంలో విషపూరిత రసాయనాలతో కల్తీ చేసిన మసాలాలు భారీగా పట్టుబడ్డాయి. బొప్పాయి గింజలకు సింథటిక్ గమ్, ఐరన్ ఆక్సైడ్, మైదా పిండి, కొన్ని రసాయనాలు కలిపి మిరియాలుగా విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి అప'కారం'

జనం ఒకప్పుడు ఎండు మిరపకాయలను కొని పొడి చేసుకునేవారు. కానీ ఇప్పుడు మార్కెట్లో నేరుగా కారంపొడి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారంపొడి విపరీతంగా కల్తీ అవుతోంది. ఇటుక పొడి, పొట్టైన మిరియాలు, సున్నపు పొడి వంటి పదార్థాలను కలుపుతున్నారు. కారంపొడి ఎర్రగా కనిపించేందుకు 'సుడాన్ డై' అనే రసాయనాన్ని కలుపుతున్నారు. ఇది కేన్సర్ కారకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. కారంపొడిలో కలిసే కల్తీలతో డయేరియా, ఇతర అనారోగ్య సమస్యలూ వస్తాయని చెప్తున్నారు.

కల్తీని తెలుసుకోవడం ఎలా..

నకిలీ, కల్తీ సరుకుల విషయంలో మోసపోకుండా, వాటిని గుర్తించేందుకు ఏం చేయాలన్న దానిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తరచూ పలు సూచనలు చేస్తూ ఉంటుంది. వాటిని పాటిస్తే కల్తీల నుంచి మనం బయటపడవచ్చని నిపుణులు చెప్తున్నారు. వీలైనంత వరకు అల్లం వెల్లుల్లి పేస్ట్, మసాలాల వంటివి ఇంట్లోనే తయారు చేసుకుంటే మేలు అని స్పష్టం చేస్తున్నారు.

ఉదాహరణకు కారంపొడిని తీసుకుంటే..

'ఒక గ్లాసులో నీళ్లు తీసుకుని, అందులో ఒక చెంచాడు కారంపొడి వేయాలి. నీళ్లన్నీ రంగు కలిపినట్టుగా ఎర్రగా అయితే అది కల్తీయే. గ్లాసులో అడుగుకు చేరిన కారం పొడిని చేతిలోకి తీసుకుని రుద్ది చూడాలి. గరుకుగా అనిపిస్తే ఇటుక పొడి కలిసి ఉందని అర్థం. కారంపొడి నీళ్ల సబ్బులా మృదువుగా అనిపిస్తే.. అందులో డిటర్జెంట్, యూరియా వంటివి కలిసి ఉండొచ్చని నిపుణులు చెప్తున్నారు.

కల్తీల నిరోధానికి చట్టం ఉన్నా..

ఆహార పదార్థాల కల్తీని నిరోధించేందుకు, కల్తీకి పాల్పడినవారిని శిక్షించేందుకు ప్రత్యేక చట్టం ఉంది. కల్తీలు, నకిలీలకు పాల్పడినవారికి గరిష్టంగా ఆరు నెలల జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానాలు విధించే అవకాశం ఉంది. కానీ అది సరిగా అమలుకాని పరిస్థితి. దాడుల్లో కల్తీ, నకిలీ ఉత్పత్తులను పట్టుకుంటున్న అధికారులు.. గట్టి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నగరంలోని చారిత్రక బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కల్యాణోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ కల్యాణం మంగళవారం ఉదయం 11.34 గంటలకు నిర్వహించనున్నారు. ఇందుకు సర్వం సిద్ధం చేశారు.

- సనత్‌నగర్

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 9 । జూలై । 2024



అక్రమ కట్టడాల కూల్చివేత

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాలార్జంగ్ కంచలో ఉద్రిక్తత నెలకొంది. అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) పరిధిలో అక్రమంగా ఇళ్లు నిర్మించారంటూ వాటిని అధికారులు కూల్చివేశారు.

-10లో



యానిమల్ కీపర్‌పై సింహం దాడి

నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో సోమవారం విధుల్లో ఉన్న యానిమల్ కీపర్‌పై సింహం దాడి చేసి గాయపర్చింది. ఈ ఘటన జూలో ని సమ్మర్ హౌజ్‌లో చోటుచేసుకుంది.

-10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చు.



ఈ సంవత్సరం లక్ష్యం మేరకు నాటే మొక్కలు జోన్ల వారీగా

జోన్	లక్ష్యం (లక్షల్లో)
ఎల్బీనగర్	6.62
చార్మినార్	4.22
ఖైరతాబాద్	4.49
శేరిలింగంపల్లి	6.15
కూకట్‌పల్లి	5.80
సికింద్రాబాద్	3.53
మొత్తం	30.81

లక్ష్యం 30.81 లక్షలైనా, గత అనుభవాల దృష్ట్యా 60 లక్షల మొక్కలు అందుబాటులో ఉంచుతున్నట్లు మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మొక్కలునాటే కార్యక్రమాల ద్వారా నగరంలో పచ్చదనం, అటవీ విస్తీర్ణం పెరిగిందన్నారు.

జీహెచ్‌ఎంసీలో వన మహోత్సవం

- రోడ్లు, కాలనీలు, చెరువులు, తదితర ప్రాంతాల్లో..
- ఇళ్లలో పెంచే ప్రజలకు పంపిణీకి 5 లక్షలు
- అందుబాటులో 152 రకాలు

లక్ష్యం 30.81 లక్షల మొక్కలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఈ సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 30.81 లక్షలు నాటాలనేది జీహెచ్‌ఎంసీ లక్ష్యం. గత సంవత్సరం వరకు హరితహారం పేరిట జరిగిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాని పేరును వనమహోత్సవంగా మార్చింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. పెల్టోఫారం, గుల్మొహర్ వంటి వాటితోపాటు ఈసారి కానుగ, వేప, రావి వంటివి సైతం నాటను న్నారు. గాలి దుమారాలు, వర్షాలు వచ్చినప్పుడు పెల్టోఫారం చెట్లు నేల కూలుతుండటంతో ఇతర రకాలవి సైతం నాటేందుకు నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా పెల్టోఫారం త్వరగా పెరుగుతాయని నాటుతారు కానీ అవి కూలుతుండటంతో ఇతర జాతులకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నారు.

8 విభాగాలుగా..

ఈ సారి ఎనిమిది విభాగాలుగా మొక్కలు నాటడం, పంపిణీ చేయనున్నారు.

1.అవెన్యూ ప్లాంటేషన్స్..

అవెన్యూ ప్లాంటేషన్స్‌లో భాగంగా మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్, మేజర్ రోడ్లు, మైనర్ రోడ్లు, సెంట్రల్ మీడియన్లు, కాలనీ రోడ్లు, మోడల్ కారిడార్లలో నాటుతారు.

లక్ష్యం: 6,49,008 మొక్కలు

2. ఖాళీ ప్రదేశాల్లో..

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాల్లో ఖాళీ ప్రదేశాల్లో, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో, శ్మశాన వాటికల్లో నాటుతారు.

లక్ష్యం:1,78,341 మొక్కలు.

3. చెరువుల వద్ద..

చెరువుల దగ్గరి ఖాళీ ప్రదేశాలతోపాటు చెరువు కట్టల మీద బఫర్‌జోన్ సరిహద్దు ప్రాంతాల్లో నాటుతారు.

లక్ష్యం: 3,30,955 మొక్కలు

4.కాలనీల్లో ..

కాలనీల్లో ఉన్న పార్కుల్లో, పాత ట్రీపార్కుల్లో, కొత్తగా ప్రతిపాదించిన పార్కుల్లో నాటుతారు.

లక్ష్యం: 5,40,195 మొక్కలు.

5.మియావాకీ..

ఒకే చోట అరణ్యంలాగా దట్టంగా పెరిగే మొక్కల్ని ఎంపికచేసిన ప్రాంతాల్లో పెంచుతారు.

లక్ష్యం: 44,750 మొక్కలు

6. ష్రబ్స్.. హెడ్జ్‌లు..

పొదలు, గుబురుగా పెరిగే మొక్కలను ఫ్లై ఓవర్ల కింద, పార్కులు, మీడియన్లలో పెంచుతారు.

లక్ష్యం: 8,12,920 మొక్కలు


7. అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో..

నగరంలో ఉన్న అర్బన్‌ఫారెస్ట్ పార్కుల్లో చనిపోయిన మొక్కలు, చెట్ల స్థానే కొత్త మొక్కలు నాటుతారు.

లక్ష్యం: 22,300 మొక్కలు

8. ప్రజలకు పంపిణీ

ఇళ్లలో పెంచుకునేందుకు ప్రజలకు పంపిణీ చేసేందుకు 5,03,356 మొక్కలు సిద్ధంగా ఉంచారు. వెరసి మొత్తం 30,81,825 మొక్కలు నాటడం లక్ష్యంగా కార్యా చరణ రూపొందించారు.



బతికిన మొక్కలు 78.02 శాతం

2016–17 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 8.41 కోట్ల లక్ష్యానికి గాను 7.71 కోట్ల మొక్కలు నాటారు. ఈ మేరకు లక్ష్యం 91.68 శాతం పూర్తయినట్లు జీహెచ్‌ఎంసీ జీవవైవిధ్య విభాగం అడిషనల్ కమిషనర్ డా.సునంద రాణి తెలిపారు. బతికిన మొక్కలు 78.02 శాతమని పేర్కొన్నారు.

ఈసారి.. ఈ రకాలు

ఈసారి నాటనున్న మొక్కల్లో కానుగ, చిన్నబాదం, బోగన్ విలియా, గుల్మొహర్, టెకోమ, జామూన్, నెమలినార, పెల్టోఫారం, వేప, బూరుగ, రావి, బహూనియా, కేసియా సియామియా, చింత, స్పథోడియా, రెయిన్ ట్రీ, మర్రి, టాబూబియా అర్జెంటీనా, మహగని, మారేడు, బైగోనియా, ఇక్సోరా, తెల్లమద్ది, డోలిచందన్, సీతాఫలం, గంగరావి, స్పైడర్ లిల్లీ, వెలగ, బాదం, తులసి, నిమ్మతో సహ 152 రకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.





మహానేత జ్ఞాపకాల్లో.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నేతలు దీపాదాస్ మున్షీ, షబ్బీర్ అలీ, కేవీపీ, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

పదవుల పందేరం!

గ్రేటర్ పరిధిలో ఏడుగురికి నామినేటెడ్ పోస్టులు

- మార్చిలో ఉత్తర్వులు.. తాజాగా బాధ్యతలు స్వీకరణ
- త్వరలో మరిన్ని పదవుల పంపకం

సాక్షి, సిటీబ్యూరో: నామినేటెడ్ పోస్టుల భర్తీలో హైదరాబాద్ మహానగరానికి ప్రాధాన్యం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం 35 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా అందులో గ్రేటర్ పరిధిలో ఏడుగురికి అవకాశం దక్కింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు మార్చి 15న కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలకు ఉత్తర్వులు జారీ కాగా, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తాత్కాలికంగా నిలిచిపోయాయి. తాజాగా సోమవారం కార్పొరేషన్ల నియామకాల జీఓ విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దకాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేసుకోలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ శ్రేణులు ఈసారి పార్టీ అధికారంలోకి రావడంతో గంపెడు ఆశలు పెట్టుకున్నారు. తాజాగా కొందర్ని నామినేటెడ్ పదవులు వరించగా..త్వరలో మరిన్ని పదవుల పంపకంపై మరికొందరు ఆశలు పెట్టుకున్నారు.

చైర్మన్ పదవులు ఇలా..

ఎల్‌బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మల్‌రెడ్డి రాంరెడ్డి రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులయ్యారు. రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా, గోషామహల్‌కు చెందిన మెట్టు సాయికుమార్ మత్స్యసహకార సమాఖ్య చైర్మన్‌గా, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ సహకార సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే ముషీరాబాద్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ కోడలు అలేఖ్యా పుంజాల సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా, అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన నూతి శ్రీకాంత్ బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా, శేరిలింగంపల్లికి చెందిన జైపాల్ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇందులో కొందరు సోమవారం బాధ్యతలు స్వీకరించగా.. మరికొందరు రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.



బాధ్యతల స్వీకరణ

మెట్టు సాయికుమార్..

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం సాయంత్రం శాంతినగర్‌లోని మత్స్య శాఖ భవన్‌లో ఆయన మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అల తదితరుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ.... మత్స్యకారుల సమస్యలు పరిష్కరించేందుకు పాటు పడుతానన్నారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వీహెచ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మల్‌రెడ్డి రాంరెడ్డి..

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్‌బీ భవనంలో బాధ్యతలు తీసుకున్న ఆయన మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి రోజున తాను బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, అధిష్టానం పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఏ ఫహీమ్..

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఫుడ్స్ సంస్థ చైర్మన్‌గా ఎంఏ ఫహీమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నాచారంలోని సంస్థ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా.. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జీఎం విజయలక్ష్మి, డీజీఎం శ్రీనివాస్ నాయక్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ దొంగ యమా రిచ్!

- అనునిత్యం తిరిగేది ఆడి కంపెనీ హైఎండ్ కారులో
- హైదరాబాద్ సహా అనేక నగరాల్లో వరుస చోరీలు
- నిందితుడు సోలంకిని అరెస్టు చేసిన గుజరాత్ కాప్స్
- నగర పోలీసులకు సమాచారం ఇస్తున్నాం: వల్సాద్ ఎస్పీ

ముంబైలో నివసించేది రూ.కోటి విలువైన ఫ్లాట్‌లో..



సోలంకి (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: రోహిత్ కనుభాయ్ సోలంకి..ముంబై శివార్లలో రూ.కోటి ఖరీదైన ఫ్లాట్‌లో నివసిస్తుంటాడు. ఆడి హైఎండ్ కారులో సంచరిస్తుంటాడు. ఓ నగరాన్ని టార్గెట్ చేసుకుంటే అక్కడకు వెళ్లి స్టార్ హోటల్‌లో బస చేస్తాడు. సంపన్నుల ప్రాంతాలను గూగుల్ ద్వారా గుర్తిస్తాడు. అక్కడ పగలు రెక్కీ చేసి తాళం వేసున్న ఇళ్లల్లో రాత్రిళ్లు పంజా విసరుతాడు.

ఈ ఖరీదైన దొంగను గత వారం గుజరాత్‌లోని వల్సాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. విచారణ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోనూ రెండు నేరాలు చేసినట్లు అంగీకరించాడు. దీంతో ఇక్కడి పోలీసులకు త్వరలో సమాచారం ఇవ్వనున్నట్లు వల్సాద్ ఎస్పీ కరణ్ రాజ్ వాఘేలా 'సాక్షి'కి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సోలంకి ప్రస్తుతం ముంబ్రాలోని ఖరీదైన సొంత ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. తన పేరును అర్హాన్‌గా మార్చుకున్న ఇతగాడు ఓ మైనార్టీ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని చెప్తూ... కొన్నేళ్లుగా చోరీలు చేస్తున్నాడు. క్యాంపుల పేరుతో తరచు ఇల్లు వదిలి వెళ్లే ఇతగాడు కేవలం ప్రధాన నగరాలనే టార్గెట్‌గా చేసుకుంటాడు. విమానంలో అక్కడకు చేరుకుని స్టార్ హోటల్‌లో బస చేస్తాడు. గూగుల్ ద్వారా ఈ చుట్టుపక్కల ఉన్న సంపన్న వర్గాలు నివసించే ప్రాంతాలను గుర్తిస్తాడు. హోటల్‌కు చెందిన క్యాబ్‌ను బుక్ చేసుకునే ఇతగాడు పగటి పూటి అందులోనే తిరుగుతూ తాను ఎంచుకున్న ప్రాంతాల్లో రెక్కీ చేస్తాడు. తాళం వేసున్న ఇళ్లను గుర్తించి ఆ ప్రాంతాలకు సంబంధించిన లోకేషన్స్‌ను తన వాట్సాప్‌లోకి షేర్ చేసుకుంటాడు.

రాత్రి వేళ కాలినడకన బయలుదేరి..సమీపంలోని ఏదో ఒక దుకాణం నుంచి చిన్న రాడ్లు, స్క్రూడ్రైవర్ వంటివి ఖరీదు చేస్తాడు. వీటిలో టార్గెట్ చేసుకున్న ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, సొత్తు స్వాహా చేస్తాడు. చోరీ సొత్తును తీసుకుని మాత్రం రైలులోనే ముంబైకి చేరుకుంటాడు. ఇంటికి చేరుకునేలోపే దాన్ని అమ్మి, క్యాష్ చేసుకుని, బ్యాంక్ ఖాతాలో వేసుకుంటాడు. ఇలా గడిచిన కొన్నాళ్లల్లో గుజరాత్‌లోని వల్సాద్, వాపి, సూరత్, పోర్‌బందర్, సెల్వాల్‌లతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌ల్లో 19 నేరాలు చేశాడు. వీటిలో రెండు హైదరాబాద్‌లో చేసినవే. వల్సాల్‌లో జరిగిన వాపిలో జరిగిన రూ.లక్ష నగదు చోరీ కేసును వల్సాద్ జిల్లా పోలీసులు దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో పాటు సోలంకి బస చేసిన హోటల్, ప్రయాణించిన విమానం టిక్కెట్ తదితర వివరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ముంబ్రాలోని అతడి ఫ్లాట్ వద్ద కాపుకాసిన పోలీసులు గత వారం అరెస్టు చేశారు. విచారణ నేపథ్యంలో జల్సాలకు అలవాటుపడిన ఇతగాడు ముంబైలోని నైట్ క్లబ్స్‌లో భారీ మొత్తం ఖర్చు చేస్తాడని తేలింది. మాదకద్రవ్యాలకు సైతం అలవాటు పడి బానిసగా మారిన సోలంకి ఏకంగా నెలకు రూ.1.5 లక్షలు వాటికే వెచ్చిస్తాడని పోలీసులు గుర్తించారు. వల్సాద్ ఎస్పీ కరణ్ రాజ్ వాఘేలా 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ...'రోహిత్ సోలంకిని విచారించిన నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని హైదరాబాద్‌ల్లో రెండేసి చోరీలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అయితే ఏ ప్రాంతంలో చేశాడనేది అతడు స్పష్టంగా చెప్పలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడు ఆయా నగరాల్లో సంచరించిన తేదీలతో పాటు ఇతర వివరాలను సాంకేతికంగా గుర్తిస్తున్నాం. ఆపై ఆ అంశాలకు అక్కడ పోలీసులకు తెలుపుతాం. డ్రగ్స్‌కు బానిసైన సోలంకిని రీహాబ్‌కు పంపాలని యోచిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఎల్లమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం



పూజల్లో భక్తులు, ఆలయ అధికారులు

అమీర్‌పేట: భక్తుల కొంగు బంగారమైన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనము, ఋత్విగ్వరణము, కలశస్థాపన, దేవాతాహ్వానం, అంకురార్పణ, పుట్ట బంగారం, గంగతెప్ప వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ సంప్రదాయ బద్ధంగా ఎదుర్కోళ్లు జరిగాయి. ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నుండి స్వామి వారిని ఊరేగింపుగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఒగ్గుకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నేడు ఉదయం 11.34 గంటలకు అమ్మవారి కల్యాణం

ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తంలో మంగళవారం ఉదయం 11.34 గంటలకు అమ్మవారి కల్యాణోత్సవం జరిపించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అంజనీదేవి తెలిపారు. ఈ మేరకు కల్యాణ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు.

సాయి స్మరణ్‌కు సీఏలో ఆల్ ఇండియా 44వ ర్యాంకు



కుషాయిగూడ: చార్టర్డ్ అకౌంటెంట్స్(సీఏ) ఫలితాల్లో బొల్లారం ప్రాంతానికి చెందిన సాయిస్మరణ్ ఆలిండియా స్థాయిలో 44వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కాన్వొకేషన్‌లో ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ రంజిత్‌కుమార్ అగర్వాల్, సెక్రటరీ కుమార్ బత్ర చేతులమీదుగా సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిస్మరణ్ తల్లిదండ్రులు పద్మ రాధాకృష్ణ, శ్రీలత సంతోషం వ్యక్తం చేశారు.

ఆకుపచ్చ నగరమే ధ్యేయం

మంత్రి పొన్నం ప్రభాకర్



మొక్కలు నాటుతున్న మంత్రి పొన్నం, మేయర్ తదితరులు

రామంతాపూర్: గ్రేటర్ హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో కోటి మొక్కలు నాటి..మహానగరాన్ని ఆకుపచ్చనగరంగా మార్చడమే వన మహోత్సవ ధ్యేయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి తదితరులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రజలు వారి పెద్దల పేరిట మొక్కలు నాటి అవి ఏపుగా పెరిగే వరకు పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుతం 60 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కాలుష్యం పెరిగితే వచ్చే తరం మనల్ని క్షమించదని, మొక్కలు నాటడం అంటే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణంలో పర్యావరణాన్ని అందించడమేనన్నారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఒక్కరోజే 30 సర్కిల్‌లో 7,135 మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్, కేశవ్ పాటిల్, హార్టికల్చర్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సునంద రెడ్డి, కార్పొరేటర్లు చేతన హరీష్, రజిత పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, ఉప్పల్ కాప్రా డిప్యూటీ కమిషనర్లు ఆంజనేయులు ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఆర్‌పై రోడ్డు ప్రమాదం: ట్రైనీ పైలట్ దుర్మరణం

కీసర: కీసర ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డుప్రమాదంలో శిక్షణలో ఉన్న పైలట్ దుర్మరణం చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్‌లో నివాసం ఉంటున్న సిద్దిపేట జిల్లాకు చెందిన గంగుమల శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు శ్రీకరణ్‌రెడ్డి(25) బ్యాంకాక్‌లో పైలట్ శిక్షణ పొందుతున్నాడు. వారం రోజుల క్రితం సిటీకి వచ్చిన శ్రీకరణ్‌రెడ్డి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు యాదగిరిగుట్టకు వెళ్లివస్తానని తల్లిదండ్రులకు చెప్పి కారులో బయలుదేరాడు. నేరేడ్‌మెట్ ఈసీఐఎల్ నుండి కారులో వచ్చి కీసర వద్ద అవుటర్ రింగురోడ్డు ఎక్కాడు. రింగురోడ్డుపై ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. దీంతో కారుముందు భాగం పూర్తిగా నుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకరణ్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే అతను మృతిచెందాడు. కాగా ప్రమాదానికి గురైన కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో అతను వేగంగా వెళ్లి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి ఉంటాడని పోలీసులు తెలిపారు. రింగు రోడ్డుపై ప్రమాదం జరిగిన చోట ఎలాంటి వాహనం కన్పించలేదని చెప్పారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు



శ్రీకరణ్‌రెడ్డి (ఫైల్)

రూ.514 కోట్ల స్వాహా



- భారీ లాభాల పేరిట ధన్వంతరి ఫౌండేషన్ వసూలు
- ప్రాథమికంగా నిర్ధారించిన సీసీఎస్ పోలీసులు
- 200 మంది బాధితులతో సమావేశమైన డీసీపీ శ్వేత

సాక్షి, సిటీబ్యూరో: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్(డీఎఫ్ఐ) ట్రస్ట్ ఓ సామాజిక వర్గానికి చెందిన నాలుగు వేల మంది నుంచి రూ.514 కోట్ల మేర వసూలు చేసి మోసం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని సీసీఎస్ డీసీపీ ఎన్.శ్వేత తెలిపారు. అందుబాటులో ఉన్న 200 మంది బాధితులతో ఆమె సోమవారం భేటీ అయ్యారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో బాధితులకు న్యాయం చేయడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తమ వద్ద డిపాజిట్ చేసినా, పెట్టుబడి పెట్టినా నిర్ణీతకాలంలో భారీ లాభాలు ఇస్తామంటూ డీఎఫ్ఐ డైరెక్టర్ పి.కమలాకర్ శర్మ తదితరులు ప్రచారం చేశారని శ్వేత వెల్లడించారు. వీరి మాటలు నమ్మిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవాళ్లు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని వివరించారు. డీఎఫ్ఐపై సీసీఎస్‌లో నమోదైన కేసును ఏసీపీ ఎల్.ఆదినారాయణ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేస్తోందని, ఇప్పటికే డీఎఫ్ఐకి సంబంధించిన కొన్ని ఆస్తులను గుర్తించామన్నారు. అంబర్‌పేటలో హాస్పిటల్, విశాఖ సమీపంలోని అనకాపల్లి, విజయవాడ సమీపంలోని గన్నవరం, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో 450 ఎకరాల భూమితోపాటు నగరం నడిబొడ్డున 3 వేల చదరపు గజాల కమర్షియల్ స్పేస్ గుర్తించామని చెప్పారు. దాదాపు 30 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని, కొన్ని ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు పొందామని తెలిపారు. ఈ కేసులో ఫోరెన్సిక్ ఆడిట్ కూడా చేస్తున్నామన్న శ్వేత బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నిందితులపై చర్యలు తీసుకున్నారు.

జలమండలి ఉద్యోగిపై దాడి

కోకాపేట కౌన్సిలర్‌తోపాటు అనుచరులపై కేసు



గాయపడిన శ్రీధర్

మణికొండ: నీటిసరఫరా విషయమై మాటామాట పెరిగి జలమండలి లైన్‌మేన్‌పై దాడికి దారి తీసింది. బాధిత లైన్‌మేన్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి కోకాపేటలో నీటి సరఫరా చేస్తుండగా కౌన్సిలర్ జి.శివారెడ్డి, అతని అనుచరులు శ్రీధర్‌ను పిలిచి కొట్టారు. అతడి అనుచరులు కత్తితో దాడి చేశారు. శ్రీధర్ ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లైన్‌మేన్‌పై కోకాపేట కౌన్సిలర్ శివారెడ్డి కత్తితో దాడి చేశారనే విషయం తెలుసుకుని జలమండలి జీఎం మహేందర్ నాయక్, డీజీఎం శ్రీమన్నారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డితోపాటు పలు యూనియన్ల నాయకులు, సిబ్బంది నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని పట్టుపట్టారు. దళితుడైన లైన్‌మేన్ చెంపపై కౌన్సిలర్ కొట్టారని, అతడి అనుచరులు కత్తితో దాడి చేశారని తెలిపారు.

బస్తీలకు సరిగా సరఫరా చేయడంలేదు: కౌన్సిలర్

పేదలు నివసించే రాజీవ్ గృహకల్పకు సరిగా నీటిని సరఫరా చేయకుండా అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలకు ఎక్కువ సమయం సరఫరా చేసి వారి నుంచి లైన్‌మేన్ డబ్బులు తీసుకుంటున్నాడని కౌన్సిలర్ శివారెడ్డి ఆరోపించారు. ఈ విషయమై లైన్‌మేన్‌ను అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. దీంతో మద్యం మత్తులో ఉన్న తన అనుచరులు దాడి చేశారని, ఇది తప్పేనని అన్నారు.

ముందు రెక్కీ.. ఆపై చోరీ

హాస్టళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద పార్క్ చేసిన బైక్‌లే టార్గెట్

- ముఠాలోని ముగ్గురు దొంగల అరెస్ట్
- రూ.35 లక్షల విలువ చేసే 16 వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మాదాపూర్ ఏడీసీపీ జయరాం



వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ ఏడీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్ తదితరులు

గచ్చిబౌలి: పీజీ హాస్టళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద పార్క్ చేసిన బైక్‌లే వారి టార్గెట్. ముందు రెక్కీ నిర్వహించి తర్వాత వాటిని అపహరించేవారు. ఎట్టకేలకు బైక్ దొంగల ఆటకట్టించారు గచ్చిబౌలి పోలీసులు. ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేశారు. సోమవారం మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.జయరాం వివరాలు వెల్లడించారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన దేవ కిశోర్(20) బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలో స్విగ్గీలో పనిచేసిన కడియాల వీర వెంకట సత్యనారాయణ(21), కైకలూరుకు చెందిన బాలే దిలీప్(19), మరో ఇద్దరు మైనర్లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రెండు గ్రూపులుగా విడిపోయి సీసీ కెమెరాలు లేని పీజీ హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ముందు ఒక గ్రూపు రెక్కీ నిర్వహించేది. పరిస్థితి అంతా అనుకూలంగా ఉందని సమాచారం ఇవ్వగానే మరో గ్యాంగ్ వచ్చి హ్యాండిల్ లాక్ విరగ్గొట్టి బైక్‌తో ఉడాయించేది. చోరీ చేసిన బైక్‌లకు దేవర కిశోర్ మరో 'మాస్టర్ కీ'తయారు చేసి కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని గోడౌన్‌కు తరలించేవాడు. ఈ విధంగా గత రెండు నెలలుగా గచ్చిబౌలి పీఎస్ పరిధిలో మూడు, కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో మూడు, మాదాపూర్ పీఎస్ పరిధిలో నాలుగు, మియాపూర్ పీఎస్ పరిధిలో ఒక బైక్‌ను చోరీ చేశారు. వీరు చోరీ చేసినవాటిలో యమహ ఎంటీ-15, యమహ ఆర్15, రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్, కేటీఎం డ్యూక్-200 లాంటి మొత్తం 16 బైక్‌లు ఉన్నాయి. వీటి విలువ రూ.35 లక్షలు ఉండవచ్చని అంచనా.

రావులపాలెంకు తరలించేందుకు ప్లాన్...

ఆంధ్రప్రదేశ్‌లోని రావులపాలెంకు ఓ వాహనంలో బైక్‌లను తరలించేందుకు దొంగలు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో దేవర కిశోర్ నెంబర్ ప్లేట్‌లేని బైక్‌తో గచ్చిబౌలి పోలీసులకు చిక్కాడు. సరైన డాక్యుమెంట్లు లేకపోవడం, పొంతన లేని సమాధానం చెప్పడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బైక్‌లు చోరీ చేసి గోడౌన్‌లో ఉంచినట్లు తెలపడంతో పోలీసులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మైనర్‌లకు నోటీసులు ఇచ్చి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తామని ఏడీసీపీ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమావేశంలో మాదాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, డీఐ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తెచ్చి.. పోలీసులకు చిక్కి..

పట్టుబడిన ఆటోక్యాడ్ డిజైనర్, డెంటల్ టెక్నీషియన్



గంజాయి విక్రేత మోహన్, దేవానంద్

ఉప్పల్: ఒకరు ఆటోక్యాడ్ డిజైనర్, మరొకరు డెంటర్ టెక్నీషియన్. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పక్కదారి పట్టారు. గంజాయి విక్రయించి పోలీసులకు చిక్కారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాలు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లికి చెందిన సిరిశెట్టి మోహన్(27) రామంతాపూర్ ప్రగతినగర్‌లో నివాసముంటూ ఆటో క్యాడ్ డిజైనర్‌గా రామంతాపూర్ ఎన్ఎస్ఎల్ భవనంలో పనిచేస్తున్నాడు. కర్ణాటక హుల్సూర్ ప్రాంతానికి చెందిన బాచిపల్లి దేవానంద్(26) రామంతాపూర్ నెహ్రూనగర్‌లో నివాసముంటున్నాడు. అతడు డెంటల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. చాలీచాలని జీతాలు రావడంతో గంజాయి విక్రయిస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఇద్దరూ భావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు ప్రాంతానికి చెందిన డ్రగ్స్ విక్రేత చిన్నారావుతో చేతులు కలిపారు. ఇతని వద్ద 1.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. 400 గ్రాముల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించారు. మిగిలిదానిని రామంతాపూర్ నెహ్రూనగర్‌లో ఉండే పాన్‌షాప్ ద్వారా విక్రయించాలని ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే ఆదివారం దేవానంద్ తన ద్విచక్ర వాహనంపై పాన్ షాప్ వద్దకు వచ్చాడు. 500 గ్రాముల గంజాయి నింపిన సిగరెట్ల బ్యాగ్‌ను, మరో 600 గ్రాముల గంజాయి బ్యాగ్‌ను మోహన్‌కు అందజేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడే మాటు వేసిన ఉప్పల్ పోలీసులు అప్రమత్తమై ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1,100 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం, సిగరెట్ పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ తరలించారు. చిన్నారావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లి మరణాన్ని తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: తల్లి మరణాన్ని తట్టుకోలేక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎంఎన్‌రెడ్డినగర్‌కు చెందిన గుమ్మడి బాలయ్య భార్య రెండు నెలల క్రితం మృతి చెందింది. ఈ నెల 7వ తేదీ ఉదయం 6 గంటలకు బాలయ్య తన పెద్ద కుమారుడు గణేష్‌తో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లగా, ఇంట్లో చిన్న కుమారుడు శ్రీనివాస్ ఉన్నాడు. స్థానికంగా ఉండే సాంబశివారెడ్డి మధ్యాహ్నం బాలయ్య ఇంటికి వెళ్లగా తలుపులు వేసి ఉన్నాయి. ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి కిటీలోంచి చూడగా శ్రీనివాస్ ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి అతన్ని కిందకు దింపగా అప్పటికే మృతిచెందాడు. తల్లి మరణించిందన్న దుఃఖంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై ఆటోడ్రైవర్ల నిరసన



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆటో డ్రైవర్లు

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ వందలాది మంది ఆటోడ్రైవర్లు సోమవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదని విమర్శించారు. ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల వేధింపులు, జరిమానాలు, పెట్రో మంటలు, మరమ్మతులు, ఫైనాన్స్ వ్యాపారుల ఒత్తిళ్లతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏడాదికి 12 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, సీహెచ్ జంగయ్య, యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొంరెల్లి బాబు, నేతలు ఎ.భిక్షపతి యాదవ్, ఎం.డి.ఒమేర్ ఖాన్, లతీఫ్, జి.మల్లేష్, అశోక్, భాస్కర్, రవి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి అత్యాచారం

బంజారాహిల్స్: ఆటో కోసం వేచిచూస్తున్న ఓ మహిళకు బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిఅత్యాచారానికి పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-82లోని బాటా షోరూం ముందు ఆదివారం రాత్రి ఓ మహిళ ఆటో కోసం వేచిచూస్తోంది. అదే సమయంలో బైక్‌పై ఓ వ్యక్తి వచ్చి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్దిదూరం తీసుకువెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఓ పార్కులోకి తీసుకెళ్లి బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె వద్ద ఉన్న డబ్బు, మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యాడు. దారి ఖర్చుల కోసం డబ్బులు కూడా లేకపోవడంతో అతికష్టం మీద ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించగా, చెప్పులతోపాటు గాజులు, ఇతరత్రా వస్తువులు పార్కు వద్ద కనిపించాయి.నిందితుడి జాడ కోసం ఘటనాస్థలం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూబ్లీహిల్స్ పబ్‌లలో తనిఖీలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పరిధిలోని ఎయిర్‌లైవ్, లుఫ్ట్ పబ్‌లలో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించేందుకు ఆదివారంరాత్రి స్నిపర్ డాగ్‌లతో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిసినా, దాని ఆనవాళ్లు ఉన్నా, ఎవరైనా వాటిని ముట్టుకున్నా, టేబుళ్లు, కుర్చీలపై వాటి అణువులు కనిపించినా శిక్షణ పొందిన స్నిపర్‌డాగ్స్ ఇట్టే పట్టేస్తాయి. దీంతో పోలీసులు అణువణువూ శోధించారు. బాత్‌రూమ్‌లు, వంటరూమ్‌లతోపాటు డీజే, క్యాష్ కౌంటర్.. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ గాలించారు. మహిళా కస్టమర్లను మహిళా పోలీసులతో తనిఖీ చేయించారు. పబ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ అరెస్టు

అంబర్‌పేట: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయుడి ప్రవర్తనపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం... అంబర్‌పేట లకోటియా ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినులపట్ల గణిత ఉపాధ్యాయుడు వెంకటేశ్(60) కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఉపాధ్యాయుడు వేధింపులు రోజురోజుకూ తీవ్రం కావడంతో విద్యార్థినులు భరించలేక తమ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఉపాధ్యాయుడిని అరెస్టు చేశారు.

'శీతల్ ఫోమ్స్'కు చుక్కెదురు

సిటీ, కోర్టులు: వెన్నునొప్పి తగ్గుతుందన్న ప్రచారం నమ్మి బెడ్స్(మ్యాట్రిసెస్) కొనుగోలు చేసిన ఓ వినియోగదారుడికి నొప్పి మరింత ఎక్కువైంది. దీంతో బెడ్స్ తయారీ సంస్థ అబద్ధపు హామీలపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా బాధితుడికి న్యాయం లభించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ బెడ్స్ తయారీ సంస్థ రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించినా అక్కడ కూడా వారికి చుక్కెదురైంది. వివరాలు... వెన్నునొప్పి తగ్గించే బెడ్స్ ప్రచారం నమ్మి కరీంనగర్ పట్టణంలోని పవన్ ఏజెన్సీని భాస్కర్‌రెడ్డి సంప్రదించాడు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ శీతల్ ఫోమ్స్ లిమిటెడ్‌కు చెందిన రెండు పరుపుల(మ్యాట్రిసెస్)ను రూ.68 వేలకు పవన్ ఏజెన్సీలో కొనుగోలు చేశారు. ఈ బెడ్స్‌ను వినియోగించినా వెన్నునొప్పి తగ్గకపోగా మరింత తీవ్రమైంది. బెడ్‌ను వాడటం వల్లే నొప్పి తీవ్రమైందని ఓ డాక్టర్ చెప్పడంతో 2017లో భాస్కర్‌రెడ్డి పవన్ ఏజెన్సీ నిర్వాహకులను కలిసి బెడ్స్ వెనక్కు తీసుకొని తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరారు. అయినా స్పందన లేకపోవడంతో వినియోగదారుల కమిషన్ ఆశ్రయించారు. పూర్వాపరాలను పరిశీలించిన కమిషన్ శీతల్ ఫోమ్స్ తీరును తప్పుబట్టింది. బెడ్స్ ఖర్చు రూ.68 వేలను తిరిగి ఇచ్చేయాలని, రూ.12 వేలు పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ శీతల్ ఫోమ్స్ రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించింది.

యానిమల్ కీపర్‌పై సింహం దాడి

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని సమ్మర్ హౌస్‌ను శుభ్రపరిచే సమయంలో జరిగిన పొరపాటుతో యానిమల్ కీపర్ సింహం దాడిలో గాయపడ్డారు. ఈ సంఘటన నెహ్రూ జూలాజికల్ పార్కులో సోమవారం చోటు చేసుకుంది. సమ్మర్ హౌస్‌లోని జంతువులను వేరే గేజ్‌లోకి తరలించి అన్ని జాగ్రత్తలు తీసుకొని ఎన్‌క్లోజర్‌ను శుభ్రం చేయాలి. అయితే ఏమరపాటు కారణంగా ఎన్‌క్లోజర్‌ను శుభ్రం చేస్తున్న యానిమల్ కీపర్ వద్దకు వచ్చిన సింహం అతడిపై దాడి చేసింది. దీంతో అతను భయంతో పరుగులు తీశాడు. వెంటనే స్పందించిన ఇతర యానిమల్ కీపర్లు అప్రమత్తమై సింహాన్ని చాకచక్యంగా వేరే గేజ్‌లోకి తరలించారు. సోమవారం జుపార్కు సెలవు ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడ్డ యానిమల్ కీపర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు జుపార్కు క్యూరేటర్ డాక్టర్ ఎస్ సునీల్ హీరేమత్ తెలిపారు. కాగా, జూ పార్కులోని ఓ పెద్దపులి మేటింగ్ (కలయిక) కోసం 10 అడుగుల ఎత్తుకు ఉన్న ఎన్‌క్లోజర్ నుంచి జంప్ చేసింది. పులిని అతి కష్టం మీద గంటలపాటు శ్రమించి తిరిగి ఎన్‌క్లోజర్‌లోకి తరలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

- పీర్జాదిగూడలో ఉద్రిక్తత
- అడ్డుకున్న మేయర్ వెంకట్‌రెడ్డి
- పలువురు కార్పొరేటర్ల అరెస్టు



సాలర్జంగ్ కంచె సర్వే నంబర్ 1లో ఇల్లు కూల్చివేస్తున్న దృశ్యం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాలర్జంగ్ కంచలో ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనలు, నిరసనలు, వాగ్వాదాలు, అరెస్టులతో ఆ ప్రాంతం అట్టుడికింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) పరిధిలో అక్రమంగా ఇళ్లు నిర్మించారంటూ వాటిని అధికారులు కూల్చివేశారు. దీంతో బాధితులు, ఆయా రాజకీయ పార్టీల నేతల ఆందోళనకు దిగారు. వివరాలు... పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సాలార్జంగ్ కంచ సర్వే నెంబర్-1లో సోమవారం ఉదయం భారీగా పోలీసులు మోహరించారు. బందోబస్తు మధ్య మేడిపల్లి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఇళ్ల కూల్చివేతలను చేపట్టారు. విషయం తెలుసుకున్న నగర మేయర్ జక్క వెంకట్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేటర్లు సంఘటనాస్థలానికి చేరుకుని కూల్చివేతలను అడ్డుకున్నారు. అక్కడే బైఠాయించి నిరసన తెలపడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు కార్పొరేటర్లను అదుపులోకి తీసుకుని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్మాణదారులు, బాధితులను పోలీసులు చెదరగొట్టారు. కూల్చివేతల విషయంపై తహసీల్దార్‌ను ప్రశ్నించగా ఈ ఇళ్లు అర్బన్‌ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి వస్తాయని, నోటీసులను ఇచ్చిన తర్వాతే ఈ చర్యలు చేపట్టామని బదులిచ్చారు.





మేయర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

బాధితులకు అండగా ఉంటాం: ఈటల

సాలర్జంగ్ కంచలో కూల్చివేసిన ఇండ్లను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. బాధితులు ఆయన ఎదుట తమ గోడు వెల్లబోసుకోగా, వారికి భరోసానిచ్చారు. పలువురు కార్పొరేటర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదనే అక్కసుతోనే పేదల ఇండ్లను కూలగొడుతూ ఒత్తిడి తీసుకొస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల అవలంబిస్తున్న తీరుకు ఇది నిదర్శనమన్నారు. కూల్చివేతలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఇది చీకటిరోజు: జక్క వెంకట్‌రెడ్డి

ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాసిందని, ఇది చీకటిరోజని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అభివర్ణించారు. మేయర్ పీఠం తమ అల్లుడికి కట్టబెట్టాలనే దురుద్దేశంతోనే మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అక్రమాలు, దౌర్జన్యాలకు తెరలేపుతున్నారని మేయర్ ఆరోపించారు. సదరు స్థలం యుఎల్‌సీ పరిధిలోకి రాదని తహసీల్దార్ ఇచ్చిన నివేదికలు, హెచ్ఎండీఏ, ఎల్ఆర్ఎస్ నిబంధనల ఆధారంగానే మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నిర్మాణ అనుమతులు ఇచ్చామని చెప్పారు.

మేయర్ అక్రమాల వల్లే: శివకుమార్

మేయర్ వెంకట్‌రెడ్డి అక్రమాల వల్లే ఈ పరిస్థితి నెలకొందని పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ ఆరోపించారు. సాలార్జంగ్ కంచలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను, రియల్టర్లను అడ్డుపెట్టుకుని అక్రమంగా సీలింగ్ ల్యాండ్‌లో వ్యాపారాలు చేసుకుంటూ వందల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. సీలింగ్ భూములను స్థానిక పేదలకు పంచాలని కాంగ్రెస్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

కలలు కూల్చివేశారు: బాధితులు

నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లోనే కూల్చివేతలను చేపట్టడం ఏమిటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ఈ స్థలాలకు ఎల్ఆర్ఎస్, ఎన్వోసీలు ఉన్నందునే మున్సిపల్ అనుమతులతోనే ఇండ్లను కట్టుకున్నామని, తమ కలల సౌధాలను కూల్చివేయడంపై బాధితులు కన్నీటి పర్యవంతమయ్యారు. పార్టీల మధ్య విభేదాలను వారు వారు చూసుకోవాలేగానీ, తమ ఇండ్లపై విరుచుకు పడటం ఎందని ప్రశ్నించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


వెంకటేశ్వరనగర్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని వెంకటేశ్వర నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానికులు తరచూ ఇస్తున్న ఫిర్యాదులతో ఆమె అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చిన్నారులకు అందుతున్న పోషకాహారం, బోధన తదితర అంశాలను ఆరాతీశారు. ముఖ్యంగా పరిశుభ్రత విషయంలో దృష్టి పెట్టాలని అక్కడ ఉన్న ఆయాను కోరారు. అంగన్‌వాడీ టీచర్లు రెగ్యులర్‌గా రావడం లేదని, పిల్లలకు సకాలంలో పోషకాహారం అందించాలని సూచించారు. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్ నగర్ ఏబీఎన్ చౌరస్తా నుంచి గౌతంనగర్ చౌరస్తా వరకు నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఇటీవల తాను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం సమర్పించడమే కాకుండా ఇక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తేవడం జరిగిందన్నారు. స్పందించిన జోనల్ కమిషనర్ పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక ఇంజనీర్లను ఆదేశించడంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్య పరిష్కారమైందన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయ నర్సరీ పార్కులో అధికారుల పర్యటన


ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ నర్సరీ పార్కులో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ విజయ జీహెచ్‌ఎంసీ నర్సరీ పార్కులో సోమవారం ఉదయం జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించి వాకర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఇప్పటికే సుందరంగా ఉన్న ఈ పార్కులో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసే దిశలో అధికారులు స్థానికులతో మమేకమయ్యారు. పార్కులో లాన్ ఏర్పాటుచేయాలని, వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలని వాకర్లు కోరారు. అలాగే వీధికుక్కలు తిరుగుతున్నాయని, వాటిని నిరోధించాలన్నారు. సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి నాలుగైదు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వీధి దీపాలకు మరమ్మతులు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయకనగర్‌లో గత కొద్దిరోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సంబంధిత అధికారులతో మాట్లాడి సోమవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వినాయకనగర్ వాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో చాలాచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని, వాటి మరమ్మతుల విషయమై కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రెండు మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న బీఎస్పీ నేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-5లోని దేవరకొండ బస్తీకి వెళ్లే రోడ్డులో ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీ తమ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుందని, వారిపై చర్యలు తీసుకుని స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు దూరపల్లి రమేష్ సోమవారం షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటీవలనే ఈ స్థలంలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారని, సదరు కబ్జాదారుడు మాత్రం ఆ స్థలంలో రాళ్లు కొడుతూ చదును చేస్తున్నారని, ఈ స్థలాన్ని కాపాడాలని కోరారు. బీఎస్పీ నేతలు రమేష్, రఘునాథ్, ప్రవీణ్‌కుమార్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

జోహార్ వైఎస్సార్

ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి • పలు ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు
వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న నాయకులు


రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం...


పంజగుట్ట కూడలిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి


ఎంపీ మల్లు రవి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి...

పంజగుట్ట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లతోపాటు పలు ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూజమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా వై.ఎస్.రాజశేఖర్ రెడ్డితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

- సామాజిక న్యాయ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. పంజగుట్ట కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2004లో వైఎస్సార్ తనను మొదటిసారి బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించారని, 2009 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీ ఫాం ఇచ్చి హుజూరాబాద్ శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేదపిల్లలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దేవుడయ్యాడని పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పంజగుట్ట కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లలా చూసిన మహానేత వైఎస్సార్ అని గుర్తుచేసుకున్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం...

ఖైరతాబాద్: వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రారంభించిన వైఎస్సార్ యువసేన 17 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తోందని వైఎస్సార్ యువసేన అధ్యక్షుడు చింతల రాజశేఖర్ అన్నారు. పంజగుట్టలోని వైఎస్సార్ యువసేన కార్యలయంలో కేక్ కట్‌చేసి అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్, జానకి మల్లికార్జున చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ ఉప్పులూరి శ్రీనివాస్‌శర్మ తదితరులు కేక్ కట్‌చేసి వైఎస్సార్ జయంతిని నిర్వహించారు.

శ్రీనగర్‌కాలనీ: దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా లేబాకు నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీనగర్‌కాలనీలోని ఆశ్రయ్-ఆకృతి బధిర విద్యార్థులకు మధ్యాహ్న భోజన వితరణ చేశారు. వైఎస్సార్ అభిమానులు ఆయన జయంతి, వర్ధంతిలకు పలు సేవా కార్యక్రమాలు చేస్తుంటామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థి సేవావిభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. ట్రస్ట్ కోశాధికారి డాక్టర్ దివ్యసాయి, లేబాకు తేజస్విని పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ విజయకృష్ణారెడ్డి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్ యువసేన అధ్యక్షుడు చింతల రాజశేఖర్ తదితరులు

మాల మహానాడు కార్యాలయంలో...

లిబర్టీ: జనహృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం పలు ప్రాంతాల్లో ఆయన అభిమానలు, పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మాలమహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ చిత్రపటానికి పూజమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద మాట్లాడుతూ... తన ఆఖరి శ్వాస వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగిన మహానేత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపిపోయారన్నారు.

ఎస్‌ఐ మృతికి కారకులను విధుల నుంచి తొలగించాలి

ఖైరతాబాద్: దళిత సామాజిక వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్‌ఐ మరణానికి కారకులైన సీఐ, ఇతర పోలీసు సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం మింట్ కంపౌండ్ అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంచందర్ మాట్లాడుతూ... దళిత సామాజిక వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్‌ఐ మరణానికి సీఐ జితేందర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది సుభాని, శివ నాగరాజు, సన్యాసినాయుడు, శేఖర్‌లను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బాలకిషన్, మేక వెంకన్న, కో చైర్మన్ గడ్డం సత్యనారాయణ, వైస్ చైర్మన్లు మల్లేష్, గంగాదర్, చింతపల్లి కాశీనాథ్, అచ్చుతయ్య, ఎస్.కృష్ణ, సిహెచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న అనంతలక్ష్మి

శ్రీనగర్‌కాలనీ: గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు అమలుకు సాధ్యంకాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని బీజేపీ మహిళా మోర్చా హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు గారపాటి అనంతలక్ష్మి ఆరోపించారు. నాగార్జునగర్‌కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మహిళాలక్ష్మి పథకం, నవ వధువుకు ఇస్తామన్న తులం బంగారం, విద్యార్థి హామీ, మహిళా పెన్షన్లు అమలకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాను నిర్వహిస్తామన్నారు. మహిళలు భారీగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆమె కోరారు. మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సంగీత, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలి

- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి


దుర్గాభవానీనగర్ బస్తీలో పర్యటిస్తున్న జెడ్‌సీ అనురాగ్ జయంతి

ఫిలింనగర్: పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే దుర్గంధం, దుర్వాసనలు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తాయని, ప్రజలు అనారోగ్యం బారినపడతారని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, దీన్‌దయాళ్ నగర్, బండారు బాల్‌రెడ్డిరెడ్డినగర్, దుర్గాభవానీనగర్ బస్తీల్లో పర్యటించి ఇంటింటికి చెత్తను సేకరించే విధానంపై ఆరాతీశారు. స్వచ్ఛ ఆటోలకు ఇంటి వద్ద నుంచే చెత్తను అందించాలని, రోడ్ల పక్కన కుప్పలుగా పోయవద్దని సూచించారు. తరచూ చెత్తను పేరుకుపోతున్న జీవీపీలు లేకుండా పూర్తిగా నిర్మూలించాలని ఎస్ఎఫ్ఏలకు సూచించారు. శానిటేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాప్ నిర్వాహకుడి అదృశ్యం

వెంగళరావునగర్: దుకాణానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌లోని మహ్మద్ మజహర్ రహమ ర్‌నగర్ చౌరస్తాలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. రెండురోజులుగా అతను షాపునకు వెళ్లడం లేదు. ఈ విషయంపై భార్య అయేషా సుల్తానా ప్రశ్నించడంతో ఈ నెల 6న షాపునకంటూ బ్యాగులో జత బట్టలు, దుప్పటి తీసుకెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సునీల్ తదితరులు

రహమత్‌నగర్: పెండింగ్ స్కాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్‌మెంట్స్ నిధులను తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్‌తో విద్యార్థి సంఘాలు ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించే కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ జూబ్లీహిల్స్ కార్యదర్శి సునీల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు లెనిన్, శ్రీమాన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


చైర్మన్‌కు వినతిపత్రమిస్తున్న టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగులు

హిమాయత్‌నగర్: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం ఆ శాఖ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు శుభాకంక్షాలు తెలియజేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, చాలా సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని వారు కోరారు. మంగళవారం జరిగే బోర్డు మీటింగ్‌లో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, జ్యోతి, రచన, గోపి, రమేష్, చంద్రమౌళి, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

కారును ఢీకొట్టి.. యువకుడిపై దాడి

వెంగళరావునగర్: అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టడమే కాకుండా యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ గంగానగర్‌కు చెందిన అబ్దుల్ సమద్ కారు డ్రైవర్. సోమవారం సాయంత్రం అబ్దుల్ సమద్ తన ఓనర ఆరీఫ్‌తో కలిసి యాదగిరినగర్ నుంచి యూసుఫ్‌గూడ వెళ్లడానికి కారులో బయలు దేరాడు. హనుమంతరావు ఫంక్షన్ వద్దకు రాగానే ఎదురుగా అతి వేగంగా వచ్చిన బంటి యాదవ్ అనే యువకుడు తన వాహనంతో కారును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారు కొన్ని భాగాలు దెబ్బతిన్నాయి.

ఇళ్ల స్థలాల కేటాయింపుపై రెవెన్యూ అధికారుల విచారణ

- లోకాయుక్తలో వడ్డెర ఐక్యవేదిక ఫిర్యాదు
- ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది విచారణ

రహమత్‌నగర్: లోకాయుక్త న్యాయ స్థానం ఆదేశాల మేరకు వడ్డెర కులస్తుల ఇళ్ల స్థలం కేటాయింపు కోసం ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు సోమవారం ఎస్పీఆర్ హిల్స్‌లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రాజ్ మాట్లాడుతూ... ఇళ్లు లేని పేద వడ్డెర కులస్తులకు ఇళ్లు నిర్మించాలని 2023 ఆగస్టు 19న తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ లోకాయుక్త న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. న్యాయస్థానం, ఖైరతాబాద్ మండల తహసీల్దార్ ఆదేశాల మేరకు తాము విచారణ చేపడుతున్నామని తెలిపారు. వడ్డెర సంఘం తరపున మొత్తం 141 మంది లబ్ధిదారుల జాబితాకు తమకు పంపించడం జరిగిందని, అందులో ఉన్న వారి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు అధార్, ఓటర్ గుర్తింపు కార్డులను పరిశీలించడం జరుగుతుందన్నారు. పూర్తి విచారణ అనంతరం నివేదికలను లోకాయుక్త న్యాయ స్థానానికి, జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు సమర్పిస్తామన్నారు. ఈ రోజు విచారణ ప్రక్రియ మొదలైందని, పూర్తి కావడానికి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని కిరణ్‌రాజ్ చెప్పారు.

వడ్డెర ఐక్య వేదిక నాయకులు హర్షం...

తాము చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త న్యాయ స్థానం ఆదేశాలతో మండల రెవెన్యూ అధికారులు స్పందించడం పట్ల తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర అధ్యక్షుడు శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఇళ్లు లేని నిరుపేద వడ్డెర కులస్తుల నివాసాలు ఏర్పాటు కోసం మండల రెవెన్యూ అధికారులు చర్యలు మొదలు పెట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.


నాలాల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి


రహమత్‌నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: వర్షాకాలంలో నాలాల్లో నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని నాలాలను ఆయన సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రహమత్‌నగర్ డివిజన్‌లో ప్రధానంగా రెండు నాలాలు ఉన్నాయన్నారు. వాటిని గత వేసవిలోనే డీసిల్టింగ్ చేయించామన్నారు. డీప్ నాలాలు అయినందున నాలాల పక్క ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నాలాల పక్కన నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు జాగ్రత్తలు పాటించాలని, చిన్న పిల్లలను నాలాల వద్దకు పంపకూడదని హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ డీఈ శ్రీరాములు, ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మంగళవారం। 9। జూలై। 2024

రేపు బల్కంపేట్ అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పిస్తున్నట్లు భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఈసారి జరుగుతున్న సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నగరంలోని గోల్కొండ జగదాంబిక అమ్మవారికి బంగారు పాత్రలో నైవేద్యం సమర్పించామన్నారు. ఇందులో భాగంగా బుధవారం బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించనున్నట్లు చెప్పారు. పాతబస్తీ మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయానికి బయలుదేరుతామన్నారు. బాజాభజంత్రీల నడుమ పోతురాజుల విన్యాసాలు, జోగిని నిషాక్రాంతి తలపై బంగారు పాత్రలోని బోనం పెట్టుకుని మీరాలంమండి నుంచి బల్కంపేట వరకు సామూహిక ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే 'జామ్ జంక్షన్'



లోగోను ఆవిష్కరిస్తున్న దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్

బంజారాహిల్స్: నగరంలో ప్రసిద్ధిగాంచిన మ్యూజికల్ బ్యాండ్స్‌ను ప్రోత్సహించేందుకు జామ్ జంక్షన్ పక్కా రీజనల్ పేరుతో ఓ ఉత్సాహభరిత పోటీని నిర్వహిస్తున్నట్లు దర్శకుడు మారుతి తెలిపారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జామ్ జంక్షన్ పక్కా రీజనల్ లోగోను ఆయన సినీ నిర్మాత ఎస్‌కేఎన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మాట్లాడుతూ మారుతి టీం ఆర్ట్స్ శ్రీఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరంలో ప్రస్తుతం మ్యూజికల్ బ్యాండ్ ట్రెండ్ కొనసాగుతోందని, ఏ కార్యక్రమంలో ఏ మ్యూజికల్ బ్యాండ్ జరుగుతుందో తెలుసుకొని చాలామంది అక్కడికి వెళ్తున్నారని, అలాంటివారిని మరింత ప్రోత్సహించేందుకు ఓ మంచి పోటీ పెడితే బాగుంటుందని ఆలోచనతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీన హైటెక్స్‌లో నిర్వహిస్తున్నామని అన్నారు. పోటీలో నగరంలోని ప్రధాన బ్యాండ్ల కళాకారులంతా పాల్గొంటున్నారని వెల్లడించారు. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు ఇది మంచి వేదికన్నారు. కార్యక్రమంలో దర్శకుడు అనిల్ కుమార్, శ్రీఈవెంట్ ఫౌండర్ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి బోనం.. విజయవంతం

గోల్కొండ: గోల్కొండ కోట ఆషాఢమాసపు జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన మొదటి బోనం పూజా విజయవంతంగా ముగిసిందని జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే బోనాలు విజయవంతంగా నిర్వహించామని ఆయన అన్నారు. జలమండలి, బల్దియాతో పాటు వివిధ శాఖల అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో పనులు పూర్తి చేశారని ఆయన చెప్పారు. మొదటిబోనం పూజకు గతంలో కంటే భారీ సంఖ్యలో భక్తులు వచ్చారని, పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగలేదని ఆయన అన్నారు. బోనాల ఉత్సవాల పూజకు మొదటి రోజు రాష్ట్ర గవర్నర్ గోల్కొండ కోటకు రావడం ఇదే మొదటిసారి అని ఆయన తెలిపారు. మొదటి బోనం పూజకు లక్షకు పైగా భక్తులు వచ్చారని ఆయన చెప్పారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం

– అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి

లక్డీకాపూల్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్కరించాలని బల్దియా అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి గ్రేటర్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అడిషనల్ కమిషనర్ శ్రీవాత్సవతో కలిసి నళిని పద్మావతి, సత్యనారాయణ విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 147 అర్జీలు వచ్చాయి. చార్మినార్ జోన్‌లో 4, సికింద్రాబాద్ జోన్‌లో 18, కూకట్‌పల్లి జోన్ 61, శేరిలింగంపల్లి జోన్ 51, ఖైరతాబాద్ జోన్ 1, ఎల్బీనగర్ జోన్ 12 విజ్ఞప్తులు అందాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో 30 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ సమస్యలపై 15, ట్రాన్స్‌పోర్ట్ 1, రెవెన్యూ 5, సి.ఇ మెయింటెనెన్స్ 2, ఎఫ్‌ఏ 2, ఎలక్షన్స్ 2, అడ్మినిస్ట్రేషన్ 2, లేక్స్ విభాగానికి 1 విన్నపం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 9 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం పంపించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చంద్రకాంతరెడ్డి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, యస్ఎన్‌డీపీసీ ఈ.కోటేశ్వరరావు, సీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, టాక్స్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ కేఎస్ రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ వేదిక కావాలి

– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ జిల్లా వేదిక కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకాంక్షించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. సరికొత్త ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదునుపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 2 నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్: 91006 78543కు ఆగస్టు 3 వరకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు) కదిరివన్, డీఈఓ రోహిణి, డీఎస్ఓ రమేష్, ఈ–డీఎం రజిత, డీపీఆర్ఓ ఎంఏ కలీం, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెసెంటేటివ్ వినీత్ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం ఇవ్వాల్సిందే!

2500 కిలోవాట్స్‌కు 800 గజాల చొప్పున కేటాయించాలని ఆదేశం

హైరైజ్ అపార్ట్‌మెంట్లకు, పెద్ద వెంచర్లకు హుకుం జారీ చేసిన డిస్కం

శివార్లలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు స్థలాలకు కొరత నేపథ్యంలో నిర్ణయం

పదేళ్ల క్రితం నగరంలో విద్యుత్ కనెక్షన్లు 38.16 లక్షలు ఉండగా, ప్రస్తుతం 62.10 లక్షలకు చేరింది. గతంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,261 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం 4,352 మెగావాట్లకు చేరింది. విద్యుత్ వినియోగం 49.56 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు సబ్‌స్టేషన్లు/ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తి.. సరఫరాలో అంతరాయానికి కారణమవుతున్నాయి. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ భూములు లేకపోవడం, బహిరంగ మార్కెట్‌లో గజం రూ.లక్షకుపైగా పలుకుతుండటంతో కొనుగోలు చేయలేని స్థితి. భవిష్యత్తులో భారీగా పెరగనున్న విద్యుత్ అవసరాలు తీర్చాలంటే.. బహుళ అంతస్తుల నిర్మాణ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఓపెన్ ప్లాట్స్ లేవుట్ దారుల నుంచి ముందే అనువైన భూమిని విద్యుత్ అవసరాలకు సేకరించి తీరాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఆ మేరకు కొత్తగా వెలుస్తున్న గేటెడ్ కమ్యూనిటీల్లో విల్లాల సంఖ్య/బహుళ అంతస్తుల భవనాల్లోని ఫ్లాట్ల సంఖ్యను బట్టి భూమి కేటాయించాల్సిందిగా సర్క్యులర్ జారీ చేసింది. 2500 కిలోవాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్న బహుళ అంతస్తుల భవన సముదాయంలో 800 గజాల చొప్పున, 35 ఎకరాలకుపైగా విస్తరించిన గేటెడ్ కమ్యూనిటీల్లో 1500 గజాల చొప్పున ఖాళీ భూమిని విద్యుత్ సంస్థకు కేటాయించాలని ఆదేశించింది. ఆయా వినియోగదారుల అవసరాల మేరకు కేటాయించిన ఈ భూమిలోనే కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించి నాణ్యమైన సరఫరా ఇవ్వొచ్చని డిస్కం భావిస్తోంది.

–సాక్షి, సిటీబ్యూరో

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడ ఉంది. తక్కువ ధరలకే భూములు లభిస్తున్నాయి. దీంతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం కూడా భారీగా విస్తరించింది. సగటు మనిషి సొంతింటి కలను నెరవేర్చేందుకు రియల్ ఎస్టేట్ కంపెనీలు శివారు జిల్లాల్లో పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసి వెంచర్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ బిల్డింగ్‌లు నిర్మిస్తున్నాయి. ఇక్కడ భూముల ధరలు అమాంతం పెరిగాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్‌గా చెప్పుకుంటున్న కోకాపేట్, మణికొండ, నార్సింగి, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్‌లో ఎకరం రూ.వంద కోట్లకుపైగా ధర పలుకుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలోనే భూములు ఉన్నప్పటికీ.. రక్షణ లేకపోవడంతో చాలా వరకు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. ప్రభుత్వ రికార్డుల్లో భూములు ఉన్నట్లు కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అప్పటికే ఆయా భూములన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోవడం, నిర్మాణాలు కూడా వెలియడంతో స్వాధీనం చేసుకోలేని పరిస్థితి. ఏదైనా ప్రజావసరానికి భూమి కావాలంటే కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఒక వేళ ఖాళీ భూములు ఉన్నా.. చివరికి అవి కూడా ఏదో ఒక కోర్టు కేసులో చిక్కుకుని ఉంటోంది. విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి డిస్కం సిద్ధంగా ఉన్నా.. భూముల కొరత సమస్యగా మారింది. ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్లు అధిక ఒత్తిడికి గురవుతున్నాయి. వీటి నుంచి కొత్త నిర్మాణాలకు సరఫరా ఇవ్వలేని దుస్థితి.



గుట్టుగా సర్క్యులర్ జారీ..

ఔటర్ రింగ్ రోడ్డుకు అటు ఇటుగా వందల ఎకరాల్లో కొత్తగా వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, హైరైజ్ బిల్డింగ్‌లు వెలుస్తున్నాయి. ఒక్కో గేటెడ్ కమ్యూనిటీలో 500 వరకు విల్లాలు ఏర్పాటు చేస్తున్నారు. 50 అంతస్తుల హైరైజ్ బిల్డింగ్స్‌లో 500పైగా ఫ్లాట్స్‌కుపైగా నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లాట్‌కి సగటున 5 కిలోవాట్ల విద్యుత్ అవసరం. ఈ లెక్కన అపార్ట్‌మెంట్‌లోని మొత్తం వినియోగదారుల అవసరాలు తీర్చాలంటే కనీసం 2500 కిలోవాట్ల విద్యుత్ అవసరం. సమీపంలోని సబ్‌స్టేషన్లపై అప్పటికే అధిక ఒత్తిడి ఉండటంతో కొత్త సబ్‌స్టేషన్లు, ఫీడర్లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. సమీపంలో ప్రభుత్వ భూములు లేకపోవడం, ఉన్నవి కూడా కబ్జాల్లో/ కోర్టు కేసుల్లో ఉండటంతో డిస్కం కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సి వస్తోంది. విధి లేని పరిస్థితుల్లో నిర్మాణ సంస్థలు/వెంచర్ నిర్వాహకులే సొంత ఖర్చులతో సమీపంలోని సబ్‌స్టేషన్లలోని ఫీడర్ల నుంచి లైన్లు వేసుకోవాల్సి వస్తోంది. అంచనాల రూపకల్పన, అభివృద్ధి పనుల పేరుతో భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. నిర్మాణదారులకే కాదు కొనుగోలుదారులకు భారంగా మారుతోంది. అదే నిర్మాణ సంస్థలు వెంచర్/గేటెడ్ కమ్యూనిటీ/ హైరైజ్ బిల్డింగ్ నిర్మాణ ప్రాంతాల్లో డిస్కం కొంత స్థలాన్ని కేటాయిస్తే.. విద్యుత్ పంపిణీ సంస్థే స్వయంగా సొంత ఖర్చులతో ప్రజావసరాల కోసం కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనుంది. తర్వాత కేవలం నిర్మాణ సంస్థ అవసరాలే కాకుండా సమీప కాలనీ/ బస్తీ వాసుల అవసరాలను తీర్చవచ్చని భావిస్తోంది. ఆ మేరకు ఇటీవల ఓ సర్క్యులర్ కూడా జారీ చేసింది. అయితే ఈఆర్‌సీ ఆమోదం లేకుండా యాజమాన్యం ఏకపక్షంగా ఇలాంటి కీలక నిర్ణయం ఎలా తీసుకుంటుందనే అభ్యంతరాలు కూడా లేకపోలేదు. లే అవుట్ నిర్మాణదారుల నుంచి భూములను తీసుకుని, ఆ తర్వాత సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయకపోతే.. తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

2021లోనే ప్రతిపాదన..

33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 500 గజాల స్థలంతో పాటు రూ.10 కోట్లు ఖర్చు అవుతుంది. అదే అవుట్ డోర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 1500 గజాల స్థలంతో పాటు రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. నిజానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సబ్‌స్టేషన్ నుంచి అపార్ట్‌మెంట్‌కు ఓవర్‌హెడ్ లైన్ వేయాలంటే కిలోమీటర్‌కు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అదే భూగర్భ కేబుళ్లు వేయాలంటే కిలోమీటర్‌కు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అదే నిర్మాణ సంస్థ తన పట్టా భూమిలో 500 గజాల స్థలాన్ని పంపిణీ సంస్థకు కేటాయిస్తే.. వాటిలో డిస్కమే సొంత ఖర్చులతో అక్కడ సబ్‌స్టేషన్ నిర్మిస్తుంది. అక్కడి వినియోగదారుల అవసరాలు తీర్చడంతో పాటు దానికి చుట్టుపక్కల ఉన్న కాలనీలు/ బస్తీవాసుల అవసరాలు తీర్చే అవకాశం ఉంది. సబ్‌స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది. నిజానికి 2021లోనే ఈ ప్రతిపాదన వచ్చింది. అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ దీన్ని తిరస్కరించడంతో వాయిదా పడింది. తాజాగా ఈఆర్‌సీ అనుమతి లేకుండానే అధికారులు ఈ అంశంపై సర్క్యులర్ జారీ చేయడంపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల పనుల బిల్లులు చెల్లించండి

సాక్షి, సిటీబ్యూరో: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఆర్‌సీ కేంద్రాలు, టాయిలెట్ల మరమ్మతులు తదితర పనులు చేసిన కాంట్రాక్టర్లకు నేటికీ బిల్లులు చెల్లించలేదని, ఆ పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులకు ప్రభుత్వం నుంచి సదరు బిల్లులు మంజూరైనా, తమకు మాత్రం నేటికీ చెల్లించలేదని, ఈ అంశంలో చర్యలు తీసుకొని తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారికి వినతిపత్రాలు సమర్పించారు.

దేశరాజకీయాల్లో వైఎస్‌ది చెరగని ముద్ర



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: భారతీయ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. వైఎస్ 75వ జయంతి సందర్భంగా విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి విద్యా కోర్సులు ఉన్నత వర్గాలకే పరిమితమైన కాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు కూడా వృత్తి విద్యా కోర్సులు చదివే అవకాశం కల్పించిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిది అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు వైఎస్ ముఖ్యమంత్రిగా అందించిన సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి చేకూరిందని తెలిపారు. ఆయన మరణించి 15 సంవత్సరాలు గడుస్తున్నా ఆయన పేదల హృదయాల్లో ఇప్పటికీ నిలిచే ఉన్నారని కొనియాడారు. ఆయన వారసత్వాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, గోరిగే మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త



- దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టండి
- డెంగీ జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు పెంచాలి
- జీహెచ్‌ఎంసీ అధికారులతో ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజలు సీజనల్ వ్యాధులు, డెంగీ జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఆరోగ్య విభాగం అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా దోమల ద్వారా వచ్చే వ్యాధులను పూర్తిస్థాయిలో అరికట్టడం, దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించడం, స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు, నాలాల్లో స్ప్రే ఆపరేషన్స్ చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మీడియా సహకారంతో డెంగీ జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు ఎక్కువగా స్వైరవిహారం చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. శానిటేషన్, ప్రతి కాలనీలో వలంటీర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజల్లో అవగాహన పెంచాలని, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న 268 బస్తీ దవాఖానాలను ప్రతిరోజూ డిప్యూటీ కమిషనర్లు, సహాయ మెడికల్ అధికారులు సందర్శించి రోజువారీగా నమోదవుతున్న డెంగీ జ్వరాల వివరాలను సేకరించి వాటి తీవ్రత పెరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాల, కళాశాలల విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలన్నారు. ఈ జూన్ చివరి వరకు కేవలం 148 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, గత సంవత్సరంతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని, దీనికి కారణం మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెడికల్ టీమ్స్ పటిష్టమైన చర్యలు తీసుకోవడమేనని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా మరింత ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకోవాలి

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



పంజగుట్ట: ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకోవాలని, ఉద్యోగం లేని వారు ఎంత ఇబ్బందులు పడతారో ఆకలి బాధల్లో నుంచి వచ్చిన వారికే అర్థం అవుతుందని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు గత చరిత్రను మరువొద్దని, ఏ ప్రభుత్వాన్ని కూడా బయటివాళ్లు వచ్చి కూల్చరని, వారు చేసే తప్పిదాల వల్లే కూలిపోతుందన్న విషయాన్ని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. సిగ్నల్ టీవీ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు శివారెడ్డి అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, ప్రభుత్వం ముందు డిమాండ్లు అనే అంశంపై సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. లైఫ్ చాలా పెద్దదని, ఒక ఉద్యోగం రాలేదని ఆవేశానికి గురై తప్పుడు పనులు చేయవద్దని నిరుద్యోగులకు సూచించారు. కేంద్రం రూ.80 లక్షల కోట్లు బ్లాక్‌మనీ తీసుకువస్తామని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాటతప్పిందని ఆరోపించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. అభివృద్ధి నమూనా ఉద్యోగాలు సృష్టించలేని నమూనాగా మారిందని, ఐటీ సెక్టార్‌లో రాబోయే కాలంలో 40 లక్షల ఉద్యోగాలు పోతాయని సత్య నాదెళ్ల ఒక పుస్తకంలో రాసారని గుర్తుచేశారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలను నాశనం చేశారని, మంచి విద్య అందిస్తే పిల్లలు ఎక్కడైనా పోటీపడేలా తయారవుతారని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ కల్పన ఎలా అనే విశయంపై ఒక కమిటీ వేయాలని, ఆ కమిటీ నిరుద్యోగుల సమస్య పరిష్కారం కోసమే ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించేందుకు పౌర సమాజం నుంచి ఒక మేధావుల కమిటీ ప్రకటించారు. కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, ప్రొఫెసర్ మురళీమనోహర్, సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ్ నాయక్, తెలంగాణ విఠల్ పాల్గొన్నారు.

మహానేతకు నివాళి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో సాక్షి సీఈఓ అనురాగ్ అగర్వాల్, డైరెక్టర్లు ఏఎల్‌ఎన్ రెడ్డి, రాణిరెడ్డి, పీవీకే ప్రసాద్, కేఆర్‌పీ రెడ్డి, వైఈపీ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

జాతీయ యోగా ఛాంపియన్‌షిప్‌లో నగర విద్యార్థుల హవా..

- ముంబై వేదికగా 4 మెడల్స్ సాధించిన తెలుగు విద్యార్థులు
- త్వరలో దుబాయ్ వేదికగా అంతర్జాతీయ పోటీలకు అర్హత



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే యోగా ఛాంపియన్‌షిప్‌లలో నగరానికి చెందిన యోగా విద్యార్థులు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ముంబై వేదికగా నిర్వహించిన ఇండియా లెవెల్ యోగాసన ఛాంపియన్‌షిప్–2024లో నగర విద్యార్థులు 4 మెడల్స్‌తో రాణించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో 28 రాష్ట్రాల నుంచి యోగా విద్యార్థులు పాల్గొనగా.. నగరం నుంచి వెళ్లిన విద్యార్థుల్లో నలుగురు మెడల్స్ సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బాలికల అండర్ 9–11 విభాగంలో ప్రదీప్తి ద్వితీయ స్థానంలో నిలవగా, హన్సినీ తృతీయ స్థానం సాధించింది. అండర్ 12–15 విభాగంలో మనస్వీ 5వ స్థానంలో నిలిచింది. అంతేగాకుండా బాలు అండర్ 9–11 విభాగంలో విద్వాన్ తృతీయ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా వివిధ విభాగాల్లో రాష్ట్రం నుంచి 18 మంది యోగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నగరం వేదికగా జి.రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు మెడల్స్ అందుకున్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు త్వరలో దుబాయ్ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని యోగా ట్రైనర్ రాకేష్‌కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో నగర విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి రాష్ట్రానికి, దేశానికి ఖ్యాతిని తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

దళిత ఎస్‌ఐ ఆత్మహత్యకు కారణమైన వారిపై అట్రాసిటీ పెట్టాలి



పంజగుట్ట: దళిత ఎస్‌ఐ ఆత్మహత్యకు కారణమైన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. మాలమహానాడు జాతీయ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వరు, ఇచ్చినచోట వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ అగ్రకుల ఉన్నతాధికారి, పలువురు కానిస్టేబుల్స్ వేధింపుల వల్ల పురుగుల మందుతాగి యశోదాలో చికిత్స పొందుతూ మృతిచెందాడని, ఒక యువ ఎస్‌ఐ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మహత్యకు సహ ఉద్యోగులే కారణమని బాధితుడి భార్య ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న మచ్చకూడా లేని ఒక నిజాయతీగల అధికారిని వేధింపులకు గురి చేయడంతో ఆయన భార్యా, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు, ఉపాధ్యక్షులు తాలూకా రాజేష్, గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోకుల కళ్యాణ్, మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గోపాజు రమేష్, శ్రీకాంత్, కమల్ కుమార్, ఎల్లస్వామి, హరినాథ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లపై స్పందించాలి



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య సంఘం నేతలు

కవాడిగూడ: దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రూ.6 వేల పింఛన్ వెంటనే అమలు చేయాలని తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అశోక్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ దివ్యాంగుల సమైక్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రంలోని దివ్యాంగులకు చేయూత అందించాలని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమ పింఛన్లు పెంచడంతో పాటు సకాలంలో అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో తెలంగాణ దివ్యాంగుల సమాఖ్య సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, శ్రావణ్ కుమార్, భువనేశ్వర్, వరలక్ష్మి, విజయ్‌కుమార్, ప్రసాద్, ధనమ్మతో పాటు దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






ప్రింటింగ్ దోశ..



కాగితంపై అక్షరాలు ప్రింట్ తీయడం చూశాం.. ఫొటోలు ప్రింట్ తీయడం చూశాం.. ఫ్లెక్సీలు ప్రింట్‌లు వస్తున్నాయి. ప్రింటర్లలోనూ కలర్, బ్లాక్ అండ్ వైట్, 3డీ, ఇంకా వివిధ రకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే దోశను ప్రింట్ తీయడం ఎప్పుడైనా విన్నారా.. కొత్తగా ఉంది కదూ.. నిజమే ఇటీవల కాలంలో మార్కెట్‌లోకి కొత్తగా దోశ మేకర్ (ప్రింటర్) అందుబాటులోకి వచ్చింది. వంటింట్లో ఇప్పటికే అనేకరకాలైన ఆధునిక వస్తువులు వినియోగిస్తున్నాం. తాజాగా చెన్నైకి చెందిన ఓ సంస్థ దోశ ప్రింటర్‌ను అభివృద్ధి చేసింది. ప్రింటర్‌కు ఒక వైపు ట్రే ఉంటుంది. అందులో పిండి వేస్తే సరిపోతుంది. నిమిషానికి ఒక దోశ వస్తుంది. దోశను ఎంత మందంతో కావాలనుకుంటే ఆ విధంగా మనం మర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. ఫ్లిప్ ఆటోమేటిక్ దోశ మేకర్‌కు 360 డిగ్రీల ఫుడ్ గ్రేడ్ కోటెడ్ రోలర్ అమర్చి ఉంటుంది. ఈ యంత్రం 1600 వాట్ల విద్యుత్తు శక్తితో పనిచేస్తుంది. అత్యంత వేగంగా, ఖచ్చితత్వంతో పనిచేస్తుందని తయారీ సంస్థ పేర్కొంటోంది. పరిమాణం చిన్నగా ఉండటంతో వంట గదిలో ఇట్టే ఇమిడిపోతుంది. ఆటోమేటిక్ సేఫ్టీ కట్‌ఆఫ్ ఫీచర్స్ ఉన్నాయి. 3 నిమిషాలు వినియోగించకపోతే దానంతట అదే పవర్ ఆఫ్ అయిపోతుందట. ఒక్కో ప్రింటర్ రూ.13 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.

వింబుల్డన్‌లో వెల్‌స్పన్



ప్రస్తుతం జరుగుతున్న ప్రతిష్టాత్మక వింబుల్డన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ తన భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆకర్షణీయమైన రంగుల్లో సంస్థ రూపొందించిన కాటన్ ఉత్పత్తుల్ని వింబుల్డన్ పోటీల సందర్భంగా క్రీడాకారులు వినియోగిస్తున్నారు. ఐకాన్ మీట్స్ ఐకాన్స్ పేరిట దీనికి సంబంధించి ప్రచారం నిర్వహిస్తున్నామని వివరించారు.

లింక్డ్ ఇన్.. ఓపెన్ టూ వర్క్



నేడు ఉద్యోగాల కోసం ఎలా శోధిస్తారనేది, రేపు మీ కెరీర్‌లో పురోగతికి మూలం అవుతుందని వ్యాపార, ఉద్యోగకల్పనల సోషల్ వేదిక లింక్డ్ ఇన్ కెరీర్ నిపుణురాలు నీరాజిత బెనర్జీ చెప్పారు. ఉద్యోగార్థుల కోసం ఏర్పాటైన సమావేశంలో పలు సూచనలు చేశారు. తొలి 10 నిమిషాల్లో పంపిన అప్లికేషన్‌లకు కాల్‌బ్యాక్ అవకాశాలు నాలుగు రెట్లు ఎక్కువ కాబట్టి మొదటి వరుసలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. యజమాన్యాలు కోరుకునే నైపుణ్యాలను, అనుభవాలను ప్రతిబింబించేలా ప్రొఫైల్‌ను తరచూ అప్‌డేట్ చేయాలన్నారు. తమ ఓపెన్ టూ వర్క్ ఫీచర్‌ని ఉపయోగించడం వల్ల రిక్రూటర్‌ల నుంచి సందేశాలు వచ్చే అవకాశం రెట్టింపవుతుందని, జాబ్స్ ట్యాబ్ వినియోగంతో నెట్‌వర్క్‌లో నియామకాలపై అవగాహన పెంచుకోవాలని, టెక్ స్టార్టప్‌ల నుంచి క్లీన్ ఎనర్జీ వరకూ ఉద్యోగాలను అన్వేషించడానికి వీలు కల్పించే జాబ్ కలెక్షన్ ఫీచర్ వినియోగం ద్వారా నప్పే ఉద్యోగాలను ఎంచుకోవాలన్నారు.

నేచర్ జోష్

చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్

కొండలు ఎక్కడం, పెద్ద పెద్ద బండరాళ్లపై సేదదీరడం, క్యాంప్ ఫైర్, నైట్ ట్రెకింగ్‌తో అడవిలో తిరిగిన అనుభూతి కలగాలంటే నేచర్ క్యాంప్‌కు వెళ్లాల్సిందే. ప్రకృతి ఒడిలో ఓ రోజంతా సేదదీరి పరవసించిపోవచ్చు. ఇది ఎక్కడో దూరప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతం కాదు. నగరానికి అనుకొని ఉన్న చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఉండటంతో నగరవాసులు ఎంజాయ్ చేస్తున్నారు. రాత్రి బస నుంచి మరుసటి రోజు పార్క్ నుంచి బయటకు వచ్చే వరకూ ఎన్నో మరపురాని అనుభూతులను వెంటతీసుకెళ్లవచ్చు. రచ్చబండలో ముచ్చట్లు, ఫన్నీ గేమ్స్, అడ్వెంచర్ గేమ్స్, బర్డ్స్ వాచింగ్ వంటివి ప్రకృతి ప్రేమికుల మదిని దోచేస్తాయనడంలో సందేహం లేదు.

- గచ్చిబౌలి

చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్ 100 ఎకరాల విస్తీర్ణంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) ఏర్పాటు చేసిన నేచర్ క్యాంపులో ఎన్నో విశేషాలు ఉన్నాయి. గుట్టలపై వివిధ ఆకారాల్లో సహజ సిద్ధమైన రాక్ ఫార్మేషన్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీపం, బేబీ ఏనుగు, ఓల్డ్ మ్యాన్, తాబేలు, పిట్ట పక్కకు చూస్తున్నట్లు ఏర్పాడిన రాళ్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అంతే కాకుండా ఈ రాళ్లపై జంతువుల పెయింటింగ్స్ ఔరా అనిపిస్తాయి. అడవి రారాజు సింహం, కుందేలు, ఏనుగు, ఖడ్గ మృగం, ఉడత, ఎలుగుబంటి బొమ్మలు సందర్శకుల మదిని దోచేస్తున్నాయి.



బర్డ్స్ వాచ్‌టూర్..

మెయిన్ ట్రెక్ రోడ్డు నుంచి వెళుతూ సందర్శకులు బర్డ్స్ వాచ్ చేస్తారు. 45 రకాల పక్షులు అక్కడ ఉంటాయి. కనీసం 20 రకాలు సందర్శకులకు కనిపిస్తాయి. అరుదైన పక్షుల గురించి గైడ్ వివరిస్తారు.

ట్రెకింగ్ రోడ్లు..

సముద్ర మట్టానికంటే ఎత్తులో నాలుగు ట్రెక్ రోడ్లు మూడున్నర కిలో మీటర్లు ఉన్నాయి. ట్రెక్ రోడ్డు-1 సముద్ర మట్టానికి 458 మీటర్లు, ట్రెక్ రోడ్డు-2 మట్టానికి 596 మీటర్లు, ట్రెక్ రోడ్డు-3 సముద్ర మట్టానికి 802 మీటర్లు, ట్రెక్ రోడ్డు-4 సముద్ర మట్టానికి 231 మీటర్ల ఎత్తులో ఉంటుంది. గుట్టలపై నడుస్తూ అక్కడక్కడ సేద దీరేందుకు పెద్ద పెద్ద బండరాళ్లు ఉంటాయి. కొద్ది సేపు ఫొటోలు దిగడం, పిచ్చాపాటి ముచ్చట్లు పెట్టుకుంటూ గడపవచ్చు.

అడవిలో తిరిగిన అనుభూతి | రాత్రంతా అక్కడే గుడారాల్లో బస | కొండలు ఎక్కొచ్చు, పక్షులను చూడొచ్చు

రచ్చబండలో ముచ్చట్లు, ఫన్నీ గేమ్స్ | ఒకటి కాదు ఎన్నో విశేషాలు | టీఎస్ఎఫ్‌డీసీ ఏర్పాట్లు

టికెట్ వివరాలు...

నేచర్ క్యాంప్‌కు వెళ్లేవారు పెద్దలకు రూ.1800, 12 సంవత్సరాల పిల్లలకు రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది. వివరాల కోసం 94935 49399, 93463 64583 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

వీకెండ్ క్యాంప్ ఇలా..

వీకెండ్‌లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు నేచర్ క్యాంప్‌కు చేరుకోవాలి. 4 గంటలకు సందర్శకులంతా మర్రి చెట్టు ర్చబండ వద్దకు చేరతారు. నేచర్‌క్యాంప్ యాక్టివిటీ, టైమింగ్, పార్క్ మ్యాప్‌పై బ్రీఫింగ్ చేస్తారు. విజిటర్స్‌ను రెండు గ్రూపులుగా విభజిస్తారు. స్నాక్స్ అందజేస్తారు.

ఫన్నీ గేమ్స్..

రెండు గ్రూపులు ఫన్నీ గేమ్స్‌తో పోటీ పడతాయి. నెంబర్ స్టాంపింగ్, రోలర్ కోస్టర్, మార్బుల్ గేమ్, ట్రాన్స్‌పోర్ట్ వాటర్, మిషన్ ఇంపాజిబుల్, డ్రామాటిక్స్, పేపర్ కప్, ట్రాన్స్‌పోర్ట్ తదితర గేమ్స్ నిర్వహిస్తారు. అనంతరం రాత్రి బస చేసేందుకు కపుల్ టెంట్, స్లీపింగ్ బెడ్స్, లాంతర్ వంటివి అందిస్తారు. టెంట్ ఎలా వేసుకోవాలో నేర్పిస్తారు. టెంట్‌లో స్వచ్ఛమైన ప్రకృతి గాలిని ఆస్వాదించాల్సిందే. రాత్రిళ్ల వాష్‌రూమ్స్‌కు వెళ్లాలంటే గార్డ్స్ సహాయంతో వెళ్లాల్సి ఉంటుంది. ఒంటరిగా ఎవరినీ బయటకు వెళ్లవద్దని సూచిస్తారు. రాత్రి 8.30 గంటలకు వెజ్ తాలి(భోజనం) అందజేస్తారు.



నైట్ ట్రెకింగ్..

సందర్శకులంతా కలిసి గైడ్ సమక్షంలో ఒకటిన్నర కిలోమీటర్ల దూరం నైట్ ట్రెకింగ్ నిర్వహిస్తారు. లాంతర్లు పట్టుకొని దీపం రాక్ మీదుగా వెళతారు. రాత్రి సమయంలో ప్రకృతి ఒడిలో నడవడం, అడవి ఎలా ఉంటుందో చూడటం మరపురాని అనుభూతి. గంట తరువాత తిరిగొస్తారు. బస చోట క్యాంప్ ఫైర్ ఉంటుంది. అంత్యాక్షరి, రోల్ ప్లే, మ్యూజికల్ చైర్స్‌తో సరదాగా గడుపుతారు. ఆదివారం ఉదయం 5.45కు మళ్లీ ట్రెక్ రూట్-4లో పెద్ద చెరువు వరకూ ట్రెకింగ్‌కు వెళ్లి ఉదయం 7.30 గంటలకు తిరిగొస్తారు. మర్రిచెట్టు రచ్చబండకు చేరుకుంటారు. టిఫిన్ చేసిన తరువాత అడ్వెంచర్ గేమ్స్ అడతారు. వ్యాలీ క్రాసింగ్, బర్మా బ్రిడ్జి, వైన్ ట్రావెల్స్ తదితర ఆటలతో సేదదీరుతారు. ఉదయం 10 గంటలకు క్యాంప్ ముగుస్తుంది.









చరిత్రకు సజీవ సాక్ష్యం.. రేమండ్ కట్టడం

అబ్బురపరిచే 18వ శతాబ్దపు నిర్మాణాలు

నిజాం రాజు సైనికాధికారి, క్రైస్తవుడైన జనరల్ మాన్షియర్ రేమండ్‌ను అప్పటి స్థానికులైన ముస్లింలు మూసారహీంగా, హిందువులు రామ్‌గా పిలిచి తమ అభిమానాన్ని చాటుకునేవారు. అందుకే ఆయన పేరుగా ఆయన నివసించిన ఆ ప్రాంతం మూసారాంబాగ్‌గా ఏర్పడింది. అంతగా ప్రజల మన్ననలు పొందిన ఆయన స్మారకార్థం నిర్మించినవే రేమండ్ స్థూపం, సమాధులు.

- సైదాబాద్

రెండో నిజాం రాజు నిజాం అలీ ఖాన్ పాలనలో ఫ్రెంచ్ దేశస్తుడైన రేమండ్ సైనికాధికారిగా రాజు సైన్యంలోని ఫిరంగి సేనలను పటిష్టంగా తీర్చిదిద్దారు. 1798లో ఆయన మరణానంతరం ఆయన మృతి చిహ్నాలుగా అప్పటి మలక్‌పేటలోని ఎత్తైన కొండ ప్రాంతమైన ఆస్మాన్‌ఘడ్‌లో నిర్మాణాలు చేశారు. 18వ శతాబ్దంలో యూరోపియన్ రీతిలో నిర్మించిన ఈ కట్టడాలు ఇప్పటికీ చూపరులను అబ్బురపరుస్తున్నాయి.

ఎత్తైన కొండపై...

ఎత్తైన కొండ ప్రాంతంపై 180 అడుగుల పొడవు, 85 అడుగుల వెడల్పుతో గద్దెను నిర్మించారు. ఆ గద్దెపై 23 అడుగుల ఎత్తులో రేమాండ్ స్మారక స్థూపాన్ని నిర్మించారు. స్తూపం పక్కనే 28 స్తంభాలతో గ్రీకు శిల్పకళారీతిలో నిర్మించిన ఆయన సమాధి ఉంటుంది. ఆయన స్థూపానికి సమీపంలోనే వారి కుటుంబ సభ్యుల పెంపుడు జంతువులైన గుర్రం, శునకం సమాధులను సైతం నిర్మించారు. 18వ శతాబ్దపు నిర్మాణ శైలితో ఉండే ఈ కట్టడాలు చూపరులను ఆకట్టుకుంటాయి.

పురావస్తు శాఖ చొరవతో..



దశాబ్దం క్రితం వరకూ ఈ కట్టడాల ప్రాంతంపై అధికారుల పర్యవేక్షణ కొరవడి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆ తరువాత పురవాస్తుశాఖ అధికారుల చొరవతో కట్టడాల ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పచ్చటి లాన్‌లతో, మెరుగైన సౌకర్యాలతో పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఎత్తైన ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణంలో ఇటీవల సినిమాలు, సీరియళ్లు సైతం విరివిగా చిత్రీకరిస్తున్నారు.

కాఫీపురం!

అటు ప్రిపరేషన్.. ఇటు ఫిల్టరేషన్

పర్ఫెక్ట్ ఫిల్టర్ కాఫీకి కేరాఫ్ అడ్రస్..

ఇద్దరు అభ్యర్థుల వినూత్న ప్రయత్నం

అశోక్‌నగర్‌లో ప్రత్యేక ఆకర్షణగా మీమ్స్‌తో ఆకట్టుకుంటున్న యువత

హైదరాబాద్ అనగానే మనకు గుర్తొచ్చేది ఒకటి బిర్యానీ అయితే మరొకటి ఇరానీ చాయ్.. సాయంత్రం అయ్యిందంటే చాలు.. నలుగురూ ఒకచోట చేరి చాయ్ తాగుతూ ముచ్చట్లు పెడుతుంటారు. ఇక పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు రోజంతా పుస్తకాలతో కుస్తీ పట్టి సాయంత్రం కాస్త సేదతీరుతుంటారు. ఓ కప్పు టీ తాగితే ఉంటుంది భయ్యా.. శిరోభారం హుష్ కాకి అన్నట్టే.. అయితే..చాయ్ మాత్రమే కాదు.. చాలా మంది కాఫీ ప్రియులు కూడా ఉంటారు.. అలా గ్లాసులో కాఫీ పట్టుకొస్తుంటే.. ఆ రంగు.. ఆ అరోమా చూస్తే చాలు ఏదో తెలియని అనుభూతి. అలాంటి కాఫీ కోసం ఎక్కడికో వెళ్లనక్కర్లేదు.. జస్ట్ అలా అశోక్‌నగర్ వెళ్తే చాలు.

- సాక్షి, సిటీబ్యూరో

దక్షిణాదిలో ముఖ్యంగా తమిళనాడు, కేరళ, కర్ణాటకలో కాఫీకి ఫ్యాన్స్ ఎక్కువ. ముఖ్యంగా ఫిల్టర్ కాఫీ ప్రియులు చాలా మంది ఉంటారు. మన దగ్గర కూడా ఫిల్టర్ కాఫీ ప్రియులు చాలా మందే ఉన్నారు. కాకపోతే ఫిల్టర్ కాఫీ అంత సులువుగా దొరకదు. చాలా ప్రాంతాల్లో ఇన్‌స్టంట్ కాఫీయే దొరుకుతుంది. అందుకే ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఫిల్టర్ కాఫీ ప్రియుల కోసం కాఫీపురం పేరుతో చిన్న కేఫ్‌ను స్థాపించారు.

యూపీఎస్సీ అభ్యర్థుల వినూత్న ప్రయత్నం..

వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ.. కిశోర్ సంకీర్త్, కె.అభినయ్ అనే అభ్యర్థులు ఈ కేఫ్‌ను స్థాపించారు. కాస్త వినూత్నంగా ఆలోచించి దీనికి కాఫీపురం అని పెట్టారు. కాఫీ గింజలను ప్రత్యేకంగా పశ్చిమ కనుమలు, అరకు నుంచి తెప్పించి మరీ కాఫీ తయారు చేస్తున్నారు. మరో ప్రత్యేకత ఏమిటంటే కచ్చితంగా అందరికీ స్టీలు గ్లాసుల్లోనే అందిస్తున్నారు. వాడిన గ్లాసులను స్టీమ్ ద్వారా స్టెరిలైజ్ చేస్తారు. పరిశుభ్రతతో పాటు మంచి ఫిల్టర్ కాఫీ అనుభూతిని అందించడమే తమ ప్రథమ లక్ష్యమని చెబుతున్నారు.

అడుగడుగునా మీమ్స్..

ఇప్పుడు ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో మీమ్స్ తెగ వైరల్ అవుతున్నాయి. యువతను చాలా ఆకట్టుకుంటున్నాయి. ఈ ట్రెండ్‌ను వీరు ఒడిసి పట్టుకున్నారు. కేఫ్‌లో ఎక్కడ చూసినా కామెడీ మీమ్స్‌తో కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. పేమెంట్ క్యూఆర్ కోడ్ వద్ద, సీసీ కెమెరాలు ఉన్నాయని చెప్పేందుకు కూడా మీమ్స్‌నే వాడుతున్నారు. చిక్కమగళూరు కాఫీ, కూర్గ్ కాఫీ, అరకు కాఫీ, బీఆర్ హిల్స్ కాఫీ వంటి కాఫీ వెరైటీలను ప్రత్యేకంగా గ్రేడింగ్ చేయించి తెప్పిస్తున్నారు. జస్ట్ అలా షాప్‌లోకి అడుగు పెడితే చాలు కాఫీ అరోమాతో ముక్కుపుటాలు అదిరిపోతాయనడంలో అతిశయోక్తి లేదు.

అథెంటిక్ కాఫీ ఇవ్వాలని..



హైదరాబాద్‌లో అథెంటిక్ ఫిల్టర్ కాఫీ చాలా అరుదుగా దొరుకుతుంది. పుస్తకాలతో కుస్తీ పట్టి అలా సేదతీరాలనుకునే వారి కోసం ఈ కేఫ్ పెట్టాను. ఫ్రెండ్స్‌తో కలిసి మాట్లాడుతుంటే ఈ ఆలోచన వచ్చింది.

- కిశోర్ సంకీర్త్, వ్యవస్థాపకుడు





ఫిల్టర్ కాఫీ కోసమే వస్తాను..



యూపీఎస్సీ ప్రిపరేషన్ కోసం ఇక్కడికి వచ్చాను. మాది కర్ణాటక. ఎక్కువగా ఫిల్టర్ కాఫీ తాగుతాను. చాలాచోట్ల ఫిల్టర్ కాఫీ కోసం వెతికాను. చివరకు కాఫీపురం గురించి తెలుసుకుని, ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి కాఫీ తాగనిదే రోజు గడవదు.

-స్ఫూర్తి, బెంగళూరు, యూపీఎస్సీ అభ్యర్థి

ప్రభుత్వ ఉద్యోగం నా కల..



కేఫ్ నిర్వహణ నా చదువుకు ఇబ్బంది కాకుండా ప్లాన్ చేసుకుంటాను. పకడ్బందీగా షెడ్యూల్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం నా కల. అలాగే భవిష్యత్తులో కాఫీ షాప్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలనేదే నా కోరిక.

- కపాడం అభినయ్, కాఫీపురం కో-ఫౌండర్

'ఉచిత' నాటకం!

ఏపీలో ఇసుక పేరుకే ఫ్రీ.. డబ్బులు సమర్పించుకోవాల్సిందే ● కూటమి సర్కారు తాత్కాలిక కొత్త విధానం తీరు ఇదీ..

- పన్నుల మోత, రవాణా చార్జీలు, నిర్వహణ ఫీజులు తడిసిమోపెడు
- ఇసుక కమిటీలపై పెత్తనమంతా పచ్చ నేతలదే
- రవాణా ముసుగులో తరలించి సొమ్ము చేసుకునే యత్నాలు
- దాదాపు 40 లక్షల టన్నులు గత 40 రోజుల్లో మాయం
- స్టాక్ పాయింట్ల వద్ద సగం నిల్వలను కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- వర్షాకాల అవసరాల కోసం నిల్వ చేసిన గత ప్రభుత్వం
- జగన్ హయాంలో ఏటా ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం



విశాఖ జిల్లా ఆగనంపూడి వద్ద ఉచితంగా ఇసుక.. కానీ టన్ను ధర రూ.1,394గా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని టీడీపీ సర్కారు చెబుతున్న మాటలు మాయ నాటకాలని తేలిపోయింది! ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించినా స్టాక్ యార్డుల వద్ద మాత్రం ధరల పట్టికలు పెట్టడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత ఇసుక హామీకి స్టాక్ యార్డుల వద్ద పెట్టిన ధరల పట్టికలతో సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారు. వర్షాకాలంలో కొరత లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఉంచింది. తాజాగా టీడీపీ సర్కారు దీన్ని ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పినా అన్నిచోట్లా టన్నుకి నిర్దేశిత ధర చెల్లించాలని తేల్చి చెప్పడంతో ఇసుక కోసం వచ్చిన వారు కంగు తిన్నారు. చీరాల సమీపంలోని వేటపాలెం స్టాక్‌యార్డులో టన్ను ఇసుక రూ.675గా బోర్డు పెట్టారు. దీంతో ఉచితంగా ఇసుక తీసుకెళదామని ట్రాక్టర్లతో వచ్చిన పలువురు మోసపోయామని గ్రహించి వెనుతిరిగారు. అన్ని స్టాక్ యార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఎలాంటి మేలు చేయని.. ఖజానాకు ఆదాయం సమకూరని తాత్కాలిక కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చింది. దీనిల్ల అటు ప్రజలు, ఇటు ఖజానాకు నష్టం వాటిల్లుతుండగా టీడీపీ నేతలు మాత్రం జేబులు నింపుకునేందుకు మార్గం సుగమం అయింది. పేరుకు ఉచిత ఇసుక అని ప్రకటించినా ప్రజలు మాత్రం డబ్బులు కట్టాల్సిందే. ఇదే ఉచిత ఇసుక విధానంలోని ప్రత్యేకత. ఉచిత ఇసుక విధానం పేరుతో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సోమవారం జీవో ఎంఎస్ నెంబర్ 43 జారీ చేశారు. గత సర్కారు హయాంలో అమలైన విధానం స్థానంలో తాత్కాలికంగా ఉచిత విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఇసుక విక్రయాల ద్వారా ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం సమకూరగా ప్రజలకు సులభంగా, అందుబాటు ధరలో లభ్యమయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఖజానాకు ఒక్క రూపాయి ఆదాయం రాదు. మరోవైపు ప్రజలు డబ్బులిచ్చి మరీ ఉచిత ఇసుకను కొనుగోలు చేయాల్సిన అగత్యం దాపురించింది!

ఇదీ కొత్త విధానం..

జిల్లా స్థాయిలో కమిటీలు ఆయా రీచ్‌ల్లో ఇసుక ధరలను నిర్ణయిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఎస్పీ, జేసీ, ఆర్డీఓ తదితర అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటైన ఇసుక కమిటీలు తమ పరిధిలోని ఇసుక స్టాక్ యార్డులను స్వాధీనంలోకి తీసుకుని ధరలు నిర్ణయించాయి. సీనరేజి ఫీజు, ఇతర పన్నులు, తవ్వకం, లోడింగ్, రవాణా, ర్యాంపు నిర్వహణ, పరిపాలనాపరమైన ఖర్చులన్నీ లెక్కించి టన్ను ఇసుక ధరను నిర్ణయించారు. యార్డులకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లేదా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఇన్‌ఛార్జీలుగా నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారులు స్టాక్ పాయింట్ల వద్ద నేరుగా ఇసుక కొనుగోలు చేయవచ్చని, తరలించేందుకు వారే లారీలు తెచ్చుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్లలో నగదు లావాదేవీలు కాకుండా డిజిటల్‌గా మాత్రమే డబ్బులు స్వీకరించే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో ఇసుక కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో పర్మిట్లు జారీ చేసే విధానం రూపొందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇసుక ఆపరేషన్స్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర స్థాయిలో మైనింగ్ డైరెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తామని తెలిపారు. ఒక వ్యక్తి ఒక రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఇస్తామన్నారు.

ఉసూరుమంటూ..

ఉచితంగా ఇసుక దొరుకుతుందని భావించిన నిర్మాణదారులు ఉదయాన్నే ట్రాక్టర్లలో స్టాక్ పాయింట్ల వద్దకు వచ్చి బారులు తీరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డులు చూసి విస్తుపోయారు. ఉచితంగా ఇసుక అందిస్తామని ఊరించి టన్నుల లెక్కన డబ్బులు కట్టాలని బోర్డులు ఏర్పాటు చేయటాన్ని చూసి ఉసూరుమంటూ వెళ్లిపోయారు. కొత్త ఇసుక విధానంలో బాపట్ల జిల్లా చీరాలలో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.3,034 అవుతుంది. ఒక్కో ట్రాక్టర్‌లో 4.50 టన్నులు లోడింగ్ చేయవచ్చు. దీనికి రవాణా ఛార్జీలు మరో రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా ట్రక్కు ఇసుక రూ.4 వేలు సమర్పించుకుని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరిగి వెళ్లిపోతున్న వినియోగదారులు..

స్టాక్ పాయింట్ల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీతో రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా ఇసుక అని పేర్కొంటూ షరతులు వర్తిస్తాయి అనే మాదిరిగా టన్ను ఇసుక రూ.675 అని బోర్డులు పెట్టారు. అక్కడకు వచ్చిన వారంతా బోర్డులు చూసి ఈ ధరలకు కొనలేమని తిరిగి వెళ్లిపోతున్నారు. వేటపాలెం స్టాక్ పాయింట్‌కి మధ్యాహ్నం వరకు 20 ట్రాక్టర్లు రాగా అన్నీ ఖాళీగా తిరిగి వెళ్లిపోయాయి. ఒక్కరూ ఇసుక కొనుగోలు చేయలేదు. టీవీలు, పేపర్లలో ఇసుక ఉచితమన్న వార్తలు చూసి వచ్చామని.. కానీ ఇక్కడ వచ్చాక తాము మోసపోయామని గుర్తించినట్లు పలువురు కొనుగోలుదారులు పేర్కొన్నారు.

రవాణా ముసుగులో దోపిడీకి స్కెచ్!

ఇసుకపై కొత్త విధానంలో ఉచితం అనేది ఒక మాయ కాగా రవాణా అనేది మరో సరికొత్త దోపిడీకి స్కెచ్‌గా కనిపిస్తోంది. రవాణా ముసుగులో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇసుకను తామే రవాణా చేస్తామనడం వెనుక ఉద్దేశం అదేనని భావిస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరతను అధిగమించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన ఇసుకను అధికారం మారగానే కూటమి సర్కారు మాయం చేసింది. దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను గత 40 రోజుల్లో లెక్కాపత్రం లేకుండా ఎక్కడికక్కడ టీడీపీ నేతలు అమ్మేసుకున్నారు. అదే తరహాలో రవాణా పేరుతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొత్త విధానానికి రూపకల్పన చేశారు. పేరుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని ఇసుక కమిటీలు అమ్మకాలను పర్యవేక్షిస్తాయని చెబుతున్నా స్థానిక టీడీపీ నేతలే ఇసుక వ్యవహారాలను నియంత్రించే పరిస్థితి నెలకొంది. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు హల్‌చల్ చేయడమే ఇందుకు ఉదాహరణ. ఉచితంగా ఇసుకను అందిస్తున్నామంటూ బ్యానర్లతో స్టాక్ పాయింట్ల వద్ద ర్యాలీలు నిర్వహిస్తూ హడావుడి చేశారు. దీన్నిబట్టి స్టాక్ యార్డులు ఎవరి చేతుల్లో ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పటివరకు జిల్లా ఇసుక కమిటీలు స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో ఇన్‌చార్జీలను కూడా నియమించలేదు. యార్డుల్లో ఎంత ఇసుక ఉందో కచ్చితమైన సమాచారం అధికారుల వద్ద లేదు. వర్షాకాలం సీజన్ వరకు ఉచిత ఇసుక పేరుతో దోపిడీని కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయి విధానాన్ని తెచ్చే యోచనలో సర్కారు ఉన్నట్లు స్పష్టమవుతోంది

సగం 'స్టాక్'స్వాహా

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్లను తమ అధీనంలోకి తెచ్చుకున్న టీడీపీ నేతలు ఇష్టానుసారం విక్రయించేశారు. వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నుల వరకూ ఇసుకను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచింది. గత నెల 4వ తేదీ నుంచి అధికారం అండతో టీడీపీ నేతలు ఇసుక యార్డులను దౌర్జన్యంగా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులను బెదిరించి తరిమేశారు. ఇప్పటికే చాలా వరకూ ఇసుకను అమ్మేశారు. సుమారు 40 లక్షల టన్నుల ఇసుకను విక్రయించేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 40 లక్షల టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ యార్డుల్లో ఉందని గనుల శాఖ చెబుతోంది. అంటే మిగిలిన 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు నెలరోజుల్లోనే మింగేసినట్లు స్పష్టమవుతోంది.


వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలో మాతృమూర్తి, సతీమణితో కలసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనలు

కష్టాలు కొద్దికాలమే... దేవుడి దయతో ధైర్యంగా ఎదిరిద్దాం

75వ జయంతి వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు

సాక్షి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయకు జనవాహిని పోటెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన అభిమానులు వైఎస్సార్ ఘాట్ వద్ద ఘన నివాళులర్పించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, మేనత్త వైఎస్ విమలమ్మ, చిన్నాన్న వైఎస్ సుధీకర్‌రెడ్డి, అత్తమ్మ ఈసీ సుగుణమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. సమాధి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్ జగన్ కాసేపు అక్కడే మోకాళ్లపై కూర్చొని తండ్రిని స్మరించుకున్నారు. నివాళులర్పించే సమయంలో వైఎస్ విజయమ్మ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

ప్రత్యేక ప్రార్థనలు..

సమాధి ఘాట్ వద్ద వైఎస్ జగన్, వైఎస్సార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రానున్న కాలంలో కొన్ని సమస్యలు ఎదురైనా రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో జగన్ ధైర్యంగా ఎదుర్కొనేలా దేవుడు ఆశీర్వదించాలని మేనత్త విమలమ్మ ప్రార్థన చేశారు. కష్టాలు తాత్కాలికమేనని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా దేవుడి మీద భారం వేసి ముందుకు వెళ్లడం ద్వారా ఎదిరించే శక్తిని ప్రసాదిస్తాడని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైఎస్సార్, వైఎస్ జగన్ చేసిన మంచిని ప్రస్తావించారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు..

ఇడుపులపాయలోని ఘాట్ ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు అక్కడే నిలబడి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతిరెడ్డి, విమలమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అందరికీ అభివాదం.. అభిమానులతో సెల్ఫీ

ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి తరలి వచ్చిన జనవాహినికి వైఎస్ జగన్ అభివాదం చేశారు. వైఎస్సార్ అమర్‌రహే, వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ఘాట్ ప్రాంగణం హోరెత్తింది. పలువురి వద్దకు స్వయంగా వెళ్లి పలుకరించిన వైఎస్ జగన్ అడిగిన వారందరితో సెల్ఫీ దిగారు. భారీగా వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని అనంతరం అక్కడి నుంచి ఉదయం 11.10 గంటలకు గన్నవరం చేరుకున్న వైఎస్ జగన్‌కు విమానాశ్రయంలో పలువురు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. వారందరినీ ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్ రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరారు.

నాన్నా.. మీ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు

- కోట్లాది కుటుంబాలు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి
- తండ్రి వైఎస్‌ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తన తండ్రి వైఎస్‌ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ సోమవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. 'నాన్నా మీ 75వ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు. కోట్లాది కుటుంబాలు ఇవాళ మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మీ పుట్టిన రోజున సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు చూపిన మార్గం మాకు శిరోధార్యం. జీవితాంతం మీరు పాటించిన క్రమశిక్షణ, చేసిన కఠోర శ్రమ, రాజకీయాల్లో మీరు చూపిన ధైర్యసాహసాలు మాకు మార్గం. మీ ఆశయాల సాధనే లక్ష్యంగా, కోట్లాది కుటుంబాల క్షేమమే ధ్యేయంగా చివరి వరకూ మా కృషి కొనసాగుతుంది' అంటూ వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.



ఆ బదిలీలను జిల్లా స్థాయిలోనే చేపట్టండి : ట్రెసా వినతి

సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీల్లో భాగంగా నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలను జిల్లా స్థాయిలోనే చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ప్రభుత్వాన్ని కోరింది. ఒకవేళ ఉద్యోగులు ఇతర జిల్లాలకు బదిలీలు కోరుకుంటే ఆప్షన్స్ ఇచ్చి బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్ కుమార్‌ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించింది. మంత్రి తమ వినతిపై సానుకూలంగా స్పందించారని, ఎన్నికల బదిలీలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, పరస్పర బదిలీలకు అవకాశమిస్తామని హామీ ఇచ్చారని ట్రెసా వెల్లడించింది.

నాయబ్ తహసీల్దార్ల బదిలీలపై మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ శాఖ పరిధిలోకి వచ్చే నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సీనియర్ స్టెనోల బదిలీలపై తాజా మార్గదర్శకాలు విడుదలయ్యాయి. జిల్లా, జోనల్ స్థాయిలో జరిగే ఈ బదిలీల ప్రతిపాదనలను తమ కార్యాలయానికి పంపాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్‌మిత్తల్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. జిల్లా స్థాయిలో (జోన్‌-6 మినహా) జరిగే బదిలీల విషయంలో కలెక్టర్లు తమ ప్రతిపాదనలను సిద్ధం చేసి, అనుమతి కోసం సీసీఎల్‌ఏ కార్యాలయంలోని జోనల్ కమిటీకి పంపాలని, అంతర్‌జిల్లాల బదిలీలకు ఐదు ఆప్షన్స్ ఇచ్చి ఆ ప్రతిపాదనలను సీసీఎల్‌ఏ కార్యాలయానికి పంపాలని ఆ సర్క్యులర్‌లో తెలిపారు. అదే విధంగా జోన్‌-6లో జరిగే నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సీనియర్ స్టెనోల బదిలీలను కూడా ఐదు ఆప్షన్స్‌తో ప్రతిపాదనలను సీసీఎల్‌ఏకు పంపాల్సి ఉంటుందన్నారు.

'నిబంధనల మేరకే బదిలీలు'

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వడ్డెపల్లి ప్రభుదాస్, పి.సుధాకర్ డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ సోమవారం ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు.


గర్భిణులకు విషమ 'పరీక్ష'

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన గర్భిణులు వైద్య పరీక్షల కోసం నడిచి వెళ్లి తీవ్ర అవస్థలు పడ్డారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో సుమారు పది కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. వాల్గొండ గ్రామ ఆరోగ్య ఉపకేంద్రంలో సోమ వారం గర్భిణులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కానీ గ్రామానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో.. సమీపంలోని డొంగర్‌గాం, భీంజితండా, శివగూడ గ్రామానికి చెందిన సుమారు 10 మంది గర్భిణులు ఐదు కిలోమీటర్ల దూరంలోని ఆరోగ్య ఉపకేంద్రానికి నడిచి వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి కాలినడకనే ఇళ్లకు చేరుకోవడం గమనార్హం.


బదిలీ ఉపాధ్యాయుడికి అపూర్వ సన్మానం

దుమ్ముగూడెం: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని భుజాలపై ఎత్తుకుని మరీ తీసుకెళ్లి సన్మానించి గ్రామస్తులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం అచ్చితాపురంలోని ఎంపీపీఎస్‌లో 12 ఏళ్లగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు ఏజే ప్రభాకర్‌కు పదోన్నతిపై పర్ణశాల పాఠశాలకు బదిలీ అయింది. ఆయన అచ్చితాపురంలో పనిచేసినప్పుడు సొంత డబ్బుతో పాఠశాలకు ప్రహరీ నిర్మించడమే కాక విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేశారు. దీంతో సోమవారం గ్రామస్తులంతా ఆయనకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. గ్రామపెద్దలు, యువత, ఉద్యోగులు ప్రభాకర్‌ను గ్రామ శివారు నుంచి భుజాలపై ఎత్తుకుని సన్మాన వేదిక దగ్గరకు తీసుకొచ్చి అభిమానాన్ని చాటుకున్నారు.

ఉస్మానియా, గాంధీలకు సీఎస్‌ఆర్ నిధులు ఇవ్వండి

ఫార్మా కంపెనీలకు వైద్య ఆరోగ్య మంత్రి దామోదర విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఫార్మా కంపెనీలు తమ సీఎస్‌ఆర్ నిధులను విరివిగా ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం 12 ఫార్మా కంపెనీల సీఎస్‌ఆర్ హెడ్‌లతో మంత్రి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా ఆసుపత్రుల బలోపేతానికి ఫార్మా కంపెనీల నుంచి తమ సీఎస్‌ఆర్ నిధులను విడుదల చేసేందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎంతో సుదీర్ఘ చరిత్ర, చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల పూర్వ వైభవానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం తనతో సహా రాష్ట్రంలోని 12 ప్రముఖ ఫార్మా కంపెనీల సీఎస్‌ఆర్ ఫండ్స్ విభాగాధిపతులు ఈ వారంలో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యత కలిగిన అంశాలపై ఓ నివేదికను సమర్పిస్తామన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల సూపరింటెండెంట్లను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంఈ డాక్టర్ వాణి, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, మైలాన్ లేబరేటరీ ప్రతినిధి మిచెల్లె డొమినికా, గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి కె.రఘురామన్, నాట్కో ఫార్మా ప్రతినిధి ఎం.వంశీకృష్ణ, భారత్ బయో ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధి ప్రవీణ్, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, అరబిందో ఫార్మా లిమిటెడ్ ప్రతినిధి పి.హరీష్ బాబు, హిట్రో డ్రగ్స్ ప్రతినిధి ఎం.సుధాకర్, బాయిలజికల్. ఈ లిమిటెడ్ ప్రతినిధి కృష్ణ చైతన్య, ఎస్ఎస్ఎన్ లేబరేటరీ ప్రతినిధి సురేందర్ రెడ్డి, దివిస్ లేబరేటరీ ప్రతినిధి కె.సుబ్బారావు, విర్కో డ్రగ్స్ ప్రతినిధి ప్రవీణ, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి లోకేష్ మిడ్ డే పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖలో 40 శాతం బదిలీలు

మంత్రి దామోదర స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో వర్కింగ్ కేడర్ స్ట్రెంత్‌లో 40 శాతం ఉద్యోగుల బదిలీలు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ విభాగాధిపతులతో బదిలీలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన జీవో నెంబర్ 80లో పేర్కొన్న నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. బదిలీలు పారదర్శకంగా జరిగేలా కార్యాచరణను రూపొందించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంల నుంచి ప్రొఫెసర్ల స్థాయి వరకు అన్ని స్థాయిల్లో ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డీఎంఈ డాక్టర్ వాణి, ప్రజారోగ్య సంచాలకుడు రవీందర్‌నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఐపీఎం డైరెక్టర్ శివలీల పాల్గొన్నారు.

ఏఐ సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం

ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష



సాక్షి, హైదరాబాద్: త్వరలో హైదరాబాద్‌లో జరిగే ఏఐ (కృత్రిమ మేధస్సు) అంతర్జాతీయ సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఏఐ ఆవిష్కరణలు, సాంకేతికతలో తెలంగాణ ప్రతిభకు అద్దం పట్టేందుకు అంతర్జాతీయ సదస్సు సరైన వేదికగా నిలుస్తుందన్నారు. సదస్సు ఏర్పాట్లను శ్రీధర్‌బాబు సోమవారం సమీక్షించారు. భారతీయ సాంకేతిక రంగంలో ఈ సదస్సును మైలురాయిగా నిలుపుతామని చెప్పారు. ఏఐ రంగంలో అంతర్జాతీయంగా పేరొందిన వక్తలు, నిపుణులు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు హాజరవుతారని వెల్లడించారు. పలు అంతర్జాతీయ ప్రతినిధి బృందాలు కూడా ఈ సదస్సులో పాల్గొంటాయని చెప్పారు. ఏఐ విప్లవంలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి చూపుతున్న అనేక దిగ్గజ సాంకేతిక సంస్థలతో పాటు సుమారు 2వేలకు పైగా మంది ఈ సదస్సులో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయం, ఆరోగ్యరక్షణ, న్యాయ, పాలనారంగాల్లో ఏఐ ఆధునికత, సాంకేతిక వినియోగం, ఏఐ వినియోగంలో నైతికత, ఏఐ భవిష్యత్ వంటి అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. అంతర్జాతీయంగా ఏఐ వేదికపై భారత్ పాత్రను నిర్వచించేలా ఈ సదస్సు నిర్వహణ ఉంటుందని శ్రీధర్‌బాబు చెప్పారు.

చరిత్ర పరిరక్షణ కోసం..

తెలుగు మాట్లాడే ప్రజల సాంస్కృతిక చరిత్రను పరిరక్షించేందుకు రాష్ట్రస్థాయిలో 'డేటాథాన్' నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఐటీశాఖ ప్రకటించింది. త్వరలో రాష్ట్రంలో జరిగే ఏఐ అంతర్జాతీయ సదస్సు నేపథ్యంలో ఈ డేటాథాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపింది. స్వేచ్ఛ సంస్థ సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో నిర్వహించే ఈ డేటాథాన్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్, టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) సహకారం అందిస్తాయి. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఈ డేటాథాన్‌లో పరిశోధక భాగస్వామిగా, ఓజోన్‌టెల్, డిజిక్వింటా, టెక్‌వేదిక నిర్వహణ భాగస్వాములుగా ఉంటాయి. ఇందులో పాల్గొనేవారు తెలుగురాష్ట్రాల్లో మౌఖికంగా ప్రచారంలో ఉన్న జానపద గాథలు, పాటలు, స్థానిక చరిత్ర, స్థానిక ఆహార పద్ధతులు తదితరాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. తెలుగుభాష, సాహిత్య వారసత్వాన్ని ప్రోత్సహించేందుకు ఈ డేటాథాన్ ఉపయోగపడుతుందని ఐటీశాఖ భావిస్తోంది.

గ్రాట్యుటీ పొందడం ఉద్యోగి హక్కు

ఈసీఐఎల్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రిటైర్‌మెంట్ తర్వాత గ్రాట్యుటీ పొందడం ఉద్యోగి హక్కు అని, ఒకవేళ ఉద్యోగి మరణిస్తే అతని వారసులకు అది చెందుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. పెంచిన గ్రాట్యుటీకి ఉద్యోగులు అర్హులంటూ ప్రావిడెంట్ ఫండ్ అప్పీలేట్ అథారిటీ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2007–10 వరకు రిటైర్‌మెంట్ పొందిన ఉద్యోగులకు రూ.3.5 లక్షలు కాకుండా రూ.10 లక్షలు చెల్లించాలని అథారిటీ పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద విచారణ చేపట్టారు. కంపెనీ నిబంధనల మేరకే చెల్లింపులు ఉంటాయని ఈసీఐఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. గ్రాట్యుటీని పెంచుతూ కేంద్రం సవరించిన చట్టం 2010, మే 24 నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఇక్కడి ఉద్యోగులు 2010 కంటే ముందే రిటైర్‌మెంట్ పొందినందున వారికి కొత్త చట్టం వర్తించదని వెల్లడించారు. ఉద్యోగుల తరఫున న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ...గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ 2007లోనే బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తీర్మానం చేశారన్నారు. గతంలో ఇలాంటి అంశంలో ఉద్యోగులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువరించిదని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉద్యోగుల సేవలను గుర్తించి చెల్లించేది గ్రాట్యుటీ అని, దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదని తేల్చి చెప్పారు. కేంద్రం 2008, నవంబర్‌లోనే ఆఫీస్ మెమోరాండం జారీ చేసినందున ఈ ఉద్యోగులు గరిష్ట పరిమితికి అర్హులేనని స్పష్టం చేశారు. ఈసీఐఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.


ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారులను తిరిగి ఆయా స్థానాలకు కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి శ్యామ్ తదితరులు

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 9-7-2024

యోగం



తేలికగా.. సీతాకోకచిలుకలా!

టీనేజ్ అమ్మాయిల నుంచి నడి వయసు స్త్రీల వరకు.. ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను పెంపొందిస్తూ, అధికబరువును నియంత్రించేలా చేస్తుంది బద్ధకోణాసనం. ఈ యోగా భంగిమలో సీతాకోక చిలుక రెక్కల్లా మన కాలి కదలికలు ఉంటాయి. కాబట్టి బటర్‌ఫ్లై ఆసనంగా కూడా దీనికి పేరు. ఉదయం లేదా సాయంత్రం రోజూ పది నిమిషాలు ఈ బటర్‌ఫ్లై ఆసనాన్ని సాధన చేస్తే మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

కంప్యూటర్‌తో పని చేసేవాళ్లు వెన్ను, మెడ, తలనొప్పి వంటి సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారు సులువైన, తేలికైన సీతాకోక చిలుక ఆసనం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చు.

20 నుంచి 30 సార్లు

ముందుగా నేల మీద సుఖాసనంలో కూర్చోవాలి. రెండు పాదాలను మధ్యలోకి తీసుకొచ్చి, చేతులతో కాళ్ల వేళ్లను పట్టుకోవాలి. ఈ భంగిమలో కళ్లు మూసుకొని, శ్వాసపై దృష్టి కేంద్రీకరిస్తూ ఐదుసార్లు దీర్ఘశ్వాస తీసుకుంటూ, వదలాలి. తర్వాత కళ్లు తెరిచి, కాళ్లను మెల్లగా పైకి, కిందకు 20 నుంచి 30 సార్లు కదుపుతూ ఉండాలి.



- రోజూ ఉదయం ఇలా చేస్తుంటే వెన్నెముక దృఢంగా అవుతుంది. లోయర్ హిప్స్, బ్యాక్ కండరాల బలం పెరుగుతుంది. పొట్ట కండరాలలోనూ మార్పులు వస్తాయి. ఒత్తిడి తగ్గి మైండ్, బాడీ విశ్రాంతి పొందుతాయి. కాళ్ల ఎముకల సామర్థ్యం పెరుగుతుంది. రక్తసరఫరా మెరుగై వెన్ను, మెడ, తలనొప్పి సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది.

– జి.అనూషా రాకేష్, యోగా ట్రైనర్

డబుల్ మసాలాతో నిద్రలేమి!



కొందరు పగటివేళ చురుగ్గా ఉండటానికి ఆహారం తక్కువగా తీసుకుంటూ, రాత్రి మాత్రం ఫుడ్ కాస్త గట్టిగానే తినేస్తుంటారు. రోజువారీ పనులన్నీ పూర్తయ్యాయనే రిలాక్సేషన్, మర్నాటి ఉదయం వరకు మరో పని ఉండదన్న హాయి ఫీలింగ్‌తో ఇలా చేస్తుంటారు. ఇంకొందరు రాత్రి డిన్నర్లలో 'బిర్యానీ విత్ డబుల్ మసాలా' అంటూ కాస్త ఎక్కువగానే ఆరగిస్తుంటారు. అయితే రాత్రి పూట తినే ఆహారంలో మసాలాలు ఎక్కువగా ఉన్నా, అది ప్రొటీన్ చాలా ఎక్కువగా ఉండే ఆహారమైనా తినేవాళ్లు నిద్రలేమికి గురయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు స్లీప్ స్పెషలిస్టులు. రాత్రి నిద్రకు ఉపక్రమించే కనీసం రెండుగంటల ముందుగానే లైట్ ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎక్కువ మసాలాలతో పాటు కొన్నిసార్లు కాఫీ, కొవ్వులు, చక్కెర మోతాదులు ఎక్కువగా ఉండే ఆహారాలతోనూ నిద్రపట్టకపోవచ్చనీ... హాయిగా నిద్రపట్టాలంటే గోరువెచ్చని పాలు, అరటిపండ్లు, బాదం, తేనె.. వీటిల్లో ఏదైనా తీసుకుంటే, అవి హాయిగా నిద్రపట్టేందుకు దోహదపడతాయన్నది స్లీప్ స్పెషలిస్టుల మాట.

పారిస్ అంటే ఫ్యాషన్‌కు పుట్టినిల్లు.
కానీ, మన తెలుగు మహిళలు ఆ ఫ్యాషన్ కేంద్రానికే ఫ్యాబ్రిక్స్ ఎగుమతి చేస్తున్నారు.
పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రీడాకారులు ఉపయోగించే లేస్ వస్త్రాలు, దిండ్లు, తువాళ్లు మన నరసాపురం నుంచి తయారయ్యి విమానం ఎక్కాయి.
ఇదీ మన ఘనత.

నరసాపురం లేసులు

ఒలింపిక్స్ వరకూ అల్లుకున్నాయి





సీతారాంపురం జేజే ఎక్స్‌పోర్టులో లేస్ అల్లికల తయారీలో మహిళలు

సూది మొనకు దారం తగిలించి చకచకా వారి మునివేళ్లు కదిలించారంటే చాలు వన్నెచిన్నెల లేసులు క్షణాల్లో కళ్లముందు ఆవిష్కృతమవుతాయి. ఔరా అనిపించేలా హ్యాండ్ మేడ్ ఉత్పత్తులు సిద్ధమవుతాయి. అబ్బురపరిచే అల్లికలతో గోదావరి జిల్లాలకు ఖండాంతర గుర్తింపు తెచ్చిన అతివల హస్త నైపుణ్యం ఇప్పుడు పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ వరకూ చేరింది. ఆ ఘనతను సాధించింది ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం రూరల్‌కి చెందిన మారుమూల గ్రామం సీతారామపురం.

లేసుల పరిశ్రమ

బ్రిటిష్ కాలంలో నరసాపురం జలరవాణాకు కేంద్రంగా ఉండేది. అప్పట్లో ఇక్కడకు వచ్చిన క్రిస్టియన్ మిషనరీ సంస్థలు పేద మహిళలకు ఉపాధిగా లేసు అల్లికలు నేర్పించారు. కాలక్రమంలో ఈ పని పెద్ద పరిశ్రమగా విస్తరించింది. పేద, ధనిక తేడా లేకుండా తీరిక వేళల్లో కాలక్షేపంగా అల్లికలు సాగిస్తుంటారు. నరసాపురం కేంద్రంగా కోనసీమ, రాజమహేంద్రవరం, భీమవరం ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు ఈ హస్తకళ ద్వారా జీవనోపాధి పొందుతున్నాయి. ఈ పనిలో ఉన్న మహిళలకు తోడ్పాటును అందించేందుకు 2005లో నాటి సి.ఎం. వైఎస్ రాజశేఖరరెడ్డి సీతారాంపురం వద్ద లేస్‌పార్క్‌ను ప్రారంభించారు. టవల్స్, టేబుల్ క్లాత్స్, లంచ్ మ్యాట్స్, క్రోషె బ్యాగ్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్ తదితర మన హ్యాండ్ మేడ్ లేసు ఉత్పత్తులకు విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. నరసాపురం పరిసరాల్లో లేసు ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు వంద వరకు ఉన్నాయి. మారుతున్న ఫ్యాషన్, అభిరుచులు, ఆర్డర్లకు అనుగుణంగా తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకుంటూ ట్రెండింగ్‌లో ఉంటూ చైనా, వియత్నాం దేశాలకు గట్టిపోటీనిస్తున్నారు గోదావరి జిల్లాల మహిళలు.



లేస్ అల్లికలో మహిళలు

ఎంతో గర్వంగా ఉంది

పారిస్ ఒలింపిక్స్‌కు మన లేసు, క్లాత్‌తో తయారుచేసిన ఉత్పత్తులు అందించే అవకాశం రావడం చాలా గర్వంగా ఉంది. ఈ లేస్ ఇండస్ట్రీని ప్రభుత్వాలు గుర్తించి వ్యవస్థీకృతం చేస్తే విదేశాల్లో మనదేశ మహిళల నైపుణ్యానికి గుర్తింపు వస్తుంది. ఒలింపిక్స్‌కు పని చేసే అవకాశాన్ని మహిళలు ఎంత సంతోషంగా స్వీకరించారంటే ప్రతి ఒక్కరూ తామే గోల్డ్‌మెడల్ సాధించినంత ఆనందంగా ఉన్నారు.



– కలువకొలను రామ్‌చంద్రుడు, జేజే ఎక్స్‌పోర్ట్స్ అధినేత

పదేళ్లుగా లేసు అల్లికలు

మా చిన్నతనంలో మా అమ్మ, పిన్నమ్మలు అంతా కూడా లేసు అల్లికలు అల్లేవారు. నాకు అప్పటి నుంచి అల్లికలపై అవగాహన ఉంది. గత 10 ఏళ్లుగా లేసు అల్లికలు చేస్తున్నాను. పిల్లలిద్దరినీ కూడా ఉన్నత చదువులు చదివించుకోగలుగుతున్నాం. ఇంట్లో పనులు అయ్యాక ఖాళీ సమయంలో లేసు అల్లికల ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి.



– పులపర్తి లక్ష్మికుమారి, మొగల్తూరు

పారిస్ వేదిక మీద మన లేసు

ఈ నెల 26 నుంచి పారిస్ వేదికగా ప్రారంభం కానున్న ఒలింపిక్స్ క్రీడా సంగ్రామంలో నరసాపురం ఉత్పత్తులు కొలువుదీరే అవకాశం దక్కింది. సీతారాంపురంలోని జేజే ఎక్స్‌పోర్ట్స్ సంస్థ కేంద్రం పరిధిలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ (ఈపీసీహెచ్) ద్వారా ఈ ఆర్డర్ సాధించినట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు. దాదాపు వంద రకాల డిజైన్లు పంపిస్తే వాటిలో ఆరు డిజైన్లను నిర్వాహకులు ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, ప్రపంచ నలుమూలల నుంచి తరలివచ్చే సందర్శకులకు గుర్తుండిపోయే విధంగా ఒలింపిక్స్ థీమ్, లోగోలతో లేస్, ఫ్యాబ్రిక్‌లను ఉపయోగించి టవల్స్, డెకో కుషన్స్, బీచ్ కలెక్షన్స్, క్రోషె మ్యాట్స్ తదితర హ్యాండ్ మేడ్ ఉత్పత్తులను డిజైన్ చేసి సిద్ధం చేసి పారిస్‌కి పంపారు. త్వరలో మన లేసు ఉత్పత్తులు ఒలింపిక్స్ క్రీడాకారులతో పాటు సందర్శకుల చేతుల్లోకి చేరనున్నాయి. తమ ఉత్పత్తులకు అరుదైన గుర్తింపు దక్కడం పట్ల ఈ ప్రాంత మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– విజయ్‌కుమార్ పెనుపోతుల, సాక్షి, భీమవరం
ఫొటోలు : నవరం కృష్ణానందం

సాగుబడి
పునర్వసు : జూలై 20 వరకు

వరి సాగులో రసాయనిక ఎరువులు, సాగు నీటి వాడకాన్ని, దిగుబడి తగ్గకుండా తొలి ఏడాదే సగానికి తగ్గించుకోగలమా?

వరి పొలాల నుంచి వెలువడే మిథేన్ వాయువు (బొగ్గుపులుసు వాయువు కంటే ఇది భూతాపాన్ని 20 రెట్లు ఎక్కువగా పెంచుతోంది) ని అరికట్టే మార్గం ఏమిటి?

ఏటా దుక్కి చేసే పంట భూముల్లో నుంచి ఏటా హెక్టారుకు 20 టన్నుల మట్టి వానకు గాలికి కొట్టుకుపోతోంది. దీన్ని ఆపటం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోగలమా?

భారీ ఖర్చుతో నిర్మించిన రిజర్వాయర్లు కొద్ది ఏళ్లలోనే పూడికతో నిండిపోకుండా చెయ్యగలమా..?

భూగర్భజలాలు వర్షాకాలంలో (రెండు నెలలుగా మంచి వర్షాలు పడుతున్నప్పటికీ) కూడా అడుగంటే వుంటున్నాయెందుకు?

ఈ పెద్ద ప్రశ్నలన్నింటికీ సమాధానం 'ఒక్కటే' అంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు..

అవును.. సాగు పద్ధతిని మార్చుకోవటం అనే ఒక్క పని చేస్తే చాలు..

వరి, పత్తి వంటి తదితర పంటల సాగును 'సగుణ రీజెనరేటివ్ టెక్నిక్' (ఎస్.ఆర్. టి.) అనే నోటిల్లేజ్ ఆరుతడి పద్ధతిలోకి మార్చుకుంటే పై సమస్యలన్నీ పరిష్కారమైపోతాయని అనుభవపూర్వకంగా చెబుతున్నారు రైతు శాస్త్రవేత్త చంద్రశేఖర్.

- పొలాన్ని దున్ని ఒక్కసారి ఎత్తుమడులను ఏర్పాటు చేస్తే చాలు.. 20 ఏళ్లు మళ్లీ దున్నే పని లేకుండానే ఏటా మూడు పంటలు పండించుకోవచ్చు
- వరి దగ్గర నుంచి పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయ పంటలను సాగు చేస్తూ చంద్రశేఖర్ రికార్డులు బ్రేక్ చేస్తున్నారు.
- రసాయనాలను తగుమాత్రంగా వాడుతూ ఖర్చును, శ్రమను తగ్గించుకొని దిగుబడులతోపాటు సేంద్రియ కర్బనాన్ని సైతం 0.3% నుంచి 1.5%కి పెంపొందించానన్నారు.
- జమ్మికుంటలోని జి.ఎస్.ఎస్.ఎస్. ప్రశాంతం కేవీకే ఆవరణలో ఎస్.ఆర్.టి. పద్ధతిలో శాశ్వత ఎత్తుమడులపై ఆరుతడి వరి సాగుకు ఇటీవల శ్రీకారం చుట్టారు. చంద్రశేఖర్ స్వయంగా హాజరై రైతులకు, శాస్త్రవేత్తలకు మెళకువలు నేర్పించారు. ఇతర వివరాలకు.. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు (98485 73710)ను సంప్రదించవచ్చు.



దుక్కి చేయని సేద్యం దుఃఖం లేని భాగ్యం!

భూమిని పంట వేసిన ప్రతి సారీ దున్నకుండా వ్యవసాయం (నోటిల్లేజ్ / జీరోటిల్లేజ్ వ్యవసాయం) చెయ్యగలిగితే భూమి కోతను అరికట్టి భూసారాన్ని పెంపొందించుకోవటానికి అంతకుమించి మరో ఉత్తమ మార్గం ఉండదు. ఈ పద్ధతిని దీర్ఘకాలం సాగులో ఉండే పండ్ల తోటల్లో త్రికరణశుద్ధితో అనుసరించే ప్రకృతి/సేంద్రియ వ్యవసాయదారులు చాలా మంది కనిపిస్తుంటారు. అయితే, మూడు, నాలుగు నెలల్లో పూర్తయ్యే సీజనల్ పంటలను నోటిల్లేజ్ పద్ధతిలో శ్రద్ధగా సాగు చేసే రైతులు మాత్రం అత్యంత అరుదు. ఈ కోవకు చెందిన వారే చంద్రశేఖర్ హరి భడ్సావ్లే(74).

మహారాష్ట్ర రాయ్‌గడ్ జిల్లా కర్జత్ తాలూకాలోని దహివాలి సమీపంలో చంద్రశేఖర్ హరి భడ్సావ్లే వ్యవసాయ క్షేత్రం 'సగుణబాగ్' ఉంది. మహారాష్ట్రలో అగ్రిబిఎస్సీ చదివిన తర్వాత అమెరికాలో ఎం.ఎస్.(ఫుడ్ టెక్) చదువుకొని ఇంటికి తిరిగి వచ్చి.. 48 ఏళ్ల క్రితం వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టిన చంద్రశేఖర్ అప్పటి నుంచి మొక్కవోని దీక్షతో 55 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. సుదీర్ఘ సేద్య అనుభవాన్ని రంగరించి వెలువరించిన అనేక ఆవిష్కరణలతో ఎత్తుమడులపై నోటిల్లేజ్ సాగును ఈయన కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఆరుతడి వరి దగ్గర నుంచి పత్తి, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి పదికి పైగా పంటలను సాగు చేస్తూ రికార్డులు బ్రేక్ చేస్తున్నారు. ఒకటి తర్వాత మరొకటి పంటల మార్పిడి చేస్తూ ఖర్చుల్ని తగ్గించుకుంటూ దిగుబడులతోపాటు పనిలో పనిగా భూసారాన్ని సైతం పెంపొందిస్తున్నారు. తగుమాత్రంగా రసాయనిక ఎరువులతో పాటు కలుపు మందును వాడుతున్నారు. గత 12 ఏళ్లుగా నోటిల్లేజ్ సాగులో చక్కని ఫలితాలు సాధిస్తూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. ఈ సాగు పద్ధతిని ఇప్పుడు కనీసం మరో పది వేల మంది అనుసరిస్తున్నారు.

రసాయనాలు వాడకుండా పూర్తిగా ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించే సాగు పద్ధతిగా 'రీజెనరేటివ్ అగ్రికల్చర్' (పునరుజ్జీవన వ్యవసాయం) అనే మాట వాడుకలో ఉంది. అయితే, ఈ మాటకు తనదైన శైలిలో సరికొత్త అర్థం చెబుతున్నారు చంద్రశేఖర్.

ఎత్తుమడులపై ఆరుతడి పంట (వరి కావచ్చు, మరొకటి కావచ్చు) కోసిన తర్వాత మోళ్లు మిగులుతాయి. వాటి కింద నేలలో వేర్లుంటాయి. మరో పంట వేసుకోవటానికి వీలుగా ఈ మోళ్లను వదిలించుకొని శుభ్రం చేయటం ఎలాగన్నది పెద్ద సమస్య. అయితే, ఈ సమస్యనే చంద్రశేఖర్ అద్భుతమైన పరిష్కారంగా మార్చుకున్నారు. మోళ్లను వేర్లతో సహా పీకెయ్యటమో, కాల్చెయ్యటమో కాకుండా.. వాటిని ఒక చిన్న పనితో పొలంలో కురిసే వాన నీటిని అక్కడికక్కడే ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసేందుకు చక్కని సాధనంగా మార్చుకుంటున్నారు. మోళ్లపై కలుపుమందు చల్లటంతో నిర్జీవమవుతాయి. తిరిగి మొలకెత్తవు. కుళ్లిపోతాయి. అప్పుడు తదుపరి పంట విత్తనాలను మనుషులతోనో లేదా సీడ్ డిబ్లర్‌తోనో కోవచ్చు. మోళ్లు, వేర్లు కుళ్లిపోయి పోషకాలు పంటకు అందుబాటులోకి వస్తాయి. ఆఖాళీల ద్వారా వాన నీరు వేగంగా ఇంకుతుంటుంది. వేరు వ్యవస్థలో మట్టికి పుష్కలంగా గాలి, పోషకాలు అందుతాయి. సూక్ష్మజీవరాశి, వానపాములతో పాటు సేంద్రియ కర్బనం పెరుగుతుంది. పంట కోసిన తర్వాత మోళ్లపై కలుపు మందు చల్లుతున్న కారణంగానే ఈ ప్రక్రియ సౌలభ్యకరంగా, వేగవంతంగా జరుగుతోందని చంద్రశేఖర్ చెబుతారు. నోటిల్లేజ్ సాగు పద్ధతిలో ఇది అత్యంత కీలకమైన అంశమని ఆయన అంటున్నారు.



'సాక్షి సాగుబడి'తో ముచ్చటిస్తున్న చంద్రశేఖర్



136 సెం.మీ. దూరంలో మార్కింగ్ చేసుకొని.. 100 సెం.మీ. వెడల్పుతో శాశ్వత బెడ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. రెండు వైపులా కాలువలు ఉండాలి.



ఎస్.ఆర్.టి. ఫ్రేమ్‌తో బెజ్జాలు వేసుకొని బెడ్‌పై వరి విత్తనాలను 5 వరుసలుగా విత్తుకోవాలి. మొక్కలు, వరుసల మధ్య దూరం 25 సెం.మీ.లు.



కాలువల్లో నీరు పెట్టుకొని.. వరి విత్తనాలను ఇలా విత్తుకోవచ్చు..



విత్తనాలు వేసిన తర్వాత కలుపు మొలవకుండా ఎంపిక చేసిన గడ్డి మందును పిచికారీ చేయాలి.



వరి పంటలో నీటిని నిరంతరం నిల్వ ఉంచకూడదు. అవసరాన్ని బట్టి ఆరుతడులు ఇవ్వాలి. ఒక్కసారి మాత్రమే యూరియా వేయాలి.



మహారాష్ట్రలోని చంద్రశేఖర్ పొలంలో ఎత్తుమడులపై వరి పంట ఇది. పొలం అంతా ఒకే మాదిరిగా పెరిగి కోతకు సిద్ధమైన దృశ్యం.

'సగుణ'తో సకల ప్రయోజనాలు!

నేను అగ్రికల్చర్ బీఎస్సీ, అమెరికాలో ఎమ్మెస్ చదివి కూడా 48 ఏళ్లుగా 55 ఎకరాల్లో శ్రద్ధగా వ్యవసాయం చేస్తున్నా. గత పన్నెండేళ్లుగా ఎస్.ఆర్.టి. పద్ధతిలో దుక్కి దున్నకుండా వరుసగా అనేక పంటలు పండిస్తున్న అనుభవంతో చెబుతున్నా. నోటిల్లేజ్ సాగు రైతులకు సౌలభ్యకరంగా, అనేక రకాలుగా ప్రయోజనకరంగా ఉంది. ప్రతి పంటకూ ముందు, వెనుక దుక్కి దున్నటం వల్ల వానకు, గాలికి భూమి కోతకు గురై ఏటా హెక్టారుకు 20 టన్నుల మట్టి కొట్టుకుపోతోంది. దుక్కి చేయకుండా విత్తనాలు వేస్తున్నందు వల్ల సాయిల్ అగ్రిగేషన్ జరిగి పొలంలో మట్టి వానకు, గాలికి కొట్టుకుపోవటం ఆగిపోతుంది. రసాయనిక కలుపు మందులు వాడటం వల్ల కలుపు సమస్య తీరిపోతుంది. పాత పంటల మోళ్లు, వేర్లు కుళ్లటం వల్ల పోషకాల పునర్వినియోగం జరుగుతుంది. ఆ రంధ్రాల ద్వారా పొలంలోనే వాన నీటి సంరక్షణ అత్యంత సమర్థవంతంగా జరుగుతుంది. బెట్టను తట్టుకునే శక్తి పంటలకు కలుగుతుంది. నీటిని నిల్వగట్టే పద్ధతిలో సాగయ్యే వరి పొలం మాదిరిగా మిథేన్ వాయువు వెలువడదు. కాబట్టి, భూతాపం గణనీయంగా తగ్గుతుంది. కలుపు మందు వల్ల కలిగే నష్టంతో పోల్చితే రైతుకు, భూమికి, పర్యావరణానికి ఒనగూడే ప్రయోజనాలు చాలా ఎక్కువ.

నానా బాధలు పడి సాగు చేసే రైతు ఎప్పుడూ దుఃఖంతోనే ఉంటున్నాడు. ఎస్.ఆర్.టి. సాగు పద్ధతి వల్ల రైతులకు సంతోషం కలుగుతోంది. అగ్రిటూరిజం కూడా ఇందుకు తోడ్పడుతోంది. అందరూ ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. భూతాపాన్ని తట్టుకునే శక్తి, ఖర్చులు తగ్గించి, దిగుబడులు పెంచే శక్తి 'సగుణ' సాగు పద్ధతికి ఉందని నా అనుభవంలో రుజువైంది. శాశ్వత ఎత్తుమడులపై ఖరీఫ్‌లో వరిని ఆరుతడి పద్ధతుల్లో సాగు చేయటం, ఆ తర్వాత అవే మడులపై 2,3 పంటలుగా పప్పుధాన్యాలు/ నూనెగింజలు/ కూరగాయలను పంట మార్పిడి పాటిస్తూ సాగు చేస్తున్నాం. వరిలో ఖర్చు 29% తగ్గి దిగుబడి 61% పెరిగింది. పత్తి సాగు ఖర్చు 17% తగ్గి దిగుబడి 96% పెరిగింది. నాతో పాటు మహారాష్ట్రలోని పది వేల మంది రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. ఎవరైనా వచ్చి చూడొచ్చు.

– చంద్రశేఖర్ హరి భడ్సావ్లే (98222 82623).
సగుణ రీజెనరేటివ్ టెక్నిక్ ఆవిష్కర్త, రైతు శాస్త్రవేత్త, మహారాష్ట్ర
https://sagunafoundation.ngo/

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ పదవికి 291 దరఖాస్తులు

ఖాళీగా ఉన్న భారత సీనియర్ పురుషుల హెడ్ కోచ్ పదవి కోసం 291 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ జాబితాలో భారత జట్టు మాజీ సభ్యుడు, గతంలో మోహన్ బగాన్ క్లబ్, ఈస్ట్ బెంగాల్ క్లబ్ జట్లకు కోచ్‌గా ఉన్న స్టాన్లీ రోజారియో... నార్త్ ఈస్ట్ యునైటెడ్ క్లబ్ అసిస్టెంట్ కోచ్ నౌషాద్ మూసా కూడా ఉన్నారు. 64 ఏళ్ల రోజారియో సర్వీసెస్‌తో తన కోచింగ్ కెరీర్‌ను మొదలుపెట్టి 2006 నుంచి 2008 వరకు టీమిండియాకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించారు. ఈ నెలాఖరుకు కొత్త కోచ్‌ను నియమిస్తారు.

తొలి విజయం కోసం...

అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో భాగంగా మయన్మార్ జట్టుతో భారత జట్టు రెండు మ్యాచ్‌లు ఆడనుంది. యాంగూన్‌లో నేడు జరిగే తొలి మ్యాచ్‌లో ఆశాలతా దేవి సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుంది. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ కూడా టీమిండియాకు ప్రాతినిధ్యం వహించనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 67వ స్థానంలో ఉన్న భారత జట్టు ఇప్పటివరకు ఐదుసార్లు మయన్మార్ జట్టుతో తలపడినా ఒక్కసారీ విజయం సాధించలేదు. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా ఒక మ్యాచ్‌ను మాత్రం 'డ్రా' చేసుకుంది.





ఎమ్మా నవారో




కోకో గాఫ్

కోకో గాఫ్ పరాజయం

ఎమ్మా నవారో సంచలన విజయం

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మరో సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో ఇప్పటికే ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) ఇంటిముఖం పట్టగా... తాజాగా ప్రపంచ రెండో ర్యాంకర్, రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) కూడా ఈ జాబితాలో చేరింది. గత ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన 20 ఏళ్ల కోకో గాఫ్‌కు వింబుల్డన్ టోర్నీ మరోసారి కలిసిరాలేదు. ఐదో ప్రయత్నంలోనూ ఆమె ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేదు. అమెరికాకే చెందిన 23 ఏళ్ల ఎమ్మా నవారో ధాటికి కోకో గాఫ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 74 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 17వ ర్యాంకర్ ఎమ్మా నవారో 6-4, 6-3తో కోకో గాఫ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. నెట్ వద్దకు దూసుకొచ్చిన 9 సార్లూ పాయింట్లు నెగ్గిన నవారో ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-3, 3-0తో కలిన్‌స్కాయా (రష్యా; గాయంతో రెండో సెట్ మధ్యలో వైదొలిగింది)పై... 13వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 6-2, 6-3తో పుతింత్‌సెవా (కజకిస్తాన్)పై... స్వితోలినా (ఉక్రెయిన్) 6-2, 6-1తో జిన్‌యు వాంగ్ (చైనా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

నాలుగో సీడ్ జ్వెరెవ్‌కు షాక్



జ్వెరెవ్

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 3 గంటల 29 నిమిషాల్లో 4-6, 6-7 (4/7), 6-4, 7-6 (7/3), 6-3తో జ్వెరెవ్‌పై సంచలన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఎనిమిదో ప్రయత్నంలోనూ జ్వెరెవ్ వింబుల్డన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించలేకపోయాడు. ఇటలీ ప్లేయర్ లొరెంజో ముసెట్టి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తు, 98 కేజీల బరువున్న పెరికార్డ్ (ఫ్రాన్స్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ముసెట్టి 4-6, 6-3, 6-3, 6-2తో గెలిచాడు.

పతాకధారిగా సింధు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందాన్ని ముందుండి నడిపించనున్న స్టార్ షట్లర్

న్యూఢిల్లీ: వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ పతకంపై గురి పెట్టిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు గొప్ప గౌరవం లభించింది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొనే భారత క్రీడాకారుల బృందానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింధు నేతృత్వం వహించనుంది. విశ్వ క్రీడల్లో పతాకధారిగా వ్యవహరించనున్న సింధు భారత బృందాన్ని ముందుండి నడిపించనుంది. మరో ఫ్లాగ్ బేరర్‌గా తమిళనాడుకు చెందిన దిగ్గజ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ ఆచంట శరత్ కమల్ వ్యవహరిస్తాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 41 ఏళ్ల శరత్‌ను పతాకధారిగా గత మార్చి నెలలోనే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి.

విశ్వ క్రీడా వేదికపై లింగ సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ 2020 టోక్యో ఒలింపిక్స్ నుంచి ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయా దేశాలు పురుష ఫ్లాగ్ బేరర్‌తోపాటు ఒక మహిళా ఫ్లాగ్ బేరర్‌కు కూడా అవకాశం ఇవ్వాలనే నిబంధనను అమల్లోకి తెచ్చింది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ నుంచి హాకీ ప్లేయర్ మన్‌ప్రీత్ సింగ్, మహిళా బాక్సర్ మేరీకోమ్ పతాకధారులుగా వ్యవహరించారు. వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన ఏకైక భారత మహిళా క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన 29 ఏళ్ల సింధు 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో ఫ్లాగ్ బేరర్‌గా గౌరవం పొందింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన సింధు, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకుంది. పారిస్ క్రీడల్లోనూ సింధు పతకం సాధిస్తే ఒలింపిక్స్ చరిత్రలో మూడు వ్యక్తిగత పతకాలు నెగ్గిన ఏకైక భారతీయ ప్లేయర్‌గా సింధు రికార్డు సృష్టిస్తుంది. సింధు కంటే ముందు రెజ్లర్ సుశీల్ కుమార్ మాత్రమే ఒలింపిక్స్‌లో రెండు వ్యక్తిగత పతకాలుసాధించాడు.

చెఫ్ డి మిషన్‌గా గగన్ నారంగ్



మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడాకారుల బృందానికి చెఫ్ డి మిషన్‌గా తెలంగాణ షూటర్ గగన్ నారంగ్ వ్యవహరిస్తాడు. ముందుగా మేరీకోమ్‌ను చెఫ్ డి మిషన్‌గా ప్రకటించినా వ్యక్తిగత కారణాలరీత్యా ఈ బాధ్యతలు తీసుకోలేనని ఆమె ప్రకటించింది. దాంతో గగన్ నారంగ్‌కు చెఫ్ డి మిషన్ బాధ్యతలు అప్పగిస్తున్నామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది. చెఫ్ డి మిషన్ హోదాలో గగన్ ఒలింపిక్స్‌లో పాల్గొనే మొత్తం భారత క్రీడాకారుల వ్యవహారాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. 41 ఏళ్ల గగన్ నారంగ్ 2012 లండన్ ఒలింపిక్స్‌లో పురుషుల షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడు.



4 భారత్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనున్న నాలుగో మహిళా క్రీడాకారిణిగా పీవీ సింధు గుర్తింపు పొందనుంది. గతంలో ఈ ఘనత షైనీ విల్సన్, అంజూ బాబీ జార్జి, మేరీకోమ్‌లకు మాత్రమే దక్కింది. అథ్లెట్ షైనీ విల్సన్ 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో... లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జి 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో... బాక్సర్ మేరీకోమ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఫ్లాగ్ బేరర్స్‌గా ఉన్నారు.



ఫైనల్ బెర్త్ ఎవరిదో!

- నేడు 'యూరో' తొలి సెమీఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్ 'ఢీ'
- అర్ధరాత్రి గం. 12:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మ్యూనిక్: ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచి జోరు మీదున్న స్పెయిన్... నిలకడలేమితో సతమతమవుతున్న ఫ్రాన్స్... 'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఫైనల్లో చోటు కోసం నేడు తొలి సెమీఫైనల్లో 'ఢీ'కొననున్నాయి. సెమీఫైనల్ చేరే క్రమంలో స్పెయిన్ 11 గోల్స్ చేయగా... ఫ్రాన్స్ మూడు గోల్స్ సాధించింది. 'యూరో' టోర్నీ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య ఆరు మ్యాచ్‌లు జరిగాయి. నాలుగుసార్లు ఫ్రాన్స్ గెలుపొందగా...ఒక మ్యాచ్ 'డ్రా'గా ముగిసి, ఒక మ్యాచ్‌లో స్పెయిన్ నెగ్గింది.

శ్రీలంక హెడ్ కోచ్‌గా జయసూర్య

కొలంబో: తన క్రికెట్ కెరీర్‌లో ఇప్పటికే జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా... చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించిన శ్రీలంక మాజీ స్టార్ సనత్ జయసూర్య మరో కొత్త పాత్రలో కనిపించనున్నాడు. ఇటీవల కాలంలో ఆశించిన విజయాలు అందుకోలేకపోతున్న శ్రీలంక పురుషుల జట్టుకు తాత్కాలిక హెడ్ కోచ్‌గా 55 ఏళ్ల సనత్ జయసూర్యను నియమించారు. ఈనెలాఖరులో స్వదేశంలో భారత జట్టుతో జరిగే మూడు టి20, మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ నుంచి జయసూర్య హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. అనంతరం ఆగస్టు-సెప్టెంబర్‌లలో ఇంగ్లండ్‌లో జరిగే సిరీస్ వరకు అతను ఈ పదవిలో ఉంటాడు. గత నెలలో అమెరికా-వెస్టిండీస్‌లలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ పర్యవేక్షణలో శ్రీలంక జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. దాంతో సిల్వర్‌వుడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మెగా ఈవెంట్ సందర్భంగా లంక జట్టుకు జయసూర్య క్రికెట్ కన్సల్టెంట్‌గా పని చేశాడు. జయసూర్య 1989 నుంచి 2011 మధ్యకాలంలో శ్రీలంక జట్టు తరఫున 110 టెస్టులు ఆడి 6973 పరుగులు... 445 వన్డేలు ఆడి 13430 పరుగులు... 31 టి20 మ్యాచ్‌లు ఆడి 629 పరుగులు సాధించాడు. అంతేకాకుండా మూడు ఫార్మాట్‌లలో కలిపి మొత్తం 440 వికెట్లు కూడా పడగొట్టాడు. 1996 వన్డే ప్రపంచకప్ టైటిల్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన జయసూర్య 2010 నుంచి 2015 వరకు శ్రీలంక పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించాడు.

గ్లోబల్ చెస్ లీగ్‌లో అశ్విన్

అమెరికన్ గ్యాంబిట్స్ జట్టుకు సహ యజమానిగా భారత క్రికెటర్



న్యూఢిల్లీ: భారత సీనియర్ స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ చెస్‌లో అడుగు పెట్టాడు. గ్లోబల్ చెస్ లీగ్‌లో ఈసారి కొత్తగా చేరిన అమెరికన్ గ్యాంబిట్స్ జట్టుకు అశ్విన్ సహ యజమానిగా ఉన్నాడు. గత ఏడాది పోటీపడిన చింగారీ గల్ఫ్ టైటాన్స్ జట్టు స్థానంలో కొత్తగా అమెరికన్ గ్యాంబిట్స్ జట్టు వచ్చింది. టెక్ మహీంద్రా, అంతర్జాతీయ చెస్ సమాఖ్యసంయుక్త ఆధ్వర్యంలో గత ఏడాది దుబాయ్‌లో తొలి గ్లోబల్ చెస్ లీగ్ జరిగింది. ఈ ఏడాది టోర్నీకి లండన్ నగరం వేదిక కానుంది. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు ఆరు జట్ల మధ్య గ్లోబల్ చెస్ లీగ్ రెండో ఎడిషన్ జరగనుంది.

సమం కోసం చివరి పోరు

- నేడు దక్షిణాఫ్రికాతో భారత మహిళల టి20 మ్యాచ్
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: దక్షిణాఫ్రికా జట్టుపై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి... ఏకైక టెస్టులోనూ ఘనవిజయం సాధించిన భారత మహిళల జట్టుకు టి20 సిరీస్ కలిసి రాలేదు. తొలి మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి రెండో టి20లో విజయలక్ష్మిన్ని ఛేదించేందుకు వరుణుడు అవకాశం ఇవ్వలేదు. దాంతో రెండో టి20 ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నేపథ్యంలో నేడు జరిగే చివరిదైన మూడో టి20లో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని టీమిండియా పట్టుదలతో ఉంది. అయితే మంగళవారం కూడా వర్ష సూచన ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత బౌలర్లు రాణించలేకపోయారు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే చివరి మ్యాచ్‌లో భారత బౌలర్ల నుంచి కట్టుదిట్టమైన బౌలింగ్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆశిస్తోంది.

సినిమా

భారతీయుడు సందేశం సమాజానికి చేరాలి

- కమల్‌హాసన్



● శంకర్, కమల్‌హాసన్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్

''ప్రపంచంలో జనాభా పెరుగుతున్న కొద్దీ కరప్షన్ పెరిగిపోతోంది. లంచాల నిర్మూలనకు మనం గట్టిగా ప్రయత్నించడం లేదు. ఈ అంశాలతో రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. ఈ సినిమాలోని సందేశం సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరాలి'' అని కమల్‌హాసన్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన చిత్రం 'భారతీయుడు 2'. సిద్ధార్థ్, బాబీ సింహా, రకుల్‌ప్రీత్ సింగ్ ఇతర పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్తానీ 2' పేరుతో ఈ నెల 12న విడుదల కానుంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ లక్ష్మి మూవీస్ విడుదల చేస్తున్నాయి. సోమవారం జరిగిన సమావేశంలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''నా కెరీర్ ఆరంభంలో తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో సినిమాలు చేసినా సరైన హిట్టు పడలేదు. తెలుగులో నాకు 'మరోచరిత్ర, ఆకలి రాజ్యం, సాగర సంగమం, స్వాతి ముత్యం' వంటి ఎన్నో హిట్స్ వచ్చాయి. తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ని చేశారు. బాలచందర్‌గారు, విశ్వనాథ్‌గారు నన్నెంతో ప్రోత్సహించారు'' అన్నారు. ''భారతీయుడు'కి సీక్వెల్ తీయాలని ముందు అనుకోలేదు. అయితే కరప్షన్ వార్తలు చదివినప్పుడు నాకు సేనాపతి గుర్తుకు వచ్చేవాడు. ఆ ఆలోచనతో 'భారతీయుడు 2' తీశాను'' అన్నారు శంకర్. ''వినోదం, సందేశంతో తీసే సినిమాలు అద్భుతంగా ఉంటాయి. 'భారతీయుడు'ని తెలుగులో భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత సురేష్‌బాబు.




● మహేశ్‌బాబు

విలన్‌గా కూడా..?

మహేశ్‌బాబు విలన్ పాత్రలో కనిపిస్తే ఎలా ఉంటారు? అనే చర్చ జరుగుతోంది. ఈ చర్చకు కారణం లేకపోలేదు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మహేశ్ రెండు పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకటి హీరో పాత్ర అన్నది కన్ఫార్మ్. రెండోది విలన్ అని సమాచారం. కాగా విలన్ పాత్రకు మలయాళ నటుడు పృథ్వీరాజ్‌ని అనుకున్నారనే వార్త వచ్చింది. ఆ తర్వాత విక్రమ్ పేరు వినిపించింది. అయితే ఈ రెండు పాత్రలనూ మహేశ్‌బాబుతోనే చేయించాలని రాజమౌళి అనుకుంటున్నారట. ఆఫ్రికాలోని అమేజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మహేశ్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ మధ్య కండలు తిరిగిన దేహం, కాస్త లెంగ్తీ హెయిర్, గడ్డంతో కొత్తగా కనిపిస్తున్నారు మహేశ్. రాజమౌళి సినిమా కోసమే ఇలా మేకోవర్ అయ్యారని సమాచారం. త్వరలో ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలని అనుకుంటున్నారు. మరి... ఈ సినిమాలో మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? అదే నిజమైతే హీరో... విలన్‌గానా? లేక రెండు పాజిటివ్ క్యారెక్టర్సా? అనేది తెలియాల్సి ఉంది.

శ్రీలంకలో ఫైట్

ఫైట్ చేయడానికి ఇండియా నుంచి శ్రీలంక వెళ్లారు విజయ్ దేవరకొండ. అయితే ఇది సినిమా ఫైట్. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ని శ్రీలంకలో ప్లాన్ చేసింది యూనిట్. ఈ చిత్రీకరణలో పాల్గొనడానికే విజయ్ దేవరకొండ శ్రీలంక వెళ్లారు. అక్కడ ఓ భారీ రిస్క్ ఫైట్‌ని చిత్రీకరించనున్నారని సమాచారం. దాదాపు ఇరవై రోజుల పాటు శ్రీలంక షెడ్యూల్ జరుగుతుందట. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారు.



● విజయ్ దేవరకొండ

దేవసేన శోభ

హీరో మంచు మనోజ్, మౌనిక దంపతుల కుమార్తె నామకరణం జరిగింది. ఏప్రిల్ 13న మౌనిక పాపకి జన్మనిచ్చారు. తమ కుమార్తెకు దేవసేన శోభ ఎం ఎం అంటూ నామకరణం చేశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు మనోజ్. ''ఆ పరమేశ్వరుడి భక్తులమైన మేము సాక్షాత్తు శివుని తనయుడైన సుబ్రహ్మణ్య స్వామి సతీమణి దేవసేన పేరును మా పాపకు పెట్టుకున్నాం. మా అత్తగారు దివంగత శోభా నాగిరెడ్డిగారి పేరు నుంచి శోభ పేరును తీసుకున్నాం. ఇప్పటికే ఎంఎం పులి అనే ముద్దు పేరు ద్వారా మా బిడ్డ అందరికీ బాగా తెలుసు. ఇవన్నీ కలిపి దేవసేన శోభ ఎంఎం అని నామకరణం చేశాం. మా జీవితంలో అండగా ఉంటూ మాకు కొండంత బలంగా నిలుస్తున్న మా తల్లిదండ్రులు నిర్మలా దేవి, మోహన్‌బాబు, మా అత్తమామలు శోభ, నాగిరెడ్డిల ఆశీస్సులు మాకెప్పుడూ ఉంటాయి. ప్రతి విషయంలో నాకు తోడుగా ఉంటున్న మా అక్క లక్ష్మికి ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు మనోజ్.



● మోహన్‌బాబు, మనోజ్, మౌనిక

పవర్‌ఫుల్ పోలీస్

ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటించిన చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహించారు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్.



● 'షణ్ముఖ' పోస్టర్

ఈ సందర్భంగా షణ్ముగం సాప్పని మాట్లాడుతూ– ''డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందించాం. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటించారు. ఈ మూవీ తన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. 'కేజీఎఫ్, సలార్' చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి అద్భుతమైన మ్యూజిక్‌ను అందించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ మూవీని అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.



● మంచు విష్ణు, హేమ

నా సభ్యత్వం పునరుద్ధరించాలి

- హేమ

బెంగళూరులో మే 19న జరిగిన రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టు కావడం, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) హేమ ప్రాథమిక సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. కాగా తన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటూ తాజాగా హేమ ఓ లేఖ రాశారు. ఈ లేఖని 'మా' వ్యవస్థాపకుడు చిరంజీవికి పంపడంతో పాటు ప్రస్తుత 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకి స్వయంగా అందించారు. ''దాదాపు పదేళ్ల పాటు నేను 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. నెలరోజుల క్రితం జరిగిన ఒక రేవ్ పార్టీలో నేను పాల్గొని, మత్తు పదార్థాలు తీసుకున్నానని నాపై దుష్ప్రచారం చేశారు. దీంతో నా కుటుంబ సభ్యులకు తీవ్రమైన వేదన మిగిలింది. నాపై వచ్చిన ఆరోపణలతో 'మా' సభ్యత్వాన్ని సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయం నాలో అంతులేని ఆవేదనను కలిగించింది. 'మా' బైలాస్ ప్రకారం ముందుగా నాకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి. నా వివరణలో లోపాలు ఉంటే నాపై చర్యలు తీసుకోవాలి. ఎలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం తగదు. నా సస్పెన్షన్‌ను ఎత్తివేసి నా సభ్యత్వాన్ని పునరుద్ధరించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. దానివల్ల నేను ఇబ్బందులపాలవుతున్నాను. వాటినుంచి రక్షించాల్సిన బాధ్యత 'మా'పై ఉంది'' అని ఆ లేఖలో పేర్కొన్నారు హేమ. ఆమె లేఖపై 'మా' ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రవి సిరోర్, నివిష్కా పాటిల్ జంటగా ఎస్‌జీఆర్ దర్శకత్వం వహించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఎవరు ఎందుకు..?'. జి. వెంకటేశ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను దివంగత నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ– ''వెంకటేశ్ రెడ్డి ఎప్పటి నుంచో ప్రభాస్ అభిమానిగా ఉన్నారు. ఆయన నిర్మాతగా మారడం సంతోషంగా ఉంది. ప్రభాస్ ఫ్యాన్స్ నుంచి ఇంకా దర్శకులు, నిర్మాతలు, యాక్టర్స్ రావాలి'' అన్నారు. ''మంచి ఎమోషనల్ ఫ్యామిలీ సబ్జెక్ట్ ఇది'' అన్నారు వెంకటేశ్ రెడ్డి. ''మంచి ఫ్యామిలీ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో మూడు పాటలు నేనే రాశాను. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఎస్‌జీఆర్. ఈ సినిమాకు సహ-నిర్మాతలు: పీడీఆర్ ప్రసాద్ రెడ్డి, కె. వినయ్ రెడ్డి.



● శ్యామలాదేవి, వెంకటేశ్ రెడ్డి

భాస్కర్ డేట్ ఫిక్స్




● దుల్కర్ సల్మాన్

భాస్కర్‌గా దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో కనిపించనున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. 1980-90ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఒక సాధారణ బ్యాంక్ క్యాషియర్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సెప్టెంబర్ 7న 'లక్కీ భాస్కర్'ని రిలీజ్ చేయనున్నట్లు సోమవారం యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ''ముంబైలోని బ్యాంకులో పని చేసే క్యాషియర్‌గా కనిపిస్తారు దుల్కర్. నాటి ముంబై నగరాన్ని, భారీ బ్యాంకు సెట్‌ని హైదరాబాద్‌లో రూపొందించాం. భాస్కర్ అసాధారణ ప్రయాణంలో ప్రేక్షకులు లీనమైపోతారు'' అని యూనిట్ పేర్కొంది.

చతుర్.. వితుర్

అనసూయ భరద్వాజ్, సాయికుమార్, వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, శ్రీకాంత్ అయ్యంగార్, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించిన 'అరి' త్వరలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో చతుర్, వితుర్ అనే పండితుల పాత్రల్లో శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర నటించారు. వారి క్యారెక్టర్స్ ఫస్ట్ లుక్‌ను సోమవారం చిత్రబృందం విడుదల చేసింది.



● శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 36	నిఫ్టీ ▽ 3
79,960	24,321

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,401	△ 49
డోజోన్స్	39,341	▽ 35
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,193	▽ 10
డాక్స్	18,472	▽ 3
షాంఘై	2,922	▽ 27
నికాయ్	40,781	▽ 132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో


ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,746
బంగారం (99.5 స్వచ్ఛత)	72,455
వెండి (కిలో)	91,733

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బీఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

డిస్కౌంట్ల షికారు!

కార్ల కంపెనీల ఆఫర్ల 'వర్షం'
- భారీగా ధరల తగ్గింపు...
- ఆకర్షించే ఎక్స్ఛేంజ్ స్కీమ్‌లు
- రాత్రి వరకు షోరూమ్‌లు బార్లా
- సేల్స్ పెంచుకునే వ్యూహాలు



వానాకాలం వచ్చేసింది. దీనికి తోడు కార్ల కంపెనీల ఆఫర్ల వర్షం కూడా మొదలైపోయింది. అయితే, ఈ ఏడాది డిస్కౌంట్ల మోత మరింతగా మోగుతోంది. సార్వత్రిక ఎన్నికలు, మండుటెండల దెబ్బకు వేసవి సీజన్‌లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేవు. షోరూమ్‌లకు కస్టమర్ల రాక కూడా భారీగా తగ్గిపోయింది. మరోపక్క, వర్షాకాలంలో విక్రయాల తగ్గుదల కూడా పరిపాటే. ఈ పరిస్థితిని మార్చేందుకు, ఏదో రకంగా విక్రయాలు పెంచుకునేందుకు కంపెనీలు పలురకాల వ్యూహాలను అమలు చేస్తున్నాయి. భారీ డిస్కౌంట్ ధరలతో ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ప్రారంభ స్థాయి మోడళ్లపై ఎక్కువ డిస్కౌంట్‌లు ఆఫర్ చేస్తున్నాయి. పాత కార్ల ఎక్స్ఛేంజ్‌పై మంచి ధర, అదనపు బోనస్, బహుమతులను కూడా అందిస్తున్నాయి.

బలహీన సీజన్...

పండుగలు పెద్దగా లేకపోవడంతో పాటు, వర్షాలు ఎప్పుడు పడతాయో ఊహించని పరిస్థితులు ఉంటాయి. దీంతో కస్టమర్లు ఈ సీజన్‌లో కొనుగోళ్ల ప్రణాళికలను వాయిదా వేసుకుని.. దసరా, దీపావళి సమయాల్లో కొనుగోళ్లకు మొగ్గుచూపిస్తుంటారు. అందుకే ఏటా వర్షాకాలంలో అమ్మకాలు పెంచుకునేందుకు దేశవ్యాప్తంగా డీలర్లు డిస్కౌంట్లు, ఇతరత్రా స్కీమ్‌లను అమలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు మోడల్ కార్లపై రూ.20 వేల నుంచి రూ.4 లక్షల వరకు తగ్గింపు ఆఫర్లు అమల్లో ఉన్నాయి. ముఖ్యంగా గతేడాది వర్షాకాలం కంటే ఈ ఏడాది డిస్కౌంట్లు కూడా పెరిగాయి. వేసవిలో విక్రయాలు తగ్గడంతో డీలర్ల వద్ద వాహన నిల్వలు పేరుకుపోయాయి. వీటిని తగ్గించుకోవాలంటే డీలర్లు విక్రయాలు పెంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

డబుల్ బెనిఫిట్...

డిమాండ్ పెంచేందుకు కార్ల కంపెనీలు.. స్టాక్‌ను తగ్గించుకునేందుకు డీలర్ల స్థాయిలోనూ డిస్కౌంట్ ఆఫర్లు నడుస్తున్నాయి. 'గతేడాది ఇదే సీజన్‌లో కొన్ని కార్ల మోడళ్లకు కొరత నెలకొంది. వెయిటింగ్ వ్యవధి కూడా పెరిగింది. కానీ, ఈ ఏడాది చాలా మోడళ్లు డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇదే కస్టమర్లకు ఆఫర్లు పెంచేందుకు కారణం' అని ఫాడా ప్రెసిడెంట్ మనీష్‌రాజ్ సింఘానియా తెలిపారు. మారుతీ ఆల్టో కే10పై రూ.40 వేలు, ఎస్-ప్రెస్సో, వ్యాగన్‌ఆర్‌పై రూ.25,000-30,000, స్విఫ్ట్ మోడళ్లపై రూ.15,000-20,000 వరకు తగ్గింపు ఆఫర్లు నడుస్తున్నాయి. బాలెనో పెట్రోల్ ఎంటీ వెర్షన్‌పై రూ.35 వేలు, పెట్రోల్ ఏజీఎస్ వెర్షన్‌పై రూ.40 వేల వరకు, ఎక్స్ఎల్6 పెట్రోల్ వేరియంట్‌పై 20 వేలు, సీఎన్‌జీ వేరియంట్‌పై రూ.15 వేల వరకు తగ్గింపు లభిస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఉచిత విదేశీ ట్రిప్..!

'హోండా మ్యాజికల్ మాన్సూన్' పేరుతో హోండా కార్స్ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. అన్ని కార్లపై బహుమతులు, ఇతర ప్రయోజనాలను ఇందులో భాగంగా అందిస్తోంది. ముఖ్యంగా జూలై నెలలో కొనుగోలుదారుల నుంచి విజేతలను ఎంపిక చేసి, వారికి స్విట్జర్లాండ్ ఉచిత పర్యటన, రూ.75,000 వరకు నగదు బహుమతులను ఆఫర్ చేస్తోంది. హోండా కారు కొనుగోలుపై ఈ పరిమిత కాల ఆఫర్ తమ డీలర్లందరి వద్దా అందుబాటులో ఉన్నట్టు హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు.



బ్లాక్‌స్టోన్ చేతికి హల్దీరామ్స్!

- మెజారిటీ వాటా కొనుగోలుకు రెడీ
- కంపెనీ విలువ రూ. 70,000 కోట్లుగా అంచనా



న్యూఢిల్లీ: స్నాక్స్ తయారీ దిగ్గజం హల్దీరామ్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకి ప్రయివేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఇప్పటికే ప్రారంభించిన చర్చలు తుది దశకు చేరినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, సింగపూర్ సంస్థ జీఐసీతో జత కట్టిన బ్లాక్‌స్టోన్ కొద్ది నెలలుగా హల్దీరామ్స్ ప్రమోటర్లు అగర్వాల్ కుటుంబంతో చర్చలు నిర్వహిస్తున్నట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. అయితే బిజినెస్ విలువ విషయంలో అంగీకారం కుదరకపోవడంతో చర్చలు నిలిచిపోయాయి. కాగా.. స్నాక్స్ విభాగంలో దేశీయంగా ప్రధాన కంపెనీగా నిలుస్తున్న హల్దీరామ్స్‌లో నియంత్రిత వాటాను సొంతం చేసుకునేందుకు బ్లాక్‌స్టోన్ ఇంక్ ప్రస్తుతం చర్చల్లో ఇటీవల పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఒక అంచనా ప్రకారం రూ. 70,000 కోట్ల విలువలో హల్దీరామ్స్ కొనుగోలుకి డీల్ కుదిరే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

76%పై కన్ను

హల్దీరామ్స్‌లో 76 శాతం వాటా కొనుగోలుపై బ్లాక్‌స్టోన్ కన్సార్షియం కన్నేసినట్లు తెలుస్తోంది. అయితే అగర్వాల్ కుటుంబం భారీ వాటా విక్రయానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కంపెనీ విలువ నిర్ధారణలోనూ అంగీకారం కుదరనట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రమోటర్లలో కొంతమంది 51 శాతం వాటా విక్రయానికి మాత్రమే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశాయి. ఒకవేళ బ్లాక్‌స్టోన్‌తో ఒప్పందం కుదిరితే దేశీయంగా అతిపెద్ద పీఈ డీల్‌గా చరిత్ర సృష్టించే వీలున్నట్లు పేర్కొన్నాయి. చర్చలు ఏక్షణమైనా విఫలమైతే ఇతర ప్రత్యామ్నాయాలను సైతం అగర్వాల్ కుటుంబం సిద్ధం చేసుకుంటున్నట్లు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే పబ్లిక్ ఇష్యూకి సైతం తెరతీసే యోచనలో ఉన్నట్లు తెలియజేశాయి. అగర్వాల్ కుటుంబం ఢిల్లీ, నాగ్‌పూర్ బ్రాంచీల ఎఫ్ఎంసీజీ బిజినెస్‌ను విలీనం చేసే ప్రణాళికల్లో ఉంది. హల్దీరామ్ స్నాక్స్ పీవీటీ లిమిటెడ్, హల్దీరామ్ ఫుడ్స్ ఇంటర్నేషనల్ పీవీటీ లిమిటెడ్ విలీనం ద్వారా హల్దీరామ్ స్నాక్ ఫుడ్స్ పీవీటీ లిమిటెడ్‌గా ఏర్పాటు చేయనుంది. ఈ కంపెనీలో ఢిల్లీ బ్రాంచ్ 56 శాతం, నాగ్‌పూర్ బ్రాంచ్ 44 శాతం చొప్పున వాటాను తీసుకోనున్నాయి.

కాంపిటీషన్ కమిషన్ అనుమతి

విలీనానికి ఇప్పటికే కాంపిటీషన్ కమిషన్ అనుమతించింది. బ్లాక్‌స్టోన్ కన్సార్షియం 8-8.5 బిలియన్ డాలర్ల విలువను మదింపు చేయగా.. అగర్వాల్ కుటుంబం 12 బిలియన్ డాలర్లను ఆశిస్తోంది. కాగా, హల్దీరామ్స్‌లో వాటాకు బెయిన్ అండ్ కంపెనీ, టెమాసెక్ హోల్డింగ్స్ సైతం బిడ్స్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

హెచ్‌సీఎల్ రోష్ని నాడార్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రాను .. ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. వ్యాపార, పర్యావరణ అనుకూల రంగాల్లో చేస్తున్న కృషికి గాను ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన 'షెవాలీర్ డి లా లెజియన్ డి హానర్' ('నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్') లభించినట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పురస్కారాన్ని అందుకోవడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, భారత్ .. ఫ్రాన్స్ మధ్య పటిష్టమైన భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని రోష్ని తెలిపారు. తమకు కీలక మార్కెట్లలో ఒకటైన ఫ్రాన్స్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నామని ఆమె పేర్కొన్నారు.

మెర్సిడెస్ ఈవీ @ 66 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లో ఈక్యూఏ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.66 లక్షలు. కంపెనీ నుంచి చిన్న, అందుబాటు ధరలో లభించే ఎలక్ట్రిక్ వెహికల్ ఇదే. 70.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 560 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 8.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ఠ వేగం గంటకు 160 కిలోమీటర్లు. ఏడు ఎయిర్‌బ్యాగ్స్ ఏర్పాటు చేశారు. జీఎల్ఏ ప్లాట్‌ఫామ్‌పై రూపుదిద్దుకున్న ఈ కాంపాక్ట్ క్రాస్‌ఓవర్ మెర్సిడెస్ నుంచి భారత్‌లో నాల్గవ బ్యాటరీ ఎలక్ట్రిక్ కారు. 2024 చివరినాటికి మరో రెండు ఈవీలు రానున్నాయి. తొలిసారిగా లగ్జరీ కార్ల కొనుగోలుదారులను ఆకర్షించడానికి ఎలక్ట్రిక్ ఎంట్రీ-లెవల్ మోడళ్లను కంపెనీ పరిచయం చేస్తోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు.

సూచీలకు స్వల్ప నష్టాలు

- గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ
- మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు



ముంబై: స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే అంశాలేవీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు స్థిరీకరణలో భాగంగా రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ 36 పాయింట్లు నష్టపోయి 79,960 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 265 పాయింట్లు పతనమై 79,732 వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ మూడు పాయింట్లు నష్టపోయి 24,321 వద్ద నిలిచింది. కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్, టెలికం, సర్వీసెస్, ఫార్మా, ఆటో షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. పేటీఎంను 100 బిలియన్ డాలర్ల సంస్థగా తీర్చిదిద్దడమే తన ఆశయమని వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ వ్యాఖ్యలతో కంపెనీ షేరు 8% పెరిగి రూ.472 వద్ద స్థిరపడింది.

జూలై 14 వరకే జోయాలుక్కాస్ ఆఫర్

హైదరాబాద్: బంగారం, వజ్రాలు, ప్రెషస్, వెండి ఆభరణాల మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50% తగ్గింపు 'అతుల్యమైన జ్యూవెలరీ సేల్' ఆఫర్ జూలై 14న ముగుస్తుందని జోయాలుక్కాస్ తెలిపింది. ఈ జూన్‌లో ప్రకటించిన ఈ ఆఫర్ ఎంతోమంది దృష్టిని ఆకర్షించిందని పేర్కొంది. కేవలం కొన్ని రోజులే ఉండటంతో ప్రతి ఒక్కరూ ఆఫర్‌ను ఉపయోగించుకోవాలని కంపెనీ ఎండీ జోయ్ అలుక్కాస్ కోరారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
4 కంపెనీల ఐపీవోలకు ఓకే | ద్విచక్ర వాహన విక్రయాల జోరు


భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ టెట్ జూలై-2024



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన పాఠశాల విద్యాశాఖ.. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ జూలై-2024)నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

పేపర్-1 ఏ ఎస్‌జీటీ టీచర్లకు, పేపర్-1 బీ ప్రత్యేక విద్య ఎస్‌జీటీ టీచర్లకు,పేపర్-2 ఏ స్కూల్ అసిస్టెంట్లకు, పేపర్-2 బీ ప్రత్యేక విద్య స్కూల్ అసిస్టెంట్లకు పరీక్ష నిర్వహిస్తారు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ భాష నైపుణ్య పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5వ తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి), 6 నుంచి 8వ తరగతుల బోధనకు పేపర్-2 (ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది. టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.

- **అర్హత:** పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ లేదా తత్సమానం ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు అర్హులే.
- **పరీక్ష విధానం:** పేపర్-1 ఏ, పేపర్-1 బీ ఐదు విభాగాల్లో 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్-2 ఏ, పేపర్-2 బీ నాలుగు విభాగాల్లో మొత్తం 150 ప్రశ్నలకు-150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ఉంటుంది. రోజుకు రెండు సెషన్లలో ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.07.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.08.2024.
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 22.09.2024 నుంచి ప్రారంభం
- **పరీక్షల తేదీలు:** 03.10.2024 నుంచి 20.08.2024 వరకు
- **వెబ్‌సైట్:** https://aptet.apcfss.in

టీఎస్ సెట్-2024

ఉస్మానియా యూనివర్సిటీ.. తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్ సెట్)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత పరీక్షగా టీఎస్ సెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

- **సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్-అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లిష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, హిందీ, హిస్టరీ, లా, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ,ఎంఎస్సీ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ). రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- **పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్, రంగారెడ్డి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము రూ.2000 + రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తులకు చివరితేది:**16.07.2024
- **ఆలస్య రుసుము రూ.3000 రిజిస్ట్రేషన్ ఫీజుతో దరఖాస్తులకు చివరితేది:**26.07.2024
- **దరఖాస్తుల్లో మార్పులకు అవకాశం:** 28.07.2024, 29.07.2024.
- **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ ప్రారంభం:**20.08.2024
- **పరీక్ష తేదీలు:** 28.08.2024, 29.08.2024, 30.08.2024, 31.08.2024.
- **వెబ్‌సైట్:** http://telanganaset.org

పదితో పదిలమైన కొలువు

» ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» మొత్తం 8,326 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» పే లెవల్-1తో ప్రారంభ వేతన శ్రేణి

పదో తరగతి మొదలు ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకూ.. ప్రభుత్వ ఉద్యోగం ప్రతి ఒక్కరి స్వప్నం! అందులోనూ కేంద్ర ప్రభుత్వ కొలువుల పట్ల క్రేజ్ మాటల్లో చెప్పలేనిది!! పదో తరగతి అర్హతతోనే వివిధ పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. మొత్తం 8,326 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ-ఎంటీఎస్(మల్టీ టాస్కింగ్ స్టాఫ్), హవాల్దార్ నోటిఫికేషన్-2024 వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



భారీ సంఖ్యలో పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్-ఎంటీఎస్, హవాల్దార్-2024 నోటిఫికేషన్ ద్వారా.. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో భారీ సంఖ్యలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మొత్తం 4,887 మల్టీ టాస్కింగ్ (నాన్-టెక్నికల్)పోస్టులను;సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ),సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ (సీబీఎన్) విభాగాల్లో 3,439 హవాల్దార్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

తెలుగు రాష్ట్రాల్లో 242 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ఎంటీఎస్, హవాల్దార్ నోటిఫికేషన్‌లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 61 ఎంటీఎస్ పోస్టులు, విశాఖపట్నం సీజీఎస్‌టీలో 60 హవాల్దార్ పోస్టులు ఉన్నాయి. తెలంగాణలో 63 ఎంటీఎస్, హైదరాబాద్ సీజీఎస్‌టీ 58 హవాల్దార్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తంగా 242 పోస్టులను ఏపీ, తెలంగాణకు కేటాయించారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న రీజియన్, పోస్టులను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు తమ రీజియన్‌తో సంబంధం లేకుండా.. దేశంలో ఎక్కడైనా పని చేయాల్సిన విధంగా సర్వీస్ నిబంధనలు ఉంటాయి.

అర్హతలు

2024,ఆగస్టు 1 నాటికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:**ఎంటీఎస్ పోస్టులకు 18-25 ఏళ్లు, హవాల్దార్ పోస్టులకు, అదే విధంగా పలు శాఖల్లోని ఎంటీఎస్ పోస్టులకు 18-27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు,పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 10 ఏళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మూడు దశల్లో అభ్యర్థుల ప్రతిభను పరిశీలిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఎంటీఎస్ పోస్టులకు కేవలం రాత పరీక్ష ఉంటుంది. హవాల్దార్ పోస్టులకు మాత్రం ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.

రెండు సెషన్లలో రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలిదశలో నిర్వహించే రాత పరీక్ష రెండు సెషన్లుగా 270మార్కులకు ఉంటుంది. సెషన్-1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు-60 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు; అదేవిధంగా సెషన్-2లో జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-75 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-75 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరుగుతుంది. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సెషన్‌కు కేటాయించిన సమయం 45 నిమిషాలు. రెండో సెషన్‌లో మాత్రం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది.

పీఈటీ, పీఎస్‌టీ

- రాత పరీక్షల్లో చూపిన ప్రతిభ ఆధారంగా.. హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు మలి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లను నిర్వహిస్తారు.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నడక పరీక్ష ఉంటుంది. ఇందులో పురుష అభ్యర్థులు 1,600 మీటర్లను 15 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.
- **ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో.. హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీమీటర్లు విస్తరించాలి.
- మహిళా అభ్యర్థులు కనీసం 152 సెం.మీ ఎత్తు ఉండాలి.

కనీస అర్హత మార్కులు

రాత పరీక్ష నుంచి అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేసే క్రమంలో కనీస అర్హత మార్కుల నిబంధన విధించారు. ప్రతి సెషన్‌లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 25 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. అదే విధంగా సెషన్-1లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే..సెషన్-2 పేపర్ల మూల్యాంకన చేస్తారు. సెషన్-2లో పొందిన ప్రతిభ ఆధారంగానే తుది జాబితా రూపొందిస్తారు.

ప్రారంభ వేతనం

ఎంపికైన అభ్యర్థులకు ప్రారంభంలోనే పే లెవల్-1తో రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణిలో నెల వేతనం అందుకోవచ్చు. బేసిక్ పేతో పాటు ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. దీంతో పాటు అర్హతలు పెంచుకుంటూ సంబంధిత డిపార్ట్‌మెంట్‌లు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణతతో ఆయా శాఖల్లో సెక్షన్ ఆఫీసర్, సూపరింటెండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 31
- **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరి తేది:** 01.08.2024
- **దరఖాస్తుల సవరణకు అవకాశం:** ఆగస్టు 16, 17 తేదీల్లో
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:**అక్టోబర్/నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**www.ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

న్యూమరికల్, మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఇందులో రాణించడానికి అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై పట్టు సాధించాలి.

రీజనింగ్ ఎబిలిటీ

సింబల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేలో.. చరిత్ర-ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు-వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

అభ్యర్థులు గ్రామర్‌పై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.

రివిజన్, మాక్ టెస్టులు

అభ్యర్థులు నిరంతరం పునశ్చరణ కొనసాగించాలి. నమూనా పరీక్షలు, మాక్ టెస్టులకు హాజరవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో.. అర్థమెటిక్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటిద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్, ప్రాక్టీస్ చేయాలి.

క్లుప్తంగా...

దక్షిణ మధ్య రైల్వే డీజీఎంగా ఉదయనాథ్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కోట్ల ఉదయనాథ్ సోమవారం రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్ 2012 బ్యాచ్‌కు చెందినవారు. ఉదయనాథ్ స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రైల్వేలో ఆర్థిక నిర్వహణ, అకౌంటెన్సీలో అపారమైన అనుభవం ఉంది. ఈ నియామకానికి ముందు, దక్షిణ మధ్య రైల్వేలోని కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ అకౌంట్స్ అధికారిగా పనిచేశారు. పదేళ్లుగా సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్‌గా, నాందేడ్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్‌గా కీలక విధులు నిర్వహించారు.

ఓయూ దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షలు వాయిదా



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కావలసిన ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల వార్షిక పరీక్షలను విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను నిర్వహించు తదుపరి తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు.

22 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, టీజీఎస్పీ విభాగాల్లో కానిస్టేబుళ్లుగా ఎంపికైనప్పటికీ.. వివిధ కారణాల వల్ల ముందస్తు అనుమతితో శిక్షణకు హాజరుకాని అభ్యర్థులకు తిరిగి తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాంటి అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్టు ట్రైనింగ్ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనరేట్ల సీపీలను ఈ మేరకు ఆదేశించారు.

ఎన్‌హెచ్‌ఏఐ జాప్యం.. 'మర్రి'కి శాపం!

చేవెళ్ల రోడ్డు విస్తరణకు కొన్నేళ్లుగా కలగని మోక్షం

- ఆ మార్గంలో ఇరువైపులా 900కిపైగా వందేళ్లు పైబడిన మర్రి చెట్లు
- వాటిని ట్రాన్స్‌లొకేట్ చేసేందుకు పదేళ్ల క్రితమే ముందుకొచ్చిన సంస్థలు
- స్పందించని ఎన్‌హెచ్‌ఏఐ.. ఈలోగా చెట్ల తరలింపు వద్దంటూ ఎన్‌జీటీలో దాఖలైన కేసులు
- దీంతో ఇప్పటికే 150 మర్రి చెట్ల మొదళ్లకు నిప్పుపెట్టి కూల్చేసిన రియల్ వ్యాపారులు



ఇది దాదాపు 85 ఏళ్ల నుంచి 100 ఏళ్ల వయసున్న మర్రి వృక్షం. దీని మొదలును ఇదిగో ఇలా కాల్చేశారు. క్రమంగా మొదలు భాగం పటుత్వం కోల్పోయి కొమ్మల బరువు మోయలేక ఈ వృక్షం త్వరలో నేల కూలేలా ఉంది.

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్–మన్నెగూడ మధ్య రోడ్డు విస్తరణలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చేస్తున్న జాప్యం వందేళ్ల నాటి మర్రి చెట్లకు శాపంగా మారింది. 46 కి.మీ. నిడివిలో ఎన్‌హెచ్‌ఐఏ రోడ్డును 60 మీటర్ల మేర విస్తరించాల్సి ఉండగా మన్నెగూడ నుంచి పరిగి మీదుగా రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డును జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్) కొన్నేళ్ల క్రితమే విస్తరించింది. కానీ ఎన్‌హెచ్‌ఏఐ మాత్రం తన పరిధిలోని రోడ్డు విస్తరణ విషయంలో ఓ ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తుండటం ఇప్పుడు వాహనదారుల ప్రాణాలు, భారీ మర్రి వృక్షాలపాలిట శాపంగా మారింది. ప్రతిపాదిత 46 కి.మీ. నిడివిలో రోడ్డుకు ఇరువైపులా వెయ్యికిపైగా వృక్షాలున్నాయి. వాటిలో 980 వరకు మర్రి చెట్లు ఉండేవి. తర్వాత ఆ సంఖ్యను ఎన్‌హెచ్‌ఏఐ 900కు కాస్త అటుఇటుగా లెక్కగట్టింది. హైదరాబాద్ చుట్టూ విస్తరించిన రోడ్లలో ఇంత వయసున్న మర్రి చెట్లు ఇంకెక్కడా లేవు. పదేళ్ల క్రితం రోడ్డు విస్తరణ ప్రతిపాదన రాగానే ఆ వృక్షాలను కాపాడేందుకు రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ప్రకృతి ప్రేమికులు ప్రభుత్వాన్ని కోరారు. కానీ రోడ్ల విస్తరణకు ఈ ప్రాంతంలో భూసేకరణ సాధ్యం కాదన్న ఎన్‌హెచ్‌ఏఐ... ఉన్న రోడ్డునే విస్తరించాలని నిర్ణయించింది. దీంతో రెండు వైపులా ఉన్న మర్రి వృక్షాలను ట్రాన్స్‌లొకేట్ (మరో ప్రాంతానికి తరలించి) చేసి నాటాలన్న అంశం తెరపైకి వచ్చింది. అప్పట్లోనే కొన్ని సంస్థలు ఆ ప్రక్రియ చేపట్టేందుకు ముందుకొచ్చాయి. వెంటనే ఎన్‌హెచ్‌ఏఐ ఆ పని చేపట్టి ఉంటే ఈ పాటికి రోడ్డు విస్తరణ కూడా పూర్తయ్యేది. కానీ కాలయాపన చేయడంతో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి రోడ్డు విస్తరణే నిలిచిపోయింది.



కాల్చివేయగా ఇటీవల కూలిపోయిన ఓ భారీ మర్రి వృక్షం.

తరలిస్తే చెట్లు బతకవంటూ..

కొందరు వృక్ష ప్రేమికులు ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దాదాపు వందేళ్ల వయసున్న మర్రి వృక్షాలను ట్రాన్స్‌లొకేట్ చేస్తే మనలేవని, వాటిని అలాగే ఉంచాలని, రోడ్డు విస్తరణ బదులు కొత్త అలైన్‌మెంట్‌ను ప్రత్యామ్నాయంగా అనుసరించాలని నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో ఆ వృక్షాలను తొలగిస్తే పర్యావరణంపై పడే ప్రభావం ఏమిటో తెలుసుకొనేందుకు పర్యావరణ ప్రభావ మదింపు అధ్యయనం నిర్వహించాలని గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశించింది. అయితే ఇప్పటివరకు ఎన్‌హెచ్‌ఏఐ ఆ నివేదికను ట్రిబ్యునల్‌కు అందించలేదని తెలిసింది. దీంతో రోడ్డు విస్తరణ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేల కూలుతున్నాయి..

ఆ రోడ్డు ఇరుకుగా మారడం, సాంకేతికంగా ఎన్నో లోపాలుండటంతో ఏటా సగటున ఆ రోడ్డుపై 300 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎందరో వాహనదారులు మృత్యువాతపడుతున్నారు. వందల మంది గాయపడుతున్నారు. దీంతో రోడ్డును విస్తరించాలని జనం గగ్గోలు పెడుతున్నారు. రోడ్డు విస్తరిస్తే ఆ ప్రాంతంలో భూముల ధరలూ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో స్థానికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మర్రి వృక్షాలను నేలకూలుస్తున్నారు. రాత్రివేళ చెట్ల మొదళ్లలో నిప్పు రాజేసి మొదలు బలహీనపడేలా చేస్తున్నారు. ఫలితంగా క్రమంగా చెట్టు ఒరిగి కూలిపోతుంది. ఇలా ఇప్పటికి 150 చెట్లను కూల్చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎన్‌హెచ్‌ఏఐ మాత్రం స్పందించట్లేదు. సమస్య పరిష్కారానికి చొరవ చూపట్లేదు. విస్తరణ ఆలస్యానికి కారణాలు కూడా చెప్పకుండా గోప్యత పాటిస్తోంది.

రైతు నేస్తం..!

- క్రిమిసంహారక మందుల నుంచి కాపాడే వస్త్రం తయారీ
- హైదరాబాద్ సైంటిస్ట్ ప్రవీణ్ వేముల వినూత్న ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: పంటను కాపాడుకునేందుకు రైతులు క్రిమిసంహారక మందులు వాడుతారు. అవి వాడటం వల్ల రైతుల ఆరోగ్యానికి కూడా హానికరమే. వీటిని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త వేముల ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక వస్త్రం తయారు చేశారు. బెంగళూరులోని స్టెమ్ సెల్ సైన్స్ అండ్ రీ జెనరేటివ్ మెడిసిన్ సంస్థలో ఆయన పరిశోధనలు చేస్తున్నారు. సంస్థలోని పరిశోధక బృందంతో కలిసి ప్రవీణ్ ఈ వస్త్రాన్ని అభివృద్ధి పరిచారు. ఈ వస్త్రంతో రైతులకు ప్రత్యేకమైన సూట్స్, మాస్కులు తయారు చేశారు. వీటిని ధరించడం వల్ల క్రిమిసంహారకాల వల్ల కలిగే దుష్పరిణామాలను తగ్గించవచ్చని ప్రవీణ్‌కుమార్ చెబుతున్నారు.

నేచర్ జర్నల్‌లో ప్రచురణ

ఆక్సైమ్ అనే కెమికల్ ఫార్ములా ద్వారా తయారైన ఈ యాంటీ ఇన్‌సెక్టిసైడ్ ఫ్యాబ్రిక్.. చర్మం, ముక్కుల్లోకి క్రిమిసంహారకాలు వెళ్లకుండా అడ్డుకుంటాయన్నారు. ఈ పరిశోధన వివరాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఎలుకలపై పరిశోధన

ఆక్సైమ్ ద్వారా తయారుచేసిన ఈ వస్త్రాల పనితీరును ఎలుకలపై పరిశోధించారు. ఈ పరిశోధనల్లో 100 శాతం అద్భుతంగా పనిచేసిందని శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని ఎలుకలపై క్రిమిసంహారక మందులను నేరుగా స్ప్రే చేయగా, మరికొన్ని ఎలుకలపై ఈ వస్త్రంతో కప్పి ఉంచి మందులను స్ప్రే చేశారు. వస్త్రం కప్పి ఉన్న ఎలుకలపై మందుల ప్రభావం పడలేదని, మిగిలిన ఎలుకలు చనిపోయాయని వెల్లడించారు.



'మీ ఇంట్లో టీనేజర్లు ఉన్నారా..? అయితే మీ పిల్లల ప్రవర్తనపై ఓ కన్నేసి ఉంచండి..' అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి పరిణామాలపై అప్రమత్తం చేస్తున్నారు. డ్రగ్స్ ముఠాలు పాఠశాలల్లోని తొమ్మిది, ఆపై తరగతుల పిల్లలను లక్ష్యం చేసుకుంటున్నట్టు వారు పేర్కొంటున్నారు. కొందరు డ్రగ్ పెడ్లర్లు విద్యార్థులకు మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్నట్టుగా ఓ కేసు దర్యాప్తులో భాగంగా వెల్లడైందని వారు తెలిపారు. డ్రగ్స్ ముఠాలు అమాయకులైన యుక్త వయస్సులోని విద్యార్థులను వారి బలహీనతలు ఆసరాగా చేసుకుని గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వారికి అలవాటు చేసే దారుణ కృత్యాలకు పాల్పడుతున్నాయని హెచ్చరించారు. – సాక్షి, హైదరాబాద్

'వాటర్‌మిలన్.. బ్లూబెర్రీ'లతో జాగ్రత్త

టీనేజీ పిల్లల తల్లిదండ్రులకు పోలీసుల హెచ్చరిక

- పాఠశాలల విద్యార్థులను టార్గెట్ చేస్తున్న డ్రగ్స్ ముఠాలు
- డ్రగ్స్‌కు కోడ్ లాంగ్వేజ్ పెట్టి మరీ విక్రయాలు
- అప్రమత్తత అవసరమని సూచన
- ఎలాంటి ఫిర్యాదులున్నా డయల్ 100, 8712671111

టీనేజర్లే లక్ష్యంగా..

గతానికి భిన్నంగా ఇప్పుడు డ్రగ్స్ ముఠాలు పెద్ద పెద్ద కాన్వెంట్ స్కూళ్లను, ఇతర ప్రముఖ స్కూళ్లను టార్గెట్ చేసుకుంటున్నాయి. ఇటీవల కొంపల్లి ప్రాంతంలోని ఓ పాఠశాలలోని విద్యార్థులతో ఓ పెడ్లర్ టచ్‌లో ఉన్నట్టుగా ఓ విద్యార్థి తల్లిదండ్రులు గమనించారు. ఈ సమాచారం పోలీసులకు చేరవేడయంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదే తరహాలో హైదరాబాద్ నగరంలోని కొన్ని పాఠశాలల్లోనూ డ్రగ్ పెడ్లర్ల కదలికలపై పోలీసులతో పాటు టీజీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు ఫోకస్ పెంచినట్టు సమాచారం. యుక్త వయస్సు ప్రారంభంలో ఉండే తొమ్మిది నుంచి పై తరగతుల విద్యార్థులకు డ్రగ్స్ వాడకం అనేది కొత్త అనుభూతి అని, అది రుచి చూస్తే తప్పేంలేదన్న భావనను కొందరు వారిలో కల్పిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు.

డ్రగ్స్ సమాచారం తెలిస్తే చెప్పండి

గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠిన వైఖరితో ఉండడంతో పాటు డ్రగ్స్ మహమ్మారిని తుదముట్టించేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. గంజాయి, ఇతర డ్రగ్స్‌కు సంబంధించి ఏ చిన్న సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ప్రజలను కోరుతోంది. 8712671111 నంబర్‌కు సమాచారం ఇస్తే తగిన ప్రోత్సాహకాలు ఉంటాయని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. డ్రగ్స్‌పై సమాచారం డయల్ 100కు కూడా అందించవచ్చని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వెనిలా ఐస్‌క్రీం.. డబుల్ ఆపిల్

వాటర్ మిలన్, బ్లూబెర్రీ, వెనిలా ఐస్‌క్రీం, ఆపిల్ పీచ్, బ్లూ రాస్బెర్రీ, మ్యాంగో పీచ్ వాటర్‌మిలన్, డబుల్ ఆపిల్, స్ట్రాబెర్రీ బనాన, ఎనర్జీ డ్రింక్, మింట్ ఐస్, వాటర్ మిలాన్ సోర్ పీచ్..లాంటి పేర్లను డ్రగ్స్‌కు కోడ్ వర్డ్‌లుగా పెడ్లర్లు వాడుతున్నారు.

ఓ కన్నేసి ఉంచండి

తొమ్మిదో తరగతి దాటిన పిల్లల ప్రవర్తనను, వారు వాడుతున్న ఎలక్ట్రానిక్ డివైస్‌లను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ ఉండాలి. ఎదిగే పిల్లలకు చెడు దారులు సైతం ఎదురవుతాయి. మంచి–చెడు మధ్య తేడా తెలియని టీనేజ్ వారినే డ్రగ్స్ మాఫియా టార్గెట్ చేస్తుంది. వారికి డ్రగ్స్ ఎరగా వేస్తోంది. అప్రమత్తంగా ఉండడం మన బాధ్యత. ఏదైనా అనుమానం ఉంటే డయల్ 100కు కాల్ చేయండి

– ఎక్స్‌లో తెలంగాణ పోలీసుల హెచ్చరిక

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.